www.andhrajyothy.com
పేజీలు: 14
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 158

సోమవారం | 22-9-2025

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: పాడ్యమి రా2.55 తదుపరి విదియ, నక్షత్రం: ఉత్తర ఉ.11-24 తదుపరి హస్త, వర్జ్యం: రా.8.35-10.20, దుర్ముహూర్తం: మ.12.31-1.19, మ.2.55-3.43, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: ఉ. 7.30-9.00, సూర్యోదయం: 6.07, సూర్యాస్తమయం: 6.07

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఇంద్రకీలాద్రికి దసరా శోభ

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

ఈ ఏడాది 20 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా 8

◀ విద్యుత్ వెలుగుల్లో దుర్గమ్మ ఆలయం

అనుకున్నదే అవుతోంది. వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భార్య మేడం భారతీ రెడ్డి రంగంలోకి దిగేశారు. ఇన్నాళ్లు 'బిజినెస్' వ్యవహారాలు మినహా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్న ఆమె.. ఇప్పుడు వైసీపీ నేతలతో మాటామంతీ కలుపుతున్నారు. పార్టీ అంతర్గత వ్యవహారాలపై ఆరా తీస్తున్నారు. గత కొద్ది రోజులుగా ఈ వ్యవహారం చాపకింద నీరులా సాగుతోంది.

> ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయాక జగన్ అసెంబ్లీ ముఖమే చూడటం మానేశారు. అప్పుడప్పుడు పెళ్లిళ్లు, చావులకు వెళ్లడం తప్ప ప్రజా ఉద్యమాలకూ దూరం. చాలా వరకు ప్యాలె‌స్‌కే పరిమితం. తాడేపల్లి లేదంటే బెంగళూరులో ఉంటున్నారు. మరోవైపు ఆయన హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్‌లో 'అరెస్ట్'పై రకరకాల వదంతులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన భార్య భారతి 'ఎంట్రీ' అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది.

ప్రస్తుత పరిస్థితుల్లో జగన్‌తో పాటు భారతి కూడా పార్టీ బాధ్యతలను భుజాలపై వేసుకుంటారా? లేదా జగన్‌కు ప్రత్యామ్నాయంగా ఆమెను సిద్ధం చేస్తున్నారా? అన్నదానిపై స్పష్టత లేదు. కానీ భారతి ఎంట్రీ(?) మాత్రం ఖరారైంది.



బరిలోకి భారతి!

వైసీపీ ముఖ్య నేతలతో మాటామంతీ

- పార్టీ అంతర్గత వ్యవహారాలపై చర్చ.. ఎవరెవరు ఏం చేస్తున్నారంటూ ఆరా
- జగన్ నమ్మినబంటు, రిటైర్డ్ అధికారి ఫోన్ నుంచి పెద్ద లీడర్లతో మంతనాలు
- మధ్య, దిగువ శ్రేణి నాయకులైతే ఓ స్థాయి నేతల ద్వారా సూచనలు
- కొన్నాళ్లుగా చాపకింద నీరులా వ్యవహారం.. భారతి 'ఎంట్రీ'పై పార్టీలో కలకలం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ అధ్యక్షుడు జగన్ సతీమణి భారతి ఇప్పటి వరకూ ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు. బహిరంగంగా పార్టీ నేతలతో మాట్లాడటం, చర్చలు జరపడం ఎప్పుడూ లేదు. 2012లో జగన్ అరెస్ట్ అయినప్పుడు, 2019 ఎన్నికల సమయంలో మాత్రం ఆమె సొంతగడ్డలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పులివెందులలో బంధువర్గం, పార్టీ ముఖ్యనేతలతో ఎప్పుడన్నా ఒకసారి మాట కలిపేవారు. మిగతా 'బిజినెస్' వ్యవహారాలు తప్ప రాజకీయాల గురించి ఆమె పార్టీ నేతలతో చర్చించిన దాఖలాలు లేవు. కానీ గత కొద్ది రోజులుగా భారతి యాక్టివ్ అయిపోయారు. పార్టీ నాయకులతో మాటలు కలుపుతున్నారు. ఎక్కడ ఏం జరుగుతోంది? పార్టీలో ఎవరెవరు ఏం చేస్తున్నారు? మనం ఏమి చేయాలంటూ ఆమె ఆరా తీస్తున్నారు. భారతి 'సడెన్ ఎంట్రీ' ఆ పార్టీలో కలకలం రేపుతోంది. 'బిజినెస్' వ్యవహారాల్లో ఆమె అత్యంత జాగ్రత్తగా ఉన్నట్టుగా, ఇప్పుడు పార్టీ నేతలతో సంప్రదింపుల్లో

మిగతా 13వ పేజీలో...

జీఎస్టీ జోష్..!

నేటి నుంచే పన్నుల తగ్గింపు అమలు

> నేటి నుంచి జీఎస్టీ ఉత్సవం ప్రారంభం కాబోతోంది. దేశంలో కొత్త చరిత్ర మొదలవుతోంది. సంస్కరణ అనేది నిరంతర ప్రక్రియ. కాలం మారుతున్న కొద్దీ, దేశ అవసరాల దృష్ట్యా కొత్త సంస్కరణలు అవసరం. అందుకే.. జీఎస్టీ 2.0ను ప్రవేశపెట్టి మరో చరిత్రకు నాంది పలికాం.
>
> - ప్రధాని నరేంద్ర మోదీ




- భారీగా తగ్గనున్న వస్తువుల ధరలు
- నిత్యావసర వస్తువుల నుంచి కార్ల దాకా
- ఔషధాల నుంచి టీవీల దాకా ధర తగ్గింపు
- ఇప్పటికే తగ్గింపును ప్రకటించిన కంపెనీలు
- తమ డీలర్లకు కొత్త ధరల పట్టిక చేరవేత
- ధరల తగ్గుదలతో దేశ ప్రజల్లో హర్షాతిరేకాలు
- దసరా నవరాత్రి ప్రారంభం రోజే సంబరాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: దసరా నవరాత్రి ఉత్సవాలు.. దేశ ప్రజలకు ఈసారి సంబరాలు తెచ్చాయి. వస్తుసేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణలు సోమవారం నుంచే అమలులోకి రానున్నాయి. ఆహార పదార్థాల నుంచి గృహోపకరణాలు, బైక్‌ల నుంచి కార్లు, ఎయిర్ కండీషనర్ల నుంచి టీవీల దాకా అన్ని వస్తువుల ధరలూ గణనీయంగా తగ్గనున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలోని జీఎస్టీ కౌన్సిల్ ఈ నెల మొదటి వారంలో ఆమోదించిన పన్ను శ్లాబుల తగ్గింపు ఆచరణలోకి రానుంది. ఇప్పటిదాకా 5, 12, 18, 28 శాతంతో నాలుగు శ్లాబులుగా అమల్లో ఉన్న జీఎస్టీ పన్ను.. పేద, మధ్య తరగతి

మిగతా 2వ పేజీలో...

నవ శకం ఆరంభం

- నేటి నుంచి దేశంలో జీఎస్టీ పొదుపు ఉత్సవం
- జీఎస్టీ 2.0తో పేద, మధ్య తరగతికి డబుల్ బొనాంజా
- కొత్త సంస్కరణలతో ఆత్మనిర్భరత, వేగంగా దేశాభివృద్ధి
- ప్రతి ఒక్కరూ స్వదేశీ ఉత్పత్తులనే వినియోగించండి
- జాతినుద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ సందేశం 2



జీఎస్టీపై తెలుగులో తెచ్చిన 11 జీవోల బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ అహ్మద్‌బాబు

రాష్ట్రంలో అమల్లోకి కొత్త శ్లాబులు

- పేద, మధ్యతరగతి వర్గాలకు భారీ ఊరట
- తెలుగులో జీఎస్టీ 2.0 సంస్కరణల ఉత్తర్వులు
- 11 జీవోల బుక్‌లెట్‌ను ఆవిష్కరించిన బాబు
- కొత్త విధానంపై అధికారులతో సీఎం సమీక్ష

అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ విధానంలో కొత్త అధ్యాయం మొదలైంది. పేదలు, మధ్యతరగతి వర్గాలపై పన్నుల భారాన్ని తగ్గిస్తూ కేంద్రం ప్రకటించిన సంస్కరణలు ఆదివారం అర్ధరాత్రి నుంచే అమలులోకి వచ్చాయి. 2017 నుంచి 4 శ్లాబులను అమలు చేస్తుండగా జీఎస్టీ కౌన్సిల్ వాటిని రెండుకు కుదించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ నెల 22 నుంచి ప్రజల దైనందిన జీవితంలో వినియోగించే అనేక వస్తువులపై పూర్తిగా పన్ను మినహాయింపు లభించనుంది. నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా తగ్గనున్నాయి. ఇప్పటివరకు 12 శాతం శ్లాబు పరిధిలో ఉన్న 99శాతం వస్తువులు 5 శాతం పరిధిలోకి వచ్చాయి. అటు ఉత్పత్తిదారులు, వ్యాపారులు, ఇటు వినియోగదారులకు భారీ ఊరట కల్పించే జీఎస్టీ సంస్కరణలను సమర్థంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కొత్త పన్నుల విధానాన్ని ప్రజలు సులువుగా అర్థం చేసుకునేందుకు వీలుగా జీఎస్టీ 2.0కు సంబంధించిన

మిగతా 12వ పేజీలో...

హెచ్-1బీ రుసుము ఒక్కసారే!

- కొత్త వీసాదారులకు మాత్రమే
- ప్రస్తుత వీసాదారులకు వర్తించదు
- రెన్యువల్స్‌కు కూడా రుసుము ఉండదు
- హెచ్-1బీ వీసాదారులు అమెరికా నుంచి రాకపోకలు సాగించవచ్చు
- లక్ష డాలర్ల ఫీజుపై శ్వేతసౌధం వివరణ
- భారతీయులకు అత్యవసర హెల్ప్‌లైన్

భారత్ చుట్టూ.. అమెరికా ఉచ్చు?

మన దేశాన్ని కావాలని టార్గెట్ చేసినట్టుగా వరుస పరిణామాలు

వాషింగ్టన్, సెప్టెంబరు 21: అమెరికాలో ఐటీ, ఇతర ప్రత్యేక నైపుణ్య ఉద్యోగాలు చేయడానికి అవసరమైన హెచ్1బీ వీసాలకు లక్ష డాలర్ల రుసుమును విధిస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకోగా.. ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా భారతీయ ఐటీ నిపుణులపై ఈ నిబంధన తీవ్ర ప్రభావం చూపనుంది. ఈ క్రమంలో లక్ష డాలర్ల రుసుముపై శ్వేతసౌధం వివరణ ఇచ్చింది. ట్రంప్ తీసుకొచ్చిన కొత్త నిబంధనపై శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ 'ఎక్స్'లో స్పష్టత ఇచ్చారు. హెచ్-1బీ వీసాపై

మిగతా 11వ పేజీలో...



అమెరికా టికెట్ల ధర పెరుగుదల..

ఓ భారీ కుట్ర!

- విమాన సీట్లను బ్లాక్ చేసి కృత్రిమ డిమాండ్ సృష్టించిన మాగా, 4చాన్
- భారతీయుల్ని అడ్డుకునేందుకు పన్నాగం

ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై నేడు భారత్-అమెరికా చర్చలు




70 ఏళ్లుగా వాళ్లు చేస్తే రైటు..

మేం చేస్తే తప్పా?

ఈవీఎంల హ్యాకింగ్‌పై ఢిల్లీ సీఎం రేఖ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: "డెబ్బై సంవత్సరాలుగా వాళ్లు (కాంగ్రెస్) ఈవీఎంలను హ్యాక్ చేస్తున్నారు. అప్పుడేం కాలేదు. మేం చేస్తే తప్పుగా అనిపిస్తోంది" ..ఢిల్లీ సీఎం రేఖా గుప్తా చేసిన వ్యాఖ్యలివి! ఎన్డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. "మీరు ఈవీఎంలను హ్యాక్ చేస్తున్నారని రాహుల్ గాంధీ అంటున్నారు కదా?" అనే ప్రశ్నకు రేఖా గుప్తా ఇలా బదులిచ్చారు. "వాళ్లు గెలిస్తే ప్రజాతీర్పు

మిగతా 2వ పేజీలో...



2

2047 తర్వాతే మోదీ రిటైర్మెంట్

రాబోయే అనేక ఎన్నికల వరకు ప్రధాని పదవి ఖాళీ ఉండదు: రాజ్‌నాథ్ సింగ్



2.5 రెట్లు పెరిగిన ఖర్చు

జీతాలు, పెన్షన్లు, రుణ చెల్లింపులకే రాష్ట్రాల సొమ్ములన్నీ ఖతం

- వీటిపై పదేళ్లలో భారీగా పెరిగిన వ్యయం
- మొత్తం రెవెన్యూ ఖర్చులో దాదాపు సగం
- వీటికి రాయితీలు, గ్రాంట్లు అదనం
- కాగ్ తాజా నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: దేశంలోని అన్ని రాష్ట్రాలూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. గత దశాబ్ద కాలంలోనే రాష్ట్రాల రుణభారం ఏకంగా మూడు రెట్లు పెరిగిపోవడంపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. 2013-14 ఆర్థిక సంవత్సరం నాటికి 28 రాష్ట్రాల అప్పులు రూ.17.57 లక్షల కోట్లు ఉండగా, 2022-23 నాటికి రూ.59.60 లక్షల కోట్లకు చేరాయని వెల్లడించింది. దీంతో పాటుగా అప్పులు, రాష్ట్రాల అభివృద్ధి అవకాశాలకు ఎదురవుతున్న ఆర్థిక సవాళ్లపై కాగ్ తాజా నివేదికలో పలు కీలక అంశాలను ప్రస్తావించింది. రాష్ట్రాలు ఎక్కువగా వేతనాలు, పింఛన్లు, రుణాల వడ్డీల చెల్లింపులపై అధిక భాగం వ్యయం చేస్తున్నట్లు పేర్కొంది. ఈ ఖర్చు అన్ని రాష్ట్రాల వ్యాప్తంగా పదేళ్లలో 2.49 రెట్లు పెరిగిందని

మిగతా 2వ పేజీలో...



అభిషేక్ శర్మ


పాక్‌కు 'సూపర్' పంచ్..!

10

- ఆసియా కప్ సూపర్-4లో ఆరు వికెట్ల తేడాతో టీమిండియా జయకేతనం
- 172 పరుగుల లక్ష్యాన్ని అలవోకగా ఛేదించిన భారత్
- బ్యాటింగ్‌లో అదరగొట్టిన అభిషేక్, గిల్, తిలక్

2047 తర్వాతే మోదీ రిటైర్మెంట్

» రాబోయే అనేక ఎన్నికల వరకు ప్రధాని పదవి ఖాళీ ఉండదు: రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంపూర్ణ విశ్వాసం ప్రకటించారు. బీజేపీలో తిరుగులేని నాయకుడు ఆయనేనని, రానున్న చాలా ఎన్నికల వరకు ఆయనే ప్రధాని అభ్యర్థి అని చెప్పారు. 2047లో భారత స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలు నిర్వహించిన తరువాతనే ఆయన రిటైర్ అవుతారని ప్రకటించారు. ఓ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ "చాలా చిన్న వాస్తవం ఏమిటంటే... సమీప భవిష్యత్తులో ప్రధాని పదవికి ఎలాంటి ఖాళీ ఏర్పడబోదు. రానున్న ఎన్నికల్లో మోదీజీయే మా పార్టీ అభ్యర్థిగా ఉంటారు. 2029, 2034, 2039, 2044 ఎన్నికల్లోనూ ఆయనే మా పార్టీ అభ్యర్థి. 2047లో దేశ స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలు జరిగిన తరువాత ఆయన రిటైర్ అవుతారు" అని చెప్పారు. తనకు 1980 నుంచి మోదీతో సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ప్రజలతో మమేకమయ్యే అరుదైన సామర్థ్యం ఆయనలో ఉందని ప్రశంసించారు. సంక్లిష్టమైన సమస్యలను సులువుగా పరిష్కరిస్తారని, క్లిష్ట సమయాల్లో సరైన నిర్ణయం తీసుకుంటారని అన్నారు. ప్రపంచ సమస్యలపై ఇతర దేశాల నాయకులు సయితం ఆయన సలహాలు తీసుకుంటారని చెప్పారు. అంతమంది ప్రపంచ నాయకుల నుంచి పుట్టిన రోజు శుభాకాంక్షలు అందుకున్న మరో ప్రధానిని తాను చూడలేదని అన్నారు. పహల్గాం ఉగ్రదాడిపై ప్రభుత్వం స్పందించిన తీరే మోదీ వ్యవహార శైలికి నిదర్శనమని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చే ముందు ఆయన మూడు దళాల అధిపతులు, జాతీయ భద్రత సలహాదారుతో చర్చలు జరిపారని అన్నారు. 2013లో మోదీని బీజేపీ జాతీయ ప్రచార కన్వీనర్‌గా, అనంతరం ప్రధాని అభ్యర్థిగా ప్రకటిస్తూ పార్టీ పార్లమెంటరీ బోర్డు ప్రకటించిన తీరును రాజ్‌నాథ్ సింగ్ గుర్తు చేసుకున్నారు. ఆ సందర్భంగా సీనియర్ నాయకుడు ఎల్‌కె. అద్వానీని అగౌరవపరచలేదని, కానీ మోదీ నాయకత్వం కావాలని దేశ ప్రజలు కోరుకున్నారని తెలిపారు.

70 ఏళ్లుగా వాళ్లు చేస్తే రైటు.. మేం చేస్తే తప్పా?

(మొదటి పేజీ తరువాయి)

అంటారు. మేం గెలిస్తే ఈవీఎం హ్యాక్ అంటారు. ఈ ఫార్ములా ఏ పుస్తకంలో ఉందో ఎవరైనా చెబుతారా నాకు? రాహుల్‌గాంధీ దీన్ని ఎక్కడ చదువుకున్నారు? దేశప్రజలను తప్పుదోవ పట్టించడం ఆయనకు ఇంకేమైనా వచ్చా?" అని ప్రశ్నించారు. "ఢిల్లీ సీఎం ఏం చెబుతున్నారు" అంటూ.. ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆ ఇంటర్వ్యూలోని 13 సెకన్ల వీడియో బిట్‌ను 'ఎక్స్'లో పోస్ట్ చేయగా.. అది విస్తృతంగా వైరల్ అవుతోంది. అయితే.. అది 'ట్రిమ్' చేసిన వీడియో అని.. పూర్తి వీడియో ఇదీ అంటూ కొన్ని ఫ్యాక్ట్‌చెక్ వెబ్‌సైట్లు ఒక నిమిషం ఇరవై సెకన్ల వీడియోను పోస్ట్ చేశాయి. పూర్తి వీడియోలో సైతం అవే వ్యాఖ్యలు ఉండడం గమనార్హం.

రెండు దశల్లో బిహార్ పోలింగ్!

» అక్టోబరు తొలి వారంలో షెడ్యూల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రకటనకు కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) సమాయత్తమవుతోంది. రెండు దశల్లో వీటిని నిర్వహిస్తారని ఈసీ వర్గాలు తెలిపాయి. అక్టోబరు మొదటి వారంలో షెడ్యూల్ ప్రకటించే అవకాశముందని వెల్లడించాయి. మహిళల ఓట్లే లక్ష్యంగా సీఎం నితీశ్‌కుమార్ అమలు చేస్తున్న పథకాలు, కులగణన, జీఎస్‌టీ 2.0 సంస్కరణలతో నిత్యావసరాలు, విలాస వస్తువుల ధరలు తగ్గుతుండడం.. ఓట్ల చోరీ, ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ నిర్వహించిన ఓటర్ అధికార యాత్ర, ఆర్‌జేడీ సీఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ చేపట్టిన బిహార్ అధికార యాత్ర, ఎన్‌డీఏ పక్షాల ర్యాలీలు, ప్రధాని మోదీ పర్యటనలతో ఇప్పటికే రాష్ట్రంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అన్ని కూటములూ ఎన్నికల ప్రకటన ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్నాయి. ఈ నెలాఖరుకల్లా తుది ఓటర్ల జాబితాను ప్రకటించి.. వచ్చే నెల మొదటి వారంలో షెడ్యూల్ ప్రకటించనున్నట్లు ఈసీ వర్గాలు పేర్కొన్నాయి.

దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రక్షాళన!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: దేశవ్యాప్తంగా సమగ్ర ఓటర్ల సవరణ(ఎస్ఐఆర్) చేపట్టేందుకు ఎన్నికల కమిషన్(ఈసీ) సమాయత్తమవుతోంది. అక్టోబరులో అన్ని రాష్ట్రాల్లోని ఓటర్ల జాబితాల ప్రక్షాళన చేపట్టే అవకాశముందని తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఈ నెల (సెప్టెంబరు) 30 నాటికి ఇందుకోసం సిద్ధం కావాలని అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారు(సీఈవో)లను ఈసీ ఆదేశించింది. ఇటీవల ఢిల్లీలో సీఈవోలు, ఎన్నికల సంఘం అధికారులతో ఈసీ ఒక సమావేశం నిర్వహించింది. దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ చేపట్టడంపై ఆ సమావేశంలోనే అధికారులకు మార్గనిర్దేశనం చేసినట్లు సమాచారం. చివరిసారి ఎస్ఐఆర్ చేపట్టిన ఓటరు జాబితాలను సిద్ధం చేసుకోవాలని, ఈ ప్రక్రియను రాబోయే పది పదిహేను రోజుల్లో పూర్తి చేసుకుని సిద్ధంగా ఉండాలని అన్ని రాష్ట్రాల సీఈవోలను ఈసీ ఆ సమావేశంలోనే ఆదేశించింది.

కొత్తగా చైనా 'కే-వీసా'

» వచ్చే నెల 1 నుంచి అందుబాటులోకి..

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: అమెరికా హెచ్-1బీ వీసా ఫీజును భారీగా పెంచిన తరుణంలో యువ ప్రతిభను ఆకట్టుకునేందుకు చైనా కీలక నిర్ణయం తీసుకుంది. కొత్తగా 'కే-వీసా'ను ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. ఇది అక్టోబరు 1 నుంచి అమలులోకి రానుంది. సైన్స్, టెక్నాలజీ రంగాల్లో విదేశీ నిపుణులను.. ముఖ్యంగా అమెరికా కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల కోసం చూస్తున్న దక్షిణాసియాకు చెందిన వారిని ఆకట్టుకోవడానికి చైనా 'కే-వీసా'ను ప్రకటించిందని పరిశీలకులు పేర్కొంటున్నారు. ప్రముఖ విశ్వవిద్యాలయాల నుంచి పట్టభద్రులైన వారు 'కే-వీసా' కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చైనా ప్రభుత్వం తెలిపింది. చైనాకు సంబంధించి 12 సాధారణ వీసా క్యాటగిరీలు ఉండగా కొత్త 'కే-వీసా'కు పలు నిబంధనలు సడలిస్తారని భావిస్తున్నారు. ముఖ్యంగా అమెరికా హెచ్-1బీ దక్కాలంటే అక్కడి సంస్థలు ఉద్యోగావకాశం ఇవ్వాలి. 'కే-వీసా'కు అలాంటి అవసరం ఉండదు. 'కే-వీసా' గడువు ఎక్కువ ఉండడంతో పాటు ఎక్కువసార్లు రాకపోకలు సాగించడానికి అవకాశం కల్పించనున్నారు.



జుబిన్ గార్గ్ అంతిమ యాత్రకు వేలాది మంది

గువాహటి, సెప్టెంబరు 21: బాలీవుడ్ ప్రముఖ గాయకుడు అసోంకు చెందిన జుబిన్ గార్గ్ సింగపూర్‌లో మరణించగా ఆయన మృతదేహం ఆదివారం గువాహటి విమానాశ్రయానికి చేరుకుంది. చివరి చూపు కోసం వేలాది మంది తరలి వచ్చారు. విమానాశ్రయం నుంచి ఆయన ఇంటి వరకు హైవే జన సంద్రమైంది. సింగపూర్‌లో శుక్రవారం లైఫ్ జాకెట్ లేకుండా సముద్రంలో ఈతకు దిగి జుబిన్ చనిపోయారు. కాగా ఆయన మృతిపై విచారణకు ఆదేశించినట్లు అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ తెలిపారు. జుబిన్ మృతిపై అసోంలో అనేక ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిని సీఐడీకి బదిలీ చేసి విచారణ చేపట్టాలని డీజీపీని ఆదేశించినట్లు సీఎం హిమంత చెప్పారు. ఈ అంశంపై భారత్‌లో సింగపూర్ హైకమిషనర్ సైమన్ వాంగ్‌తో కూడా మాట్లాడానని, గాయకుడి మరణంపై లోతైన విచారణ జరిపించాలని కోరానన్నారు.

జీఎస్టీ జోష్!

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు మేలు చేసేలా ఇకపై 5, 18 శాతానికే పరిమితం కానుంది. హానికర వస్తువులకు మాత్రం 40 శాతం ప్రత్యేక పన్ను అమలు కానుంది. కాగా, ఎఫ్ఎంసీజీల నుంచి ఆటోమొబైల్స్ దాకా వివిధ కంపెనీలు జీఎస్టీ తగ్గుదలకు అనుగుణంగా తమ ఉత్పత్తుల ధరను తగ్గిస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించాయి. దాదాపు 375 వస్తువుల ధరలు తగ్గనుండడంతో దేశ ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.

టీవీ కంపెనీ	సైజు(అంగుళాల్లో)	తగ్గనున్న ధర
సోనీ ఇండియా	43	రూ.5,900
	98	రూ.71,000
ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్	43	రూ.2,500
	100	రూ.85,800
ప్యానసోనిక్	75	రూ.32,000



ధరలు తగ్గే వస్తువులు ఇవే..

ఇప్పటిదాకా 12 శాతం పన్ను కలిగిన వివిధ నిత్యావసర వస్తువులు ఇకపై 5 శాతం పన్ను పరిధిలోకి రానున్నాయి. వాటిలో టూత్ పేస్టులు, సబ్బులు, షాంపూలతోపాటు బిస్కట్లు, స్నాక్స్, ఫ్రూట్ జ్యూస్‌లు వంటి ప్యాక్ చేసిన ఆహార పదార్థాల ధరలు తగ్గనున్నాయి. ఇవే కాకుండా.. నెయ్యి, ఘనీభవించిన పాలు వంటి డెయిరీ పదార్థాలు, సైకిళ్లు వంటి వాహనాలు, స్టేషనరీ సామగ్రి, రూ.2500 కన్నా తక్కువ ధర కలిగిన పాదరక్షల ధరలు గణనీయంగా తగ్గనున్నాయి. ఇక ఇప్పటిదాకా 28 శాతం జీఎస్టీ పరిధిలో ఉన్న గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు ఇకపై 18 శాతం పన్ను పరిధిలోకి రానున్నాయి. వీటిలో..ఎయిర్ కండిషనర్లు, రిఫ్రిజిరేటర్లు, డిష్ వాషర్లు, టెలివిజన్లు, సిమెంటు (ప్రత్యేకించి ఇళ్ల నిర్మాణానికి), ఆటోమొబైల్ రంగంలో 1200 సీసీ కన్నా తక్కువ కలిగిన చిన్న కార్లు, ద్విచక్ర వాహనాల ధరలు భారీగా తగ్గనున్నాయి.

ధర తగ్గని వస్తువులు..

జీఎస్టీ సంస్కరణలతో ధరలు తగ్గని వస్తువులు కూడా ఉన్నాయి. హానికర వస్తువులు 40 శాతం పన్ను పరిధిలోకి వస్తాయని జీఎస్టీ మండలి ఇప్పటికే ప్రకటించింది. దీని ప్రకారం.. పొగాకు ఉత్పత్తులు, ఆల్కహాల్, పాన్ మసాలా వంటి వస్తువుల ధరలు మరింత పెరగనున్నాయి. వీటితోపాటు ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ ప్లాట్‌ఫారాలకు పన్ను పెరగనుంది. ఇక పెట్రోలియం ఉత్పత్తులు ప్రస్తుతం జీఎస్టీ పరిధిలో లేనందున వాటి ధరల్లో ఎటువంటి మార్పు ఉండబోదు. వజ్రాలు, ప్రెషియస్ స్టోన్స్ వంటి లగ్జరీ వస్తువుల రేట్లు కూడా అలాగే కొనసాగనున్నాయి.

ధరలు తగ్గించిన కంపెనీలు..

జీఎస్టీ సంస్కరణలు సోమవారం నుంచి అమల్లోకి రానున్న నేపథ్యంలో వాటి పరిధిలోకి వచ్చే వస్తువులను ఉత్పత్తి చేసే సంస్థలు.. ఆయా వస్తువుల ధరను తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. వీటిలో టెలివిజన్ కంపెనీలు, ఆటోమొబైల్ కంపెనీల వంటివి ఉన్నాయి. 32 ఇంచుల కన్నా పెద్దసైజు టీవీలకు జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతం పరిధిలోకి తేవడంతో టీవీ కంపెనీలు కూడా అందుకు అనుగుణంగా ధరను తగ్గించాయి. దీంతో సైజును బట్టి వివిధ రకాల టీవీల ధర రూ.2500 నుంచి రూ.85 వేల దాకా తగ్గనుంది.

రూ.లక్షకు పైగా తగ్గిన కార్ల ధర..

జీఎస్టీ సంస్కరణలకు అనుగుణంగా కార్లు, బైక్‌ల ధరలు భారీగా తగ్గనున్నాయి. మారుతి సుజుకి, మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ వంటి లగ్జరీ కార్ల తయారీ సంస్థలు ఇప్పటికే తాము ధరలు తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. దేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ అయిన మారుతి సుజుకి.. తమ వాహనాల ధరలను సుమారు రూ.1.29 లక్షల దాకా తగ్గించింది. మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ తమ కార్ల ధరలను తగ్గిస్తున్నట్లు గతంలోనే ప్రకటించింది. ఈ నెల మొదటివారం జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం వెలువడిన రోజే తమ ప్యాసింజర్ వాహనాల ధరలను రూ.1.56 లక్షల దాకా తగ్గిస్తున్నట్లు పేర్కొంది. ఈ కంపెనీ కనిష్ఠంగా బొలెరో/నియో రేంజ్ ధరను రూ.1.27 లక్షలు, గరిష్ఠంగా ఎస్‌యూవీ టక్సన్ ప్రీమియం ధరను రూ.2.4 లక్షలు తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇక హోండా కంపెనీ తమ సిటీ కారు ధరను రూ.57,500 తగ్గించగా, కియా ఇండియా ఏకంగా రూ.4.48 లక్షల దాకా తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. కాగా, టొయోటా కిర్లోస్కర్ కారు ధర రూ.3.49 లక్షల దాకా తగ్గనుంది. మరోవైపు లగ్జరీ కారు మెర్సిడెస్ బెంజ్ ధరను ఏ-క్లాస్‌కు రూ.2 లక్షలు, ఎస్-క్లాస్‌కు రూ.10 లక్షల దాకా తగ్గిస్తున్నట్లు ఆ కంపెనీ ప్రకటించింది. ఇక బీఎండబ్ల్యూ అయితే అత్యధికంగా రూ.13.06 లక్షల తగ్గింపును ప్రకటించడం గమనార్హం. ఆడి కంపెనీ కార్లు రూ.2.6 లక్షల నుంచి రూ.7.8 లక్షల దాకా తగ్గింపునకు రానున్నాయి. జాగ్వార్ ల్యాండ్ రోవర్ సైతం గరిష్ఠంగా రూ.30.4 లక్షల దాకా ధర తగ్గించింది.

మారుతి సుజుకి కంపెనీ కార్లు

మోడల్	తగ్గనున్న ధర
ఎస్ ప్రెస్సో	రూ.1,29,600
ఆల్టో కియో	రూ.1,07,600
సెలెరియో	రూ.94,100
వ్యాగన్ ఆర్	రూ.79,600
ఇగ్నిస్	రూ.71,300
స్విఫ్ట్	రూ.84,600
బెలెనో	రూ.86,100
టూర్-ఎస్	రూ.67,200
డిజైర్	రూ.87,700
బ్రెజ్జా	రూ.1,12,700
గ్రాండ్ విటారా	రూ.1,07 లక్షలు

హారియర్, సఫారీ ఎస్‌యూవీ కార్ల ధరలు రూ.1.4 లక్షలు, రూ.1.45 లక్షల చొప్పున తగ్గనున్నాయి.


నిత్యావసరాలు ఇక అగ్వ..

జీఎస్టీ సంస్కరణల కారణంగా దేశ ప్రజలకు నిత్యావసర వస్తువులు అగ్వకు రానున్నాయి. పలు కంపెనీలు తమ ఉత్పత్తుల ధరను తగ్గిస్తున్నట్లు పేర్కొంటూ కొత్త ధరల పట్టికను విడుదల చేశాయి. సబ్బులు, షాంపూలు, బేబీ డైపర్స్, టూత్ పేస్టులు, రేజర్లు, లోషన్లతోపాటు స్నాక్స్, నమ్‌కీన్, భుజియా నుంచి స్వీట్ల దాకా, కాఫీ, టీ, బట్టర్, నెయ్యి, ఐస్‌క్రీమ్, చాక్లెట్లు వంటి వాటి ధరలను సవరిస్తూ కొత్త ఎమ్మార్పీ ట్యాగ్‌లను ఆయా కంపెనీలు తమ డిస్ట్రిబ్యూటర్లకు, కిరాణా స్టోర్లు, ఈ-కామ్‌లకు పంపించాయి. డాబర్, ఐటీసీ, పీఅండ్‌జీ, ఇమామి, అమూల్ వంటి కంపెనీలు తమ ఉత్పత్తుల ధరల తగ్గింపునకు సంబంధించిన వివరాలను తమ వెబ్‌సైట్లలో పేర్కొన్నాయి. ప్రకటనలు ఇచ్చాయి.

షాపుల్లో ధరల తగ్గింపు బోర్డులు

ధరలు తగ్గిన వస్తువులకు సంబంధించి ఆయా దుకాణాలు, షోరూంలలో బోర్డులు ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గింపుతో వస్తువుల ధరలను ఏ మేరకు తగ్గించారన్నదీ అందులో తెలియజేయాల్సిందిగా కోరారు. మరోవైపు ఇప్పటికే పాత ధరలతో ఉన్న వస్తువులకు ధరలు తగ్గితే.. కొత్త ధరతో స్టిక్కర్ అంటించాల్సిందిగా సూచించారు.

లోకం తీరు



బైక్‌ల ధర రూ.19 వేల దాకా తగ్గింపు..

ద్విచక్ర వాహనాల ధరలు కూడా గణనీయంగా తగ్గనున్నాయి. హీరో కంపెనీ బైక్‌లు, స్కూటర్ల ధరలను రూ.15,743 దాకా తగ్గించగా, హోండా కంపెనీ 350 సీసీ వాహనాల వరకు రూ.18,800 దాకా తగ్గిస్తున్నట్లు ప్రకటించింది.

చౌకగా ఔషధాలు..

జీఎస్టీ రేట్ల తగ్గింపుతో ఔషధాలు, వైద్య పరికరాలు ఇకపై చౌకగా లభించనున్నాయి. ఇదివరకు 12 శాతం జీఎస్టీ పరిధిలో ఉన్న అత్యధిక ఔషధాలు ఇప్పుడు 5శాతం పరిధిలోకి రానున్నాయని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయన్స్ ప్రధాన కార్యదర్శి సుదర్శన్ జైన్ తెలిపారు. అంతేకాకుండా.. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడే 36 రకాల మందులకు పన్నును పూర్తిగా ఎత్తివేసినట్లు పేర్కొన్నారు.



కొత్త శకం ఆరంభం

నేటి నుంచి దేశంలో జీఎస్టీ పొదుపు ఉత్సవం

» ప్రతి ఒక్కరూ స్వదేశీ ఉత్పత్తులనే వినియోగించండి: మోదీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): "నేటి నుంచి జీఎస్టీ ఉత్సవం ప్రారంభం కాబోతోంది. దేశంలో కొత్త చరిత్ర మొదలవుతోంది" అని ప్రధాని మోదీ అన్నారు. నవతరం జీఎస్టీ సంస్కరణలు అమల్లోకి వస్తున్నాయని, ఇవి అన్ని రంగాలకు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. సోమవారం నుంచి జీఎస్టీ సంస్కరణలు అమల్లోకి రానున్న నేపథ్యంలో ఆదివారం జాతినుద్దేశించి ప్రధాని ప్రసంగించారు. దేశ ప్రజలందరికీ అమ్మవారిని ఆరాధించే దసరా పండుగ సందర్భంగా నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. నవరాత్రి మొదటి రోజు నుంచే ఆత్మనిర్భర్ వైపు మరో కీలక అడుగు వేస్తున్నామన్నారు. మన దేశంలోని పేదలు, మధ్య తరగతి, యువత, రైతులు, మహిళలు, దుకాణదారులు, వ్యాపారులు, వ్యవస్థాపకులు.. ఇలా అందరూ బచత్ ఉత్సవ్ (పొదుపు పండుగ) చేసుకోబోతున్నారని పేర్కొన్నారు. జీఎస్టీ సంస్కరణలతో దేశ ఆర్థిక వృద్ధి వేగవంతం అవుతుందని, వ్యాపారాన్ని సులభతరం చేస్తాయని, పెట్టుబడులు మరింత ఆకర్షణీయంగా మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలోని ప్రతి రాష్ట్రాన్నీ సమాన భాగస్వామిగా చేయడంలో జీఎస్టీ సంస్కరణలు కీలక భూమిక పోషిస్తాయన్నారు. "దేశ ప్రజలు ఎంతో నమ్మకంతో 2014లో నాకు ప్రధానిగా బాధ్యతలు అప్పగించారు. మొదట్లోనే.. విదేశీ పత్రిక ఒక ఆసక్తికరమైన కథనాన్ని ప్రచురించింది. ఒక కంపెనీ ఇబ్బందులను ప్రస్తావించింది. 'బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు 570 కిలోమీటర్ల దూరం. వస్తువుల సరఫరాలో ఎన్నో ఇబ్బందులు ఉండేవి. మొదట బెంగళూరు నుంచి యూరప్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు వస్తువులను పంపడం ఉత్తమమని ఓ కంపెనీ భావించింది' అనేది ఆ కథనంలోని సారాంశం. అప్పటికి దేశంలో పన్నులు, టోల్ ఇతర పరిస్థితులు అంత దారుణంగా ఉండేవి. ఆ రోజే దేశాన్ని ఈ పరిస్థితి నుంచి బయటపడేయడం అత్యవసరమని నేను భావించాను. దేశంలోని అన్ని వర్గాల వారితో చర్చించి 2017లో జీఎస్టీతో కొత్త చరిత్రకు నాంది పలికాను. అదే భారతదేశంలోనే అతిపెద్ద పన్ను సంస్కరణ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషి ఫలితంగా దేశం డజన్ల కొద్దీ పన్నుల నుంచి విముక్తి పొందింది. ఒకే దేశం-ఒకే పన్ను కల సాకారమైంది. అయితే.. సంస్కరణ అనేది నిరంతర ప్రక్రియ. కాలం మారుతున్న కొద్దీ, దేశ అవసరాల దృష్ట్యా కొత్త సంస్కరణలు అవసరం. అందుకే.. జీఎస్టీ 2.0ను ప్రవేశపెట్టి మరో చరిత్రకు నాంది పలికాం" అనే ప్రధాని మోదీ వివరించారు.

పేద, మధ్య తరగతికి డబుల్ బొనాంజా

మధ్య తరగతి ప్రజలకు డబుల్ బొనాంజా ఇచ్చామని మోదీ తెలిపారు. ఇప్పటికే రూ.12 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇచ్చామని, దానికితోడు జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు రూ.2.5 లక్షల కోట్లు ఆదా అవుతాయని పేర్కొన్నారు. గడిచిన పదకొండేళ్లలో దేశంలో జీఎస్టీ వల్ల



25 కోట్ల మంది పేదరికాన్ని జయించారని తెలిపారు. జీఎస్టీ సంస్కరణలతో దుకాణదారులు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. దేశీయ ఉత్పత్తులపై కేంద్రం ప్రత్యేక శ్రద్ధ పెడుతోందని అన్నారు.

స్వదేశీ మంత్రం శక్తినిస్తుంది..

స్వదేశీ మంత్రం దేశ స్వాతంత్ర్యానికి శక్తినిచ్చినట్లే.. భారతదేశ శ్రేయస్సుకు కూడా శక్తినిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. "ప్రస్తుతం మనకు తెలిసో, తెలియకో అనేక విదేశీ వస్తువులు దైనందిన జీవితంలో భాగమయ్యాయి. మన జేబులో ఉన్న దువ్వెన తయారు చేసింది విదేశీయులా? లేక స్వదేశీయులా? అనేది కూడా మనకు తెలియదు. దీని నుంచి మనం విముక్తి చెందాలి. ఇకపై.. దేశంలో తయారు చేసిన వస్తువులను కొనుగోలు చేయాలి. ప్రతి ఇంటినీ స్వదేశీ చిహ్నంగా మార్చాలి. ప్రతి దుకాణాన్నీ స్వదేశీ వస్తువులతో అలంకరించాలి. ఇది స్వదేశీ అని, నేను స్వదేశీ వస్తువులనే కొంటానని ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పండి. నేను స్వదేశీ వస్తువులను కూడా అమ్ముతానని ప్రకటించండి. దీనివల్ల దేశంతోపాటు ప్రతి రాష్ట్రంలోని తయారీ రంగం ఎంతో అభివృద్ధిని సాధిస్తుంది. దీనికోసం సహకరించాలని నేను ప్రతి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను" అని మోదీ వివరించారు.

త్రిభాషా విధానంపై రాజకీయ రాద్ధాంతం తగదు

» ఏ రాష్ట్రంపైనా.. ఏ భాషనూ నిర్బంధంగా అమలు చేయం: ధర్మేంద్ర ప్రధాన్



చెన్నై, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): త్రిభాషా విద్యావిధానంపై అనవసరమైన రాజకీయ రాద్ధాంతం తగదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. సంకుచిత రాజకీయ అభిప్రాయాలు ఉన్నవారే ఈ విధానాన్ని వివాదంగా మారుస్తున్నారని ఆరోపించారు. కేంద్రం రూపొందించిన నూతన విద్యావిధానం ప్రకారం ఏ రాష్ట్రంపైనా.. ఏ భాషనూ నిర్బంధంగా అమలు చేయాలని ఒత్తిడి చేసే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. అన్ని రాష్ట్రాలూ నూతన విద్యావిధానాన్ని అమలు చేస్తున్నాయని, తమిళనాడు ప్రభుత్వం మాత్రం తీవ్ర నిరసన ప్రకటిస్తూ ద్విభాషా విద్యావిధానానికే కట్టుబడి ఉంటామని మొండి వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. త్రిభాషా విధానంతో వచ్చిన సమస్య ఏమిటని ప్రశ్నించారు. ఐఐటీ మద్రాసులో 'దక్షిణాపథ్ సమ్మిట్' పేరుతో ఆదివారం ఏర్పాటైన సదస్సులో ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలు, 'ఐఐటీఎం ఫర్ ఆల్' పథకం కింద నాలుగేళ్ల ఆన్‌లైన్ బీఎస్ (డేటా సైన్స్) కోర్సులో చేరిన గ్రామీణ, పేద, దివ్యాంగ విద్యార్థులతో ఆయన భేటీ అయ్యారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... తమిళనాడుకు సమగ్ర శిక్షా అభియాన్ నిధుల నిలిపివేతపై తాను రెండేళ్లుగా ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులతో మాట్లాడుతూనే ఉన్నానని చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు జాతీయ విద్యావిధానాన్ని అవలంబిస్తుండగా తమిళనాడు మాత్రం ద్విభాషా విద్యావిధానానికే కట్టుబడి ఉంటామని రాజకీయ రాద్ధాంతం చేయడం తగదన్నారు. తమిళనాడులోని పాఠశాలల్లో తెలుగు, ఉర్దూ, మలయాళం సహా పలు ప్రాంతీయ భాషలు నేర్పుతున్నప్పుడు త్రిభాషా విధానం వద్దని ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం భావ్యమేనా అని ప్రశ్నించారు.

2.5 రెట్లు పెరిగిన ఖర్చు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో 6.26 లక్షల కోట్లు ఉండగా.. 2022-23 అది ఏకంగా 15.63 లక్షల కోట్లకు చేరిందని వెల్లడించింది. ఈ మొత్తం రాష్ట్రాల మొత్తం రెవెన్యూ వ్యయంలో దాదాపు సగమని తెలిపింది. ఇంకా సబ్సిడీలు, గ్రాంట్స్ ఇన్ ఎయిడ్‌లను కలిపితే.. రాష్ట్రాలు చేసే వ్యయంలో ప్రతి రూపాయిలో ఐదింటిలో నాలుగుకు పైగా వంతు వాటికే పోతోందని వివరించింది. జీతాలు, పెన్షన్లు, ప్రభుత్వ అప్పులపై వడ్డీ చెల్లింపులను 'నిబద్ధ వ్యయం'గా పరిగణిస్తారు. 2013-14, 2022-23 మధ్య రాష్ట్రాల మొత్తం వ్యయంలో రెవెన్యూ వ్యయం స్థిరంగా 80-87 శాతం నడుమ ఉంటోంది. రాష్ట్రాల మొత్తం జీఎస్డీపీలో ఆ వాటా 13-15 శాతం మధ్య ఉంది. 2022-23 ఆర్థిక ఏడాది వరకు చూస్తే.. రెవెన్యూ వ్యయం రూ.35.96 లక్షల కోట్లుగా ఉంది. ఇది మొత్తం వ్యయంలో 85 శాతం, మొత్తం జీఎస్డీపీలో 13.85 శాతం. 2022-23లో మొత్తం రెవెన్యూ వ్యయంలో వేతనాలు, పింఛన్లు, రుణాలకు వడ్డీ వంటి వాటికి రూ.15.63 లక్షల కోట్లు ఖర్చు చేయగా, సబ్సిడీలు రూ.3.09 లక్షల కోట్లకు చేరాయి. అదేవిధంగా గ్రాంట్స్ ఇన్ ఎయిడ్‌లు రూ.11.26 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఈ మూడింటిని కలిపితే మొత్తం రెవెన్యూ వ్యయంలో 83 శాతంగా తేలింది. దీని వలన అభివృద్ధి, మూలధన వ్యయం కోసం తక్కువ వెసులుబాటు ఉంటోందని కాగ్ తన నివేదికలో వెల్లడించింది.

రెవెన్యూ లోటులో పలు రాష్ట్రాలు

2022-23లో 17రాష్ట్రాలు రెవెన్యూ మిగులు లక్ష్యం పెట్టుకోగా.. 12 రాష్ట్రాలు ఆ టార్గెట్‌ను చేరుకున్నాయి. అసోం, బిహార్, హిమాచల్‌ప్రదేశ్, మేఘాలయ, రాజస్థాన్‌లు రెవెన్యూ లోటుతో ముగిశాయి. రెవెన్యూ లోటును తగ్గించుకోవాలని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, హరియాణా, మహారాష్ట్ర, పంజాబ్ లక్ష్యంగా పెట్టుకోగా.. వీటిల్లో కర్ణాటక రెవెన్యూ మిగులులోకి వెళ్లగా.. మహారాష్ట్ర మాత్రమే పెట్టుకున్న లక్ష్య పరిమితికి తగ్గించుకుంది. 2022-23లో రెవెన్యూ లోటులో ఉన్న 12 రాష్ట్రాలకుగానూ ఏపీ సహా తొమ్మిది రాష్ట్రాలు మాత్రమే ఆర్థిక సంఘం నుంచి రెవెన్యూ లోటుకు సంబంధించిన గ్రాంట్లు పొందాయి.

ఎక్కువ రాష్ట్రాల్లో జీతాలపై ఖర్చే టాప్

2013-14 నుంచి 2022-23 మధ్య రెవెన్యూ వ్యయం 2.66 రెట్లు పెరిగింది. చాలా వరకు రాష్ట్రాల్లో 'నిబద్ధ వ్యయం'లో వేతనాలపై అధికంగా ఖర్చు చేస్తుండగా.. ఆ తర్వాతి స్థానాల్లో పింఛన్లు, వడ్డీ చెల్లింపులు ఉన్నాయి. అయితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, హరియాణా, కర్ణాటక, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లలో పింఛన్ల కంటే వడ్డీ చెల్లింపులు అధికంగా ఉన్నాయి. 2013-14, 2021-22 మధ్య తొమ్మిది సంవత్సరాల కాలంలో వ్యయంలో వేతనాల తర్వాత వడ్డీలు స్థిరంగా రెండో స్థానంలో ఉంది. మరోవైపు సబ్సిడీలపై వ్యయం వేగంగా 3.21 రెట్లకు పెరిగిందని కాగ్ తెలిపింది. 2013-14లో రాష్ట్రాల మొత్తంగా రూ.96,479 కోట్లు ఉండగా.. 2022-23 నాటికి అవి రూ.3.09 లక్షల కోట్లకు చేరాయని వివరించింది.

పాలస్తీనాను దేశంగా గుర్తిస్తున్నాం

» బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా కీలక ప్రకటన

» ఇదే బాటలో ఫ్రాన్స్, పోర్చుగల్ కూడా!

లండన్, సెప్టెంబరు 21: పాలస్తీనాను బ్రిటన్ అధికారికంగా దేశంగా గుర్తించింది. అమెరికా, ఇజ్రాయెల్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా బ్రిటన్ ప్రధాని స్టార్మర్ తన నిర్ణయాన్ని ప్రకటించారు. ఇజ్రాయెల్, పాలస్తీనా ప్రజల్లో శాంతి స్థాపన ఆశలు పునరుద్ధరించేందుకు రెండు దేశాల విధానం సరైనదని స్టార్మర్ అభిప్రాయపడ్డారు. బ్రిటన్‌తో పాటు ఆస్ట్రేలియా, కెనడా కూడా పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించాయి. అతి త్వరలో ఫ్రాన్స్, పోర్చుగల్ కూడా పాలస్తీనాను దేశంగా అధికారికంగా గుర్తించనున్నాయి. పాలస్తీనాను దేశంగా గుర్తించడమంటే 2023 అక్టోబర్ 7నాటి దాడిపై హమాస్‌కు బహుమతి ఇచ్చినట్లేనని ఇజ్రాయెల్ వ్యాఖ్యానించింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల వేళ పాలస్తీనాను దేశంగా గుర్తిస్తూ ఆయా దేశాలు చేసిన ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఐక్యరాజ్యసమితిలోని 145 దేశాలు పాలస్తీనాను ఇప్పటికే దేశంగా గుర్తించాయి. అయితే, భద్రతా మండలిలో ఆమోదం పొందితేనే పాలస్తీనాను ఐక్యరాజ్యసమితిలో సభ్య దేశంగా గుర్తిస్తారు. అమెరికా వీటో చేస్తుండటంతో పాలస్తీనాకు మోక్షం లభించడం లేదు. కాగా, గాజాలో ఇజ్రాయెల్ వైమానిక, భూతల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి.


For the Historic and
Progressive GST Reform,
Emami thanks the
Hon'ble Prime Minister
Shri Narendra Modi
Hon'ble Prime Minister of India
emami
The care of ayurveda.
At prices that care.
In every Indian heart. In every Indian home.
Building a stronger India.
Buy 1 Get 1 Free
BoroPlus Doodh Kesar Lotion
300 ml + 300 ml
₹ 340
₹ 319
Navratna Ayurvedic Oil Cool
180 ml
₹ 155
₹ 145
Emami 7 Oils in One Hair Oil
100 ml
₹ 75
₹ 67
Zandu Balm
8 ml
₹ 46
₹ 43
Zandu Chyavanprashad
900 gm
₹ 430
₹ 403
Zandu Roll-on
5 ml
₹ 35
₹ 33
BoroPlus Vasocare Herbal Petroleum Jelly
50 ml
₹ 95
₹ 89
Kesh King Gold Oil
100 ml
₹ 190
₹ 178
Zandu Pancharishta Ayurvedic Digestive Tonic
450 ml
₹ 160
₹ 150
Kesh King Gold Shampoo
340 ml
₹ 300
₹ 280
BoroPlus Ayurvedic Antiseptic Cream
80 ml
₹ 165
₹ 155
Revised price list is available with retailers and on www.emamiltd.in
*Maximum Retail Price (MRP) reduction is an outcome of revised rate slabs, effective 22nd September, 2025 onwards. Benefits have been passed on across the above packs and across a wide range of products. Stocks manufactured with reduced MRP (inclusive of all taxes/GST) or with higher grammage/volume are in the process of reaching retailers.



MARUTI SUZUKI COMMERCIAL
GST తగ్గింపుతో
ఇప్పుడు
వేడుకలు
మరింత ఘనంగా మారాయి.
ఇప్పుడు ప్రారంభ ధర
₹5 06 100^
₹52 100^
వరకు ధరపై తగ్గింపు
₹58 000**
వరకు ప్రత్యేక పండుగ ఆఫర్
సూపర్ శక్తివంతమైన 1.2 L ఆధునిక K-సిరీస్ ఇంజన్
S-CNG+PETROL
CNG + 5L అత్యవసర పెట్రోల్ ట్యాంక్
సూపర్ మైలేజీ
ELECTRONIC STABILITY PROGRAM
మినీ ట్రక్ విభాగంలో మొదటిది*
ESP® తో గొప్ప భద్రత
నిటారు ఏటవాలుపై ఉన్నతమైన సామర్థ్యం
3 years 100 000 km WARRANTY*
EXTENDABLE UPTO 6 YEARS
NEW SUPER CARRY
WWW.MARUTISUZUKICOMMERCIAL.COM | వివరాల కోసం, టోల్ ఫ్రీ నంబర్ 1800 102 1800/1900 1800 150 కు కాల్ చేయండి.
BHARGAVI AUTOMOBILES
NELLORE
CALL: 9248726789
JAYALAKSHMI AUTOMOTIVES
GUNTUR
CALL: 9100791380
NOVELTY
BHIMAWARAM
CALL: 99488 63555
JAYALAKSHMI AUTOMOBILES
ONGOLE
CALL: 91009 80065
VARUN MOTORS
VIJAYAWADA
CALL: 90520 71222

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

అద్దం వెనుక వర్షం



ఆకాశం తన నరాలన్నీ తెంచుకుని
ఒక పిచ్చివాడిలా వీధుల మీద పడింది.
నగరపు మురికిని, కపటత్వాన్ని
కడిగి పారేయాలన్న కసితో
ప్రతి నీటిచుక్క ఒక ఉలిదెబ్బలా కురుస్తోంది.

తగరపు రేకుల పైకప్పుల మీద
లక్షలాది సైనికుల కవాతు శబ్దం.
మట్టి వాసన...
ఎప్పుడో సమాధి చేసిన జ్ఞాపకంలా
ఒక్కసారిగా పైకి లేస్తోంది.

నేను ఈ పన్నెండో అంతస్తు కిటికీ వెనుక
ఏసీ చలిలో బిగుసుకుపోయి
నా ఫోన్ తెర మీద
ఇదే వర్షపు ఫోటోలకు 'లైక్' కొడుతున్నాను.
బయట కురుస్తున్నది నిజమైన వర్షం
నా చేతిలో తడుస్తున్నది ఒక గాజు అబద్ధం.

నాకూ ఈ హోరువానకూ మధ్య
ఈ చల్లని, మందపాటి అద్దం
నా చర్మానికీ, స్పర్శకీ మధ్య
నా హృదయానికీ, వాస్తవికతకీ మధ్య
నిలబడిన ఒక పారదర్శకమైన శత్రువు.

చిన్నప్పుడు అమ్మ చీరచాటు నుండి
బయటకు దూకిన జ్ఞాపకం...
మొదటి వాన చుక్క ఒంటి మీద పడగానే
ఒళ్ళు పులకరించిన అనుభూతి...
బురదలో గెంతిన పాదాలు...
ఆ స్వేచ్ఛ ఇప్పుడు నాకెంత దూరం?

బయట కురుస్తున్నది నీళ్ళు
నా గొంతులో ఆరని అస్తిత్వ దాహం.
కిటికీ తలుపులు బాదుతున్న ఈ శబ్దం
నన్ను లోపలికి రమ్మని పిలుస్తున్న మృత్యువా?
బయటకు రమ్మని పిలుస్తున్న స్వేచ్ఛా?

నా వేలికొనతో అద్దాన్ని తాకాను
అది నా సమాధిలా చల్లగా ఉంది
అద్దంలో నా ప్రతిబింబం
వర్షంలో తడుస్తున్న ఒక నీడలా...

ఈ గాజు గోడను బద్దలుకొట్టి
బయటి ప్రపంచంలో కలిసిపోవాలా?
లేక ఈ నాలుగు గోడల మధ్యే
నాలో నేను కురిసి, నాలోనే ఇగిరిపోవాలా?

■ భూక్యా గోపీనాయక్
✆ 99891 59196

'నేను మరణిస్తూనే ఉన్నాను' కవిత్వ పరిచయ సభ

బిల్ల మహేందర్ కవిత్వ సంపుటి 'నేను మరణిస్తూనే ఉన్నాను' పరిచయ సభ సెప్టెంబర్ 23 సా.4 గంటలకు రవీంద్రభారతి హైదరాబాద్‌లో జరుగుతుంది. నామోజు బాలాచారి, నెల్లుట్ల రమాదేవి, యాకూబ్, సంగిశెట్టి శ్రీనివాస్, సామిడి జగన్ రెడ్డి పాల్గొంటారు.

తెలంగాణ సాహిత్య అకాడమీ

జాషువా జయంతి వారోత్సవాలు

జాషువా 130 జయంతి వారోత్సవాలు సెప్టెంబర్ 22 నుండి 28 వరకు అన్నమయ్య కళా వేదిక, వెంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణ, గుంటూరులో జరుగుతుంది. గద్దం ఎలీషా, గరికిపాటి గురజాడ, డొక్కా మాణిక్య వరప్రసాద్, డి. రాములు, చావలి బాలస్వామి, చిట్టిపోతు మస్తానయ్య, తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 9848693298.

మహాకవి జాషువా కళాపీఠం

మంటో జీవితం – రచనలు

ఫాసిజం సందర్భంలో మంటో జీవితం – రచనలు జూమ్ మీటింగ్ సెప్టెంబరు 27సా.6 గం.లకు జరుగుతుంది. పంజాబీ రచయిత పవన్ టిబ్బా, పూర్ణిమ తమ్మిరెడ్డి, ఉదయ మిత్ర, స్కైబాబ, విప్లవ శ్రీనిధి, హాథీరాం సబావట్, పేర్ల రాము, లావణ్య, మెర్సీ మార్గరెట్, నరేష్కుమార్ సూఫీ పాల్గొంటారు.

సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్

'నల్ల పద్యం' కవిత్వ పరిచయ సభ

పిన్నంశెట్టి కిషన్ రాసిన 'నల్ల పద్యం' కవితా సంపుటి పుస్తక పరిచయ సభ సెప్టెంబర్ 28ఉ.10 గంటలకు కరీంనగర్ ఫిలిం భవన్‌లో తెలంగాణ రచయితల వేదిక కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరుగుతుంది. సి.వి. కుమార్, అన్నవరం దేవేందర్, పి.ఎస్. రవీంద్ర, రఘురామన్, పుప్పాల శ్రీరామ్ హాజరవుతారు.

దామరకుంట శంకరయ్య

భ్రమలు తొలగిన నైరాశ్యంలో వెలిగింది నా 'దీపశిఖ'

నా మొదటి పుస్తకం

రామా చంద్రమౌళి

1950 లో వరంగల్లులో జన్మించిన నేను జన్మతః కొంత సాహిత్య వారసత్వాన్ని కలిగి ఉన్నానని చిన్నప్పటి నుండీ అనుకునేవాణ్ణి. పాలకుర్తి సోమనాథుడు, బమ్మెర పోతన, వానమామలై వరదాచార్యుల నుండి నాకు వ్యక్తిగతంగా బాగా పరిచయమున్న ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య, కోవెల సంపత్కుమారాచార్య, ప్రజాకవి కాళోజీ, పాములపర్తి సదాశివరావు, పత్రికా సంపాదకులు



ఎం.ఎస్. ఆచార్య, తను రాసే ప్రతి అక్షరాన్నీ ఆచరిస్తూ జీవించే మహారచయిత వరవరరావు (నాకన్నా పదేళ్ళు పెద్ద), ప్రసిద్ధ నవలా రచయిత అంపశయ్య నవీన్... ఇత్యాదుల వైభవోపేతమైన ప్రేరణ (induction) నాలో చిన్ననాటినుండీ వాహకంలో విద్యుత్తులా ప్రవహించేది. కాళోజీ గురువుగారైన గార్లపాటి రాఘవ రెడ్డి గారి శిష్యరికంలో (మహబూబియా ఉన్నత పాఠశాలలో) తొమ్మిదవ తరగతి చదువుతున్నప్పుడు భాషా వ్యామోహంతో రాసిన నా మొట్టమొదటి కథ 'సువర్ణ శతదళ పుష్పరహస్యం' పిల్లల పత్రిక 'చందమామ'లో అచ్చయితే పొందిన పులకింత మహోద్విగ్నమైంది. కాని ఇరవై ఏళ్లు వచ్చేనాటికి ఇంజనీరింగ్ చేస్తూ ఎందుకో కవిత్వమే నా మాధ్యమమని తెలుసుకుని, ప్రయోజనకర సృజన తోనే అక్షరాన్ని సంధించాను. పుస్తకాన్ని అచ్చువేసుకోగల ఆర్థిక స్తోమత లేని స్థితిలో నా చిన్ననాటి మిత్రుడు రావుల గిరి సహకారంతో అతికష్టం మీద ఆగస్ట్, 1971లో వెలువరించిన నా మొదటి కవిత్వ పుస్తకం 'దీపశిఖ'. ఇరవై ఏళ్ళ వయసులో అప్పుడే ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని ప్రభుత్వ పాలిటెక్నిక్, వరంగల్లులో డిమాన్‌స్ట్రేటర్‌గా చేరిన సంవత్సరమే మా కాలేజ్ ఆడిటోరియంలోనే 'దీపశిఖ' ఆవిష్కరణ జరిగింది. నాటి సభను అధ్యక్షించినవారు కళాప్రపూర్ణ నేరెళ్ళ వేణుమాధవ్, ఆవిష్కర్త ఆంధ్రప్రభ ఎడిటర్ పొత్తూరి వెంకటేశ్వర రావు, పుస్తక విశ్లేషణ కోవెల సుప్రసన్నాచార్య, ఎం.ఎస్. ఆచార్య, ఎడిటర్ జనధర్మ, విద్వాన్ టి.వి. సుబ్బారావు, ప్రసిద్ధ కథా రచయిత తులసి బాలకృష్ణ. ఆ పుస్తకంపై దాదాపు అన్ని పత్రికలూ, చాలా మంది మిత్రులూ పాజిటివ్‌గా స్పందించారు.



ఐతే ఇక్కడ అప్పటి ఆ పుస్తకం వెనుక నాటి నా అంతరంగ స్థితిని తెలియజేసుకోవలసిన అవసరముంది. బాల్యం నుండీ నన్ను నేను తెలుసుకుంటున్నప్పుడు క్రూరమైన హింసతో కూడిన తెలంగాణ సాయుధ పోరాటం, పోలీస్ యాక్షన్, కమ్యూనిస్ట్ యోధుల ఊచకోత... ఈ అతిభయంకరమైన పీడకల లాంటి గతం నా బాల్యాన్నీ, యవ్వనాన్నీ పూర్తిగా ఆక్రమించి మాయని గాయాన్ని మిగిల్చింది. భారత దేశంలో 1952 లో జరిగిన మొట్టమొదటి పార్లమెంటరీ ఎన్నికల ప్రహసనం నుండి ఇప్పటిదాకా జరుగుతూ వస్తున్నదంతా 'ప్రజాస్వామ్యం' పేరుతో జరుగుతున్న అతిపెద్ద దగా, మోసం, కంటితుడుపు చర్య. ఒక్క నాల్గయిదు లోకసభ ఎన్నికల తర్వాతే అసలు రంగు బయటపడి, పరాయి దోపిడీదారుల కంటే మన ఇంటిదొంగలే పరమ ప్రమాదకారులని తెలిసి 'అంతా భ్రాంతియేనా' అన్న నిస్సహాయ అంతర్మథనంలో కసితో రాసిన కవితల గుచ్ఛమే ఈ నా 'దీపశిఖ'. నాకు ఆదర్శమూర్తియైన వరవరరావు తన 'చలినెగళ్ళు'లో ఎంతో విశ్వాసంతో ఒక కవిత రాశాడు: "భళ్ళున తెల్లవారునింక భయంలేదు" అని. కాని ఇంకా తెల్లవారలేదు. "చలితెరలు తొలగి సూర్యుడు మిట్టమింటికి రావాలి" అని కూడా ఆకాంక్షించాడు వివి. కాని మిట్ట మింటికి సూర్యుడు ఇంకా రానేలేదు. కిష్కింధాకాండ ఇంకా జరుగుతూనే ఉంది. ■

ఫ్రెంచి యానాం పట్టణ గ్రామానికి అతి సమీపంలో ఉన్న కుగ్రామం పల్లిపాలెం. ఇక్కడి నుంచే ఆంధ్ర పురాణం కావ్యకర్త మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి గారు తన సాహిత్య ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆయనే దాదాపు ఏడున్నర దశాబ్దాల క్రితం ఈ ఊరిలో 'ఆంధ్రీ కుటీరం'ను ప్రారంభించారు. ప్రాంతాలతో సంబంధం లేకుండా అన్ని ప్రాంతాలకు చెందిన కవులు, రచయితలు ఈ గ్రామం వచ్చి, ఆంధ్రీ కుటీరంలో తమ సాహిత్య సంపదను పంచుకున్నారు. ఈ కుటీరాన్ని, దాని తరఫున జరిగిన సాహిత్య సేవని ఇప్పుడు మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి గారి తమ్ముడి కుమారుడు మధునాపంతుల సత్యనారాయణ నేటికీ కొనసాగిస్తున్నారు. ఆంధ్రీ కుటీరం నిర్వహణ గురించి, దాని ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ కార్యక్రమాల గురించి సత్యనారాయణ గారితో జరిపిన సంభాషణ ఇది.

మధునాపంతుల స్ఫూర్తి చిహ్నం 'ఆంధ్రీ కుటీరం'



కోనసీమ జిల్లాలో మారుమూల ఉన్న ఈ పల్లిపాలెంలో ఆంధ్రీ కుటీరం గురించి, ఇక్కడికి వచ్చిన గొప్ప సాహితీవేత్తల గురించి, మీరు ఇప్పుడు చేస్తున్న కార్యక్రమాల గురించి చెప్పండి?

కాకినాడ జిల్లా, కాజులూరు మండలం, పల్లిపాలెం మా స్వగ్రామం. శతాబ్దాల క్రితం ఇక్కడకు వచ్చి మా కుటుంబాలు స్థిరపడ్డాయి. భిషగ్రత్న మధునాపంతుల సత్యనారాయణ మూర్తి – లక్ష్మమ్మల ప్రథమ సంతానం కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారు. ఆయన తమ్ముడు మధునాపంతుల సూరయ్య శాస్త్రి. సత్యనారాయణ శాస్త్రి గారు తన 14వ ఏట ఈ ఆంధ్రీకుటీరం స్థాపించారు. ఆంధ్రీ కుటీర లక్ష్యాలు– గ్రామంలో సాహిత్య చైతన్యం తీసుకురావడం, యువత దారి తప్పకుండా వారిని పఠనం వైపు, రచనల వైపు మళ్ళించడం, దళితులకు సంస్కృత విద్యాబోధన, అలాగే ఒక గ్రంథాలయ స్థాపన. ఆంధ్రీకుటీరం 1939లో 'ఆంధ్రి' అనే మాసపత్రికను ప్రారంభించింది. దీనికి పిఠాపురం ఆస్థాన కవి ఓలేటి వేంకట రామశాస్త్రి సర్వాధ్యక్షులు. 'ఆంధ్రి' పత్రికకు చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి మొదలుకొని గుర్రం జాషువా వంటివారు తమ రచనలు పంపి ప్రోత్సహించారు. అయితే 42 సంచికలు మాత్రమే వచ్చాయి. రెండవ ప్రపంచ యుద్ధం కారణంగా పేపర్ కొరత మొదలైన సమస్యల వల్ల పత్రిక ఆగిపోయింది. 'ఆంధ్రి' పత్రిక ద్వారా ప్రసిద్ధులైన రచయితలను పరిచయం చేస్తూ మధునాపంతుల సంపాదక వ్యాసాలు రాశారు. అవి అనంతర కాలంలో శతాధిక రచయితల సమాచారంతో 'ఆంధ్ర రచయితలు' అనే ప్రామాణిక గ్రంథంగా విడుదలయ్యింది.

మీ పెద్దనాన్నగారికి మీరు సాహిత్య వారసులు అనుకోవాలా? మీ కుటుంబంలో మరెవరైనా సాహిత్య సృజన చేసినవారున్నారా?

ఆస్తికైతే ప్రత్యేకించి వారసులు ఉంటారు. కానీ సాహిత్యకారులకు ఆ రంగంలో విశేష కృషి చేస్తున్న వారంతా వారసులే. నా వరకు నేను భాషా ప్రవీణ చదువుకుని పండిత శిక్షణ పొంది తెలుగు ఎంఏ చేసి మూడు దశాబ్దాలు తెలుగు పండితుడుగా పనిచేసిన వాడినే. కుటుంబ వాతావరణం, సంస్కృతాంధ్రాలు చదివి ఉండడం నన్ను సాహిత్యం వైపు, తెలుగు పండితుడిగా ఉద్యోగం వైపు ప్రోత్సహించాయి. పద్యం రాయడం మొదలుపెట్టిన రోజుల్లో పెదనాన్నగారి 'ఆంధ్ర పురాణం' చేతికొచ్చింది. రాస్తే పెద్దనాన్నగారిలా పద్యం రాయాలి. లేకపోతే ఊరుకోవాలి. కానీ ఊరుకోలేకపోయాను. వచన కవిత్వం వైపు మళ్లాను. 70–80 దశకాలలో కాకినాడలో గొప్ప సాహిత్య వాతావరణం ఉండేది. సోమ సుందర్, అద్దేపల్లి వంటి వారు ఉత్సాహభరితంగా సాహిత్య కార్యక్రమాలు చేసేవారు. వాటిలో పాల్గొనడం నాకు మరింత స్ఫూర్తినిచ్చింది. అప్పుడప్పుడు నేను రాసిన వచన కవిత్వం పత్రికల్లోనూ, ప్రత్యేక సంచికల్లోనూ ప్రచురణ కావడం మరింత ప్రోత్సాహాన్ని అందించింది.

మధునాపంతుల కుటుంబంలో సత్యనారాయణశాస్త్రి గారి మూడవ కుమారుడు మధునామూర్తి జర్నలిస్టుగా ఉద్యోగం చేస్తున్నాడు. వ్యాస రచనలు చేశాడు. మా చిన్నమ్మాయి మధునాపంతుల (ఆకొండి) రత్నకళిక కవిత్వం రాయడమే కాక 'ఆంధ్రి' పత్రికలపై పరిశోధన చేసి యంఫిల్ పట్టా పొందింది. మా తండ్రి 'మూక పంచశతి'ని అనువాదం చేసి 'దేవీ నవతి' పేరుతో ప్రకటించారు. మా తాతగారు 1927 లోనే ఆ కొండి రామమూర్తి గారి ఆయుర్వేద జీవితం మీద పెద్ద పుస్తకం రాశారు. ఆ విధంగా సత్యనారాయణ శాస్త్రి గారికి పూర్వమే సాహిత్య సృజన దిశగా అడుగులు వేసిన కుటుంబం మాది.

ప్రతి ఏటా ఒక సీనియర్ రచయితకి, ఇద్దరు కొత్త వారికి మీరు కథా గౌరవ పురస్కారం ఇస్తున్నారు. దీని నేపథ్యం ఏమిటి? ఎంపిక బాధ్యత ఎవరిది? అలాగే ఆంధ్రీకుటీరం ఇస్తున్న ఇతర పురస్కారాల గురించి చెప్పండి?

మా కుటుంబాలకే చెందిన మధునాపంతుల వెంకటేశ్వర్లు మధుశ్రీలు పేరుతో కవితలు, కథలు రాసేవారు. ఆయన కుమారుడు కిరణ్ మధునాపంతుల సాఫ్ట్వేర్ రంగానికి చెందిన పారిశ్రామికవేత్త. ఆయన తన తండ్రి మరణానంతరం ఏటా 'కథా గౌరవం' అనే పేరుతో ఇద్దరు సీనియర్లకు రూ.20,000 చొప్పున ఒక కొత్త కథా రచయితకు రూ.10,000 చొప్పున నగదు బహుమతి ఇచ్చి సన్మానిస్తున్నారు. ఇక ఆంధ్రీకుటీరం పురస్కారాల మాటకొస్తే ఏటా మధునాపంతుల వారి జయంతులు, వర్ధంతులు జరుపుతాం. కవి పండితులను గౌరవిస్తాం. అలాగే రామకృష్ణ కవుల సాహిత్య సమాలోచన సభలు జరుపుతాం. అవధాన రంగానికి చెందిన వారిని గౌరవిస్తాం. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం (పద్యకవిత్వం), దర్భశయనం శ్రీనివాస ఆచార్య (వచన కవిత్వం) మొదటి పురస్కారాలను అందుకున్నారు. ఇక పురస్కారాల ఎంపికకు ప్రత్యేకమైన జ్యూరీ అంటూ ఏమీ ఉండదు. మా కుటుంబాలలో చాలా మంది మంచి చదువరులు ఉన్నారు. మేమే వీలైనప్పుడల్లా సేకరించి చదువుకొని ఒకరి అభిప్రాయాలు ఒకరు పంచుకొని నలుగురు ఐదుగురిని ఎంపిక చేస్తాం. కిరణ్ మధునాపంతుల, నేను ఒక నిర్ణయానికి వచ్చాక ప్రకటిస్తాం. కొందరు మిత్రులు 'ఫలానా రచయితలు మీ దృష్టికి వచ్చారా' అని అడిగినప్పుడు ఆ పుస్తకాలు మా దగ్గర లేకపోతే డబ్బు పంపి తెప్పించుకుని, చర్చించుకుని ఒక నిర్ణయానికి వస్తాం.

ఈ మధ్య మీరు ఈ ఆంధ్రీ కుటీరంలో ప్రారంభించి 'రత్నప్రభ' గ్రంథాలయం గురించి చెప్పండి?

రత్న ప్రభా గ్రంథాలయం 2024 జనవరిలో ప్రారంభించాం. కవి, రచయిత మిత్రులు కొందరు వదాన్యులు ఇప్పటికీ 12 వేలకు పైగా పుస్తకాలు వితరణ చేశారు. ఈ గ్రంథాలన్నీ సంరంక్షించడానికి ఒక సువిశాలమైన గదిని, లైబ్రేరియన్‌ను ఏర్పాటు చేశాం. పరిశోధకులు, కవులు వస్తే వారు ఉండడానికి మంచి గది ఏర్పాటు చేశాం.

ఇంటర్వ్యూ ■ ముక్కామల చక్రధర్

బొమ్మలు: అక్బర్

వేయి గుండెల పద ప్రదర్శన

Art in its existence itself is subversive.
Because it has to destroy the old
to create new – Habib Tanvir
(కళ తన అస్తిత్వంలోనే తిరుగుబాటు తత్వాన్ని కలిగి ఉంటుంది. ఎందుకంటే కొత్త దాన్ని సృష్టించడానికి పాత దాన్ని ధ్వంసం చేయాల్సి వుంటుంది – హబీబ్ తన్వీర్)

స్వపల్లేరు పర్వతాలెక్కి సమస్త భూ దుఃఖ సాగరం లోకి దూకి మరణించి... తన నెత్తుటితో తానే లోదీపాలని వెలిగించుకొని... మళ్లీ దూకే ఒక పునః ఫినిక్స్ రసక్రీడ: గాజోజు నాగ భూషణం సృజన – కవితైనా, కథైనా.



తమ యమపాశాల్తో తమను తామే బంధించుకొని, కోటి గాయాల వీణ తెలంగాణ స్వహస్త మీటులతో మెట్లెక్కుతున్న వాడు కాదు మనవాడు. ఏసీ గదుల్లో పడుకొని, ఉద్యమ యాగంలోకి నరమానవ పెట్రోళ్లు పోస్తూ నాగస్వరం ఊదుతున్నవాడు కాదు. అక్షరాలతో రాజచరణాలకు Luxలవుతున్నవాడు కాదు.

అతని కవిత్వ సంపుటి 'ప్రాణదీపం' ఎనభై ముక్కల కన్నీటి ఆట... తెరవంగనే టైటిల్స్ లోనే విభిన్న నామాలు, సర్వనామాలు, మానాలు, విశేషణాలు, అశక్తతలు, ప్రశ్నలు, ఆశ్చర్యాలు, పదచిత్రాలు, రూపకాలు, ధిక్కారాలు, Metanonyలు, simileలు సవాలక్షల కలగూర గంపలై, చేతుల్లో కాళ్ళేసుకొని నడుములకు రెక్కలు తొడుక్కొని, నీ చుట్టూ తిరిగి, భూమి చుట్టూ తిరిగి తిరిగి, నీ ఎముకల్లోకి ఇంకిపోతాయి. ఇప్పుడిక నువ్వు నువ్వు కాకుండా పోయి ఒక మహా దుఃఖాన్నీ అనంత ఆగ్రహాన్నీ శిగ మూగుతావు. భూషణం వాడిన కొన్ని తెలంగాణ సజీవ జన భాషణలు: తాయిమాయి తండ్లాట, నెత్తి మీద నిండవడ్ల బస్తా, తీరొక్క శోకం, మాయా తెర్మల మర్మం, ఎద్దేడ్చిన ఎవుసం, తెగ్గోసుకున్న బొడ్డుతాడు, ఊపిరి ఊరి వరదగూడు, వాగు వట్టిపోయి, గత్తరచ్చి విడిచిపెట్టిన గ్రామం, తేజాబులో ముంచి, ఇవురంతో ఇంటి మొగురం, పస్గడి దాటాలే, పబ్బతి పట్టలేరా, తాయిలాల తరాజు, పగిలిన సల్లకుండ, నెనరెక్కువ... ఇలా ఎన్నో.


యే దేశపు, యే ప్రాంతపు, యే వర్గపు, యే కులపు, యే లింగపు కవి అయినా లోపల ఒక పసిబాలిక, వో సౌందర్యోపాసకుడు ప్రేమ మాలలు ధరించి నిత్యం ఖడ్గనాట్యం చేస్తుండాలి. ఎటో ఒకవైపు ఉన్నవాడు మాత్రమే సృజన చేయగలడు. గోడమీది పిల్లులు నెలనెలా మూడొందల కాపీల అక్షరాల గుట్టల్ని మాత్రమే పోగు చేయగలవు. కవీ, కళాకారుడు మరణించే వరకూ మహా స్వార్థపరుడై ఉండాలి – తన కవిత కోసం, తన కళ కోసం. అర్జునుడికి శతకోటి ఆకుల కోటికొమ్మల లక్షల పావురాల గుంపులోని ఒకే పావురపు ఒకే కన్ను కనిపించినట్టు, రాత్రీ పగలూ ఇరవ ఐదు గంటలూ తన కంటికి తన కవితా తన కళా తప్ప ఇంకేమీ కనిపించకూడదు. తన అంతర్ బాహ్య ప్రపంచాల్ని – అందువసించు, వర్ధిల్లు, ఘర్షించు సమస్త భౌతిక, అధిభౌతిక జీవనిర్జీవాల్ని ధ్వంసం చేసుకోవాలి – బంధాల్నీ జల సంద్రాల్నీ విప్లవాల్నీ పోరాటాల్నీ దుఃఖాల్నీ నెత్తురుల్నీ దేవుళ్లనీ మనుషుల్నీ మతాల్నీ వర్గాల్నీ కులాల్నీ ప్రకృతినీ సంఘర్షణల్నీ సంవేదనల్నీ సకల తాత్వికతల్నీ ఉద్వేగాల్నీ – ధ్వంసం చేసి – చివరకు తనని తాను ధ్వంసం చేసుకొని అంతర్ధానమైపోవాలి – 'ఇంకా ఇంకేం మిగిలింది దెంచనాలా! సకలం బూడిద కుప్పలే కదా' అనుకుంటున్నారు కదా! Yes, exactly! – ఆ బూడిద plus సృజన పనిముట్లూ మాత్రమే మిగలాలి. అప్పుడు దానంతట అదే ఒక abstract mythological act జరిగి కళ ఉద్భవిస్తుంది. ఆ కళే తన సృజనకారున్ని మళ్ళీ బతికించుకుంటుంది.

'ప్రాణదీపం' కవిత్వ సంపుటి లోని 'విభ్రాంత క్రీడ' కవిత గాజోజును తన ముప్పై ఏళ్ల ప్రస్థానం నుంచి వేరు చేసి ఒక గొప్ప ఆధ్యాత్మికతత్వ కవిగా నిలబెడుతుంది. శృతిలయల సంభోగ సంద్రంలో నిండా మునిగి, పాట–వచన కవిత అర్ధనారీశ్వరమైనది ఇక్కడ– పాడుకోడానికీ చదువుకోడానికీ ఆడుకోడానికీ. ఒక తెలుగు సీనియర్ కవి వచన కవితను సంగీతం నుంచి విడదీయాలన్నాడు కానీ అలా విడదీయటం పాశ్చాత్య ప్రతిభకు పెద్ద పీట వేసి, భారతీయ indigenous సిద్ధ సాధు యోగుల భక్త మూల వాసుల ఆదివాసీ బహుజన కవుల జన సహజ సృజనకు చిన్న పీట వేస్తుందని నా అభిప్రాయం. 'జలకన్య అడుగులకు తడబడని ఆటనేర్పేటి ఆదిగురువెవ్వరు?/ విశ్వవినువీధుల్లో వెలిగేటి దీపాల కాంతి కారకుడైన విభుడు ఎవరు?'... ఇలా సాగే ఈ కవితను హేతువాది, కమ్యూనిస్టు అయిన గాజోజు ఎట్లా రాస్తాడు? అని మనం అనుకోవచ్చు. సైన్సునీ దేవుడ్నీ విశ్వసృష్టి నిరూపణలనీ మతాన్నీ అనుమానించడం అంటేనే ఓషో వలె గాజోజు కొన్ని వందలేళ్ళు ముందుకు పోయి ఆలోచిస్తున్నాడని అర్థం. కవిత చివరి పంక్తుల్లో ఆయనలోని సాంప్రదాయ హేతువాదిని కూడా మనం దర్శించొచ్చు.

'ప్రాణ దీపం'లోని చాలా కవితలు ఆశావాద కవితలు. తరువాత రాసిన 'ఉదయాస్తమయాల ఊయల' లో కనీసం ఆశానిరాశల సందిగ్ధ సంఘర్షణను ప్రదర్శిస్తాడు 'చీకటి కడుపులో వెలుగు దాగుందో వెలుతురు పిడికిట్లో చీకటి బందీ అయ్యిందో' అంటూ... బైరాగి నైరాశ్యం గురించి పాలగుమ్మి 'అది మనసును క్రిందకు లాగేది కాదు, అంతరాత్మను బయటకుతీసే ప్రభంజనంలాంటిది అంటాడు'. కరీంనగరం మట్టికి పుట్టడం మూలాన గాజోజు బోధించే కవిత్వం కూ.... డా... రాస్తాడు. ఏకశిల్ప అనేకవస్తువుల

> **భూమి ఆచంద్రతారార్కం ఉన్నట్టే యుద్ధాలూ, పోరాటాలూ, పెద్దమ్మలూ, అవమానాలూ, చెరువులూ, చిలకలూ ఉంటాయి. ఆధునికానంతర కవిని అంత్యక్రియల వరకూ ఇవి మాత్రమే వేటాడకూడదు. ఇప్పుడిక వర్తమాన కవి ఎప్పటికీ పొడవని ఉదయాల్ని కాక నిత్యం అనుభవిస్తున్న అస్తమయాలని ఆహ్వానించాలి.**


గాజోజు కవిత్వం చదువరుల్ని తప్పక disturb చేస్తుంది. తన తల్లి మీద రాసిన semi biographical కవిత 'ప్రాణదీపం' మన అమ్మలను మనకు ఒడినింపుతుంది– ఈమె గ్రామీణ అమ్మ, కుటుంబం కోసం లోకంతో పోరాడి గెలుపోటముల శిలువేయించుకున్న అమ్మ, తాను ఉపాసముండి మనకు అన్గెపు కాయలు తినిపించిన అమ్మ, ఒక చేతిలో కొడుకును మరొక చేతిలో వడ్ల బస్తాను మోస్తూ జీవన గంగను దాటిన అమ్మ, గడప గడపకొక గాయాన్ని చేసుకున్న అమ్మ.



'మహా నిర్మాణ వేదిక' కవితలో పద చిత్రాలు అంత్య కవితల్లో లేని నైరాశ్యం వర్ణించడం నాకు మహానందమున్నూ మహాశ్చర్యమున్నూ. 'విస్ఫోటానంతర వినిర్మాణ సౌందర్య రూపమే జగత్తంతా/ జొమాటో కుర్రాడిలా మరణం తలుపు ముందర నిల్చొని ఎదురుచూస్తుంది/ రిక్తహస్తాల నిష్క్రమణలు/ బతుకమ్మ పూలకు బదులు నదుల శవాలను.../ మునిగిపోతున్న నావలో మునగబోతున్న ముసాఫిర్‌వి/ పట్టుకపోవడానికి పిడికెడు మట్టి పనికిరానిదయ్యె'. – ఇట్లా విభిన్న నవ సమయాల మీద రాసిన కవి.. కొన్ని 'అడివంటుకోకముందే', 'యదాతథంగా', 'కవిత్వం ఒక తపస్సు', 'ఆ కలం' లాంటి cliche కవితలు కూడా రాశాడు.

భూమి ఆచంద్రతారార్కం ఉన్నట్టే యుద్ధాలూ, పోరాటాలూ, పెద్దమ్మలూ, అవమానాలూ, చెరువులూ, చిలకలూ ఉంటాయి. ఆధునికానంతర కవిని అంత్యక్రియల వరకూ ఇవి మాత్రమే వేటాడకూడదు. ఇప్పుడిక వర్తమాన కవి ఎప్పటికీ పొడవని ఉదయాల్నికాక నిత్యం అనుభవిస్తున్న అస్తమయాలని ఆహ్వానించాలి. సత్యానంతర సంధి యుగాన నిజ అనిజాల మధ్య చెరిగిపోతున్న రేఖలను దెయ్యమూగాలి. ఏక శిల్ప ఆధునిక కవులు అతికొద్దిమందే అవని మీద సృజనకారులైనారు. తెలుగు భూమండలంలో తొంభైమంది ఏకశిల్ప ఏకవస్తు పూజారులు. సకల కార్యకర్తలకు రక్తమేదైనా నెత్తురే. జన్మచితి ప్రయాణమంతా తన మీద అణచివేత ఉందనీ తనను రేప్ దోపిడీలు చేశారనీ తనను కులదహనం చేశారనీ క్షణానికొక యుద్ధం జరుగుతుందనీ ఆధునికానంతర కవి ఏకశైలి ఏకవస్తు మహాboring నర్తనం చేయకూడదు. చేస్తే తాను శాస్త్రీయ, జానపద కవిగా మిగిలిపోతాడు.

■ శ్రీనివాస్ దెంచనాల
✆ 98483 26517



సాకలమ్మ

సూర్యుడు కాలాన్ని మోసినట్లు
క్రీస్తు శిలువను భరించినట్లు
వీపులమీద కొండంత మురికి బట్టల మూట
చాకిరేవుకీ ఊళ్లకీ రాసిచ్చిన రాగిశాసనం బాట
వానొచ్చినా రాకపోయినా వెలుగొచ్చినా కరువొచ్చినా
చెరువు బండ మీదనే బతుకింకిపాయే!

నిలబడిన నీళ్లల్ల సవికిన కాళ్ల బర్రెజెనిగల తూట్లు
ఉస్సో ఉస్సో హైలెస్సా బండపై వరుస బతుకు దర్వులు
దరువు దరువుకు పత్తిపూల తెలుపులు
ఆరేసిన బట్టల సింగిడి మీద పిట్టల ముచ్చట్లు
ఇంట్ల ఆకలి మంటలు వీధిలో ఎగతాళి సామెతల పోటులు
ఒక్కరోజు సుస్తయినా
సాకల్ది ఇంటికే రాకపాయని ఈరంగ మేసే పెత్తందారులు
మిరాశీ ఇచ్చేకాడ మాత్రం నెత్తులు గోకుతరు

చెరువెండినా
చెలిమె అలిగినా కాలువ వొట్టిపోయినా
చెరువుమీద చాకిరేవాగలే
చావు వార్తలకు పెళ్లి పిలుపులకు
ఊరూరా ఉత్తరమై తిరిగి ఎద్దుగిట్టల్లా అరిగిన కాళ్ళు
చాకిరేవు పిలుపు మేలుకొలుపు

పిల్లోడు బడికోయినట్లు
దినం తప్పకుండా ఇటింటి మైలగుడ్డలు
మూడురాళ్ల మీద గూనపెంకులా పొయ్యి
అరచేతిలో పులిమి పులిమి రేవు ఒడ్డున చెక్కరొచ్చే
పలక బలపం పట్టకపోయినా
ఏ ఇంటి కాయింటి ఏ అమ్మ కాయమ్మ
పిండేసిన బట్టల లెక్క మరువని లెక్కల టీచర్
సద్దిబువ్వేసినా బెల్లం గారెనేసినా ముక్కిరుసకుండా
ఊరి ఆరోగ్యమే మహాభాగ్యమని భూదేవిలా మురిసి నడిచే

చంద్రవంకలా దివిటి కోలెత్తి పెళ్లంత తానై ముందు నడిచే
అవిరేను ముందు అమ్మమ్మలా మిత్తితీసి దీవించే
చావుకర్మలల్ల రుడం తీసి అందరికన్న ముందే నీళ్లల్ల మునిగే
ఇల్లంత సున్నమేసి ఇండ్లసందాకలి ఊడ్సి
ఎంగిలి ఆకులు తీసి, ఇంటికోతమ్మా! అన్నప్పుడు
పాతచీర చేతుల పెట్టి పాడుబుద్ధిని పోనిచ్చుకోరు


పురుట్ల నెత్తురంతెత్తి పురుడుపోసే
సమర్తతే శుభ్రం చేసి మూలన బట్టపరిసి
ముట్టుగుడ్డలు పీతిబట్టలు కాన్పుబట్టలు చావుగుడ్డలు
ఇంటివెట్టి ఊరువెట్టి ఈతపోర్కై ఊడ్సే
సబ్బులు సర్ఫులు డిటర్జంట్లు లేని కాలంలో
సౌడును సబ్బుగా కనిపెట్టిన శాస్త్రజ్ఞులు
సచ్చేదాక సేవలై తనువు బాణమైనా ఏ గౌరవాన్ని నోచుకోలే

చావిడికైనా దేవళానికైనా
కోటమైసమ్మ పండుగ్గైనా పోశమ్మకు బోనాలైనా
గోడల బూజు దులిపి నిండుపున్నమై పూసే కుంచెలు
దేవుడి ముందు నైవేద్యమైనా దేవర ముందు యాటకోసినా
ఎర్రకూడు పచ్చకూడు తెల్లకూడు దిష్టితీసే పెద్దమ్మ
గండదీపానికీ మట్టంటకుండా అరచేతులను కోకలుగా పరిచే
సాంప్రదాయాలను మూలసుక్కలా నిలబెట్టిన తల్లి

పనంతా తనదే బరువంతా ఆమెదే ఊరిమురికంతా మింగింది చాకిరంతా మోసింది
రేవునుండి బట్టలమూటతో వాకిట్లో చంద్రకాంతి
ప్రతి ఇంటికి కడపలా ఆడబిడ్డై సేవలుచేసే మానవతామూర్తి
సాకలమ్మ లేని ఊరు బండి యాట తాడుతెగినట్లే
తెలుపు లేని నలుపు మామిడి తోరణం లేని పెళ్లే!

■ వనపట్ల సుబ్బయ్య
✆ 94927 65358





రథం సెంటర్‌లో ప్రత్యేక ఎఫ్‌వోబీ

వినాయకుడి ఆలయం, కుమర్నిపాలెం వైపు నుంచి క్యూల్లోకి వచ్చిన భక్తులు అమ్మవారి దర్శనం పూర్తయిన తర్వాత శివాలయం వైపున ఉన్న మెట్ల ద్వారా కిందికి దిగుతారు. వాళ్లంతా కనకదుర్గనగర్‌లోకి వచ్చి ప్రసాదాలను కొనుగోలు చేసి రహదారి మీదకు వస్తారు. ఇలా వచ్చిన భక్తుల్లో చాలా మంది కాళేశ్వరరావు మార్కెట్ వైపునకు వెళ్తారు. మరికొంతమంది కెనాల్ రోడ్డులోకి వెళ్తారు. కుమ్మరిపాలెం వైపున వాహనాలను పార్క్ చేసిన భక్తులు అక్కడికి వెళ్లాలంటే కిలోమీటరు దూరంలో ఉన్న వినాయకుడి ఆలయం వద్దకు వెళ్లి అక్కడి నుంచి తిరిగి వెనక్కి రావాలి. భక్తులకు ఇలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు ఈసారి రథం సెంటర్ వద్ద క్యూలైన్ల పై భాగం నుంచి ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. కుమ్మరిపాలెం వైపునకు వెళ్లే భక్తులు రహదారి దాటడానికి క్యూలైన్లు అడ్డుగా ఉన్నా ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జి పై నుంచి కెనాల్ రోడ్డులోకి వెళ్లవచ్చు.

ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి శరన్నవరాత్రి మహోత్సవాలకు వేళయ్యింది. తొలిరోజు కనకదుర్గమ్మ శ్రీబాలాత్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. దర్శనాల్లో ఇబ్బందులు తలెత్తకుండా 500 దర్శన టికెట్లు రద్దు చేసి, రూ.300, రూ.100, ఉచిత క్యూలు మాత్రమే ఈ సారి అమలు చేస్తున్నారు. ఆరు వేల మంది పోలీసులు, 500 కెమెరాలతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ప్రభుత్వశాఖలు సమన్వ యంతో ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నాయి.



సంబరం నేడే

ఉదయం 8.30 గంటలకు దుర్గమ్మ తొలి దర్శనం



- శ్రీబాలాత్రిపురసుందరిగా అలంకారం
- **వీఐపీలకు 7-9, 3-5 గంటలకు దర్శనాలు**
- **ఆలయంలో, అన్నదానం వద్ద హెడ్‌కౌంట్ కెమెరాలు**
- దసరా విధుల్లో చేరిన పోలీసులు
- **పారిశుధ్య పనులకు 1400 మంది కార్మికులు**



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న సీపీ రాజశేఖరబాబు దంపతులు



(ఆంధ్రజ్యోతి - విజయవాడ): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామి శరన్నవరాత్రి మహోత్సవాల ఆరంభానికి సమయం ఆసన్నమైంది. మరికొద్ది గంటల్లో తొలి అలంకారంతో కనకదుర్గమ్మ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. సోమవారం నుంచి ఇంద్రకీలాద్రిపై 11 రోజులపాటు శరన్నవరాత్రి మహోత్సవాలు జరగనున్నాయి. తొలి రోజున అమ్మవారు శ్రీబాలాత్రిపురసుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటల మధ్యలో అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోంమంత్రి వంగలపూడి అనిత తొలి దర్శనం చేసుకుంటారు. శరన్నవరాత్రుల్లో తొలి రోజున ఇంద్రకీలాద్రిపై రెండు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రులు ప్రారంభించనున్నారు. శివాలయానికి వెళ్లే మార్గంలో దాతల సహకారంతో నిర్మించిన నిత్యపూజల మందిరం, రెండో యాగశాలను మంత్రులు ప్రారంభిస్తారు. వీఐపీ కేటగిరిలో వచ్చే వారికి ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల్లో సమయాలను కేటాయించారు. ఆ సమయంలో భక్తుల రద్దీ తక్కువగా ఉంటున్న నేపథ్యంలో అధికారులు మిగతా 6లో..

విధుల్లోకి భారీగా సిబ్బంది

ఇంద్రకీలాద్రిపై 11 రోజులపాటు జరిగే శరన్నవరాత్రి ఉత్సవాల్లో విధులు నిర్వర్తించేందుకు ఆయా శాఖలు రాష్ట్రం నలుమూలల నుంచి సిబ్బందిని డిప్యూటేషన్‌పై తీసుకొచ్చాయి. దేవదాయ శాఖలో వివిధ దేవాలయాల్లో పనిచేస్తున్న 500 మంది అధికారులు, సిబ్బందికి ఇంద్రకీలాద్రిపై అధికారులు విధులు కేటాయించారు. ఇంద్రకీలాద్రి పై నుంచి భక్తులు సంచరించే అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వాహణకు 1400 మంది కార్మికులను వీఎంసీ నియమించింది. వాళ్లంతా మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తిస్తారు. బందోబస్తు కోసం పోలీసు అధికారులు మొత్తం ఆరు వేల మంది అధికారులు, సిబ్బందిని రంగంలోకి దింపారు. ఇందులో ఐదు వేల మంది పోలీసులు ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని వారు కాగా మిగిలిన 1000 మందిని ఇతర జిల్లాల నుంచి తీసుకొచ్చారు. బందోబస్తు విధులకు వచ్చిన వారికి ఆదివారం సాయంత్రం డ్యూటీ పాయింట్లు కేటాయించారు.

వరద ఉధృతి

కృష్ణానదికి పెరిగిన వరద



- చప్టాలపై ప్రవహిస్తున్న నీరు
- గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు
- **వాగు దాటుతూ నీటిలో వ్యక్తి గల్లంతు**




ఉధృతంగా వెదుళ్లవాగు (ఇన్‌సెట్‌లో) శుద్దవాగులో గల్లంతైన శ్రీనివాసరావు(ఫైల్)

జగ్గయ్యపేట రూరల్/తిరువూరు/కంచికచర్ల రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి ఆదివారం అనూహ్యంగా వరద పెరిగింది. ముక్త్యాల వద్ద రెండు ఒడ్డులను తాకుతూ కృష్ణమ్మ దిగువకు పరుగులు పెడుతోంది. నదీ పరివాహక గ్రామాలైన వేదాద్రి, రావిరాల, ముక్త్యాలలో అధికారులు హైఅలెర్ట్ ప్రకటించారు. ఎగువనున్న నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి పులిచింతలకు మూడు లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో పులిచింతల నుంచి 11 గేట్లను ఎత్తి 3.50 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. రెండు రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ఉప నదుల నుంచి వరద పెరిగే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయా శాఖల అధికారులు హెచ్చరిస్తున్నారు.

చప్టాలపై వరదనీరు.. నిలిచిన రాకపోకలు

ఎగువన కురుస్తున్న వర్షాలకు తోడు నియోజకవర్గంలో శనివారం రాత్రి పడిన భారీవర్షంతో వాగులు, చప్టాలపై వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలు కొంతసేపు నిలిచిపోయాయి. తిరువూరులో 88.6 మిల్లీమీటర్లు, గంపలగూడెంలో 75.8, ఎకొండూరులో 50.4, విస్సన్నపేటలో 51.2, రెడ్డిగూడెంలో 70.4 మిల్లిమిటర్ల వర్షాపాతం మిగతా 6లో..

విజయవాడ ఉత్సవ్‌కు సర్వం సిద్ధం



గొల్లపూడిలో చురుగ్గా ఎగ్జిబిషన్ ఏర్పాట్లు

నేటి నుంచి 11 రోజుల పాటు ఉత్సవాలు

- 300లకు పైగా కార్యక్రమాల ఏర్పాటు
- అన్ని వర్గాల ప్రజలకు సాంస్కృతిక, ఆధ్యాత్మిక వినోదం
- దసరా ఉత్సవాలకు సమాంతరంగా విజయవాడ ఉత్సవ్
- 50 లక్షల మంది హాజరవుతారని అంచనా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ): విజయవాడ ఉత్సవ్‌కు నగరం సిద్ధమైంది. సోమవారం నుంచి 11 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఇప్పటికే నగరాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దసరా ఉత్సవాలకు సమాంతరంగా ఈ ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో తెలుగు సంస్కృతి, సాంప్రదాయలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. నగరంలోని ప్రముఖ ప్రాంతాలైన తుమ్మలపల్లి కళాక్షేత్రం, ఘంటసాల సంగీత కళాశాల, పున్నమి ఘాట్, గొల్లపూడి ప్రాంతాల్లో ఉత్సవ్‌కు సంబంధించిన కార్యక్రమాలు జరుతాయి. దీంతో ఆయా ప్రాంతాలను ముస్తాబు చేశారు. బందరు రోడ్డు, ఏలూరు రోడ్డు తదితర ప్రముఖ రహదారులకు విద్యుత్ కాంతులు అద్దారు. డివైడర్‌లలోని విద్యుత్ స్తంభాలకు కట్టిన రంగురంగుల లైటింగ్ తోరణాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. గత ఏడాది దసరా ఉత్సవాలకు 17 లక్షల మంది భక్తులు విచ్చేశారు. ఈ ఏడాది 20 లక్షల మంది భక్తులు మిగతా 6లో..

నగరంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.



భక్తుడి చేతిలో దసరా దివ్యదర్శిని

- యాప్‌లో దుర్గగుడి సమగ్ర సమాచారం
- భక్తులకు సులువుగా అమ్మవారి దర్శనం
- అన్ని వివరాలు యాప్‌లోనే నిక్షిప్తం 6

భక్తులకు మంచి ఆతిథ్యం ఇవ్వండి

భక్తుడి చేతిలో దసరా దివ్యదర్శిని యాప్



ఇంద్రకీలాద్రి: దుర్గగుడిలో విశ్వావసు నామ సంవత్సర దసరా మహోత్సవాలు ఈనెల 22న సోమవారం నుంచి 11 రోజులపాటు జరగనున్నాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తారని అంచనా. గత ఏడాది 13.5 లక్షల మంది రాగా, ఈసారి 20 లక్షల మంది వస్తారని అధికారుల అంచనా. ఇంత పెద్ద ఎత్తున జరిగే దసరా మహోత్సవాలకు సంబంధించి దేవస్థానం, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేశ, విదేశాల నుంచి భక్తులు వస్తారు. వీరందరికీ దుర్గగుడిలో జరిగే పూజలు, ఏర్పాట్లు, దర్శనానికి ఎలా వెళ్లాలి, తదితర అంశాల అన్నింటి అవగాహన కల్పించేలా యాప్‌ను రూపొందించింది. అమరావతి సాఫ్ట్‌వేర్ సంస్థ ఈ యాప్‌ను సిద్ధం చేసింది. ఇప్పటికే ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్నవారందరి చేతుల్లోకి వెళ్లింది. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే దుర్గగుడిలో జరిగే అన్ని అంశాలు ఇట్టే తెలిసిపోతాయి. యాప్‌లో దుర్గామల్లేశ్వరుల ఆవిర్భావం, దుర్గమ్మవిశిష్టత అందులో పొందుపరిచారు. తొలి పేజీల్లోనే అమ్మవారి 11 అలంకారాలు, పేర్లు, వివరాలు వివరించారు. అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, దుర్గగుడి ఐటీ విభాగం, అధికారుల సలహాలతో ఈ యాప్‌ను రూపొందించారు. భక్తుడు వివరాలను తెలుసుకునేందుకు ఎవరినీ అడగాల్సిన అవసరం లేకుండా అన్ని వివరాలున్నాయి. సమాచార కేంద్రం, రిసెప్షన్ సెంటర్‌లు కూడా ఉన్నాయి. మరోవైపు అన్ని ప్రాంతాల్లోనూ వివిధ విభాగాల అధికారులతో శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈయాప్ ఉంటే దర్శనం చాలా సులువు.

- దసరా ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు
- ధరలు పెంచవద్దని ఆటో, ట్యాక్సీదారులకు హెచ్చరికలు
- ఆహార ధరలు పెంచవద్దని హోటల్స్, ఫుడ్‌కోర్టులకు ఆదేశాలు
- వాణిజ్యదుకాణాలను అందంగా అలంకరించాలని ఆదేశాలు
- సామాన్య భక్తుల కోసం వీవీఐపీలు, వీఐపీలు ఇలా చేయండి
- నగర ప్రజలకు ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ పిలుపు

కలెక్టరేట్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దసరా మహోత్సవాలకు ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని, విజయవాడ వచ్చే భక్తుల కోసం సురక్షితమైన, సౌకర్యవంతమైన, సంతృప్తికరమైన అనుభవం కలిగించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఇదే సందర్భంలో విజయవాడ నగర ప్రజలు, ఆటో - ట్యాక్సీ డ్రైవర్లు, ఆహార విక్రయదారులు, హోటల్స్, వాణిజ్యదుకాణదారులు నిర్వహించాల్సిన బాధ్యతల గురించి ఖచ్చితంగా పాటించాల్సిన నిబంధనలను ఆయన ఆదివారం మీడియాకు విడుదల చేశారు. భక్తులు, వీవీఐపీలు, వీఐపీలు, విధుల్లో ఉన్న అధికారులు ఏమి చేయాలో ఆయన దిశానిర్దేశం చేశారు.

ఆటో - ట్యాక్సీ డ్రైవర్లకు సూచనలు..

ఆటో, టాక్సీ డ్రైవర్లు మీటర్/ప్రభుత్వ రేట్ల ప్రకారం మాత్రమే చార్జీలు వసూలు చేయాలని, అధిక ధరలు వద్దని తెలిపారు. వాహనాలు శుభ్రంగా ఉంచి యాత్రికులకు సౌకర్యం కలిగించాలని, ట్రాఫిక్ నియమాలు పాటించి డ్రాప్ పాయింట్ల వద్ద సహకరించాలని కలెక్టర్ కోరారు. వృద్ధులు, వికలాంగులు, స్త్రీలకు సహాయం చేయాలని తెలిపారు.

ఫుడ్‌కోర్టులు, హోటల్స్ నిర్వాహకులకు..

ఆహార విక్రేతలు, హోటళ్లు శుభ్రత, పరిశుభ్రత పాటించాలని, ధరల జాబితా స్పష్టంగా ప్రదర్శించాలని, తక్కువ ధరలో అన్నపూర్ణ భోజనాలు, తాళీలు అందించాలని తెలిపారు. ప్లాస్టిక్ వాడవద్దని, పర్యావరణానికి అనుకూల పాత్రలు ఉపయోగించాలని తెలిపారు.



ఇతర వాణిజ్యదుకాణదారులకు ..

దుకాణాలను దీపాలతో, పూలతో, సంప్రదాయ అలంకరణలతో సుందరంగా అలంకరించాలని, యాత్రికులకు స్వాగతం తెలిపేలా దసరా శుభాకాంక్షల బోర్డులు ప్రదర్శించాలని, దుకాణాల ముందు పరసరాలను శుభ్రంగా ఉంచాలని, రోడ్లను ఆక్రమించడం లేదా పాదచారుల కదలికకు అడ్డంకులు కలిగించడం నివారించాలన్నారు. వీలైన చోట తాగునీటి సదుపాయం, విశ్రాంతి కోసం కూర్చునే చోటు కల్పించాలన్నారు. ధరలను స్పష్టంగా ప్రదర్శించి, యాత్రికులను ఎట్టి పరిస్థితుల్లోనూ దోపిడీ చేయరాదన్నారు.

వీవీఐపీలు, వీఐపీలు ఇలా..

వీఐపీలు, వీవీఐపీలకు ఉదయం 7 నుంచి 9 గంటల మధ్య, సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్య ప్రత్యేక దర్శన సమయాలను కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అర్హత కలిగిన వీఐపీలు మాత్రమే ఈ సమయాల్లో వ్యక్తిగత వాహనాలతో ఆలయానికి చేరుకోవచ్చన్నారు. రిఫరెన్సులతో వచ్చేవారు స్టేట్ గెస్ట్‌హౌస్ వద్ద స్వీకరించి, ప్రోటోకాల్ వాహనాలతో ఆలయానికి తీసుకెళ్తారన్నారు. పెద్దబృందాలతో రాకుండా, అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

అధికారులూ ఇవి చేయండి

సాధారణ భక్తుల సౌకర్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, మర్యాదకనబడేలా, స్పందనీయంగా వ్యవహరించాలని, పోలీసు, వైద్య, శానిటేషన్, దేవస్థాన సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని, సమస్యలు వెంటనే కంట్రోల్ రూంకి తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు.

విజయవాడ ప్రజలకు ఇవీ సూచనలు

భక్తులు, యాత్రికులకు నగర ప్రజలు సంప్రదాయ ఆతిథ్యం అందించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ విజ్ఞప్తి చేశారు. రద్దీ సమయాల్లో ఆలయ ప్రాంతానికి అనవసర ప్రయాణాలను నివారించాలని, పరిశుభ్రత పాటించాలని, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయద్దని, స్వచ్ఛంద సంస్థలు సేవలకు స్వాగతం పలకాలని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

భక్తులూ ఇవి పాటించండి

భక్తులు నిర్దేశిత క్యూలైన్లలో ప్రవేశించాలని, తక్కువ సామానుతో రండి, వ్యక్తిగత వస్తువులను జాగ్రత్తగా ఉంచాలన్నారు. పోలీసులు, వలంటీర్ల సూచనలు పాటించాలని, పబ్లిక్ టాయిలెట్లు, తాగునీరు, వైద్య సౌకర్యాలను వినియోగించుకోవాలని, అత్యవసరాకు హెల్ప్‌లైన్ నెంబర్లు అందుబాటులో ఉన్నాయని, వృద్ధులు, శిశువులతో ఉన్న మహిళలు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు ఉన్నాయన్నారు.

ఒక్క క్లిక్‌తో సాఫీగా అమ్మ దర్శనం

క్యూ ఆర్ కోడ్ ఫీడ్ బ్యాక్ పోస్టర్లు: కలెక్టర్

కలెక్టరేట్: దసరా శరన్నవరాత్రుల్లో సాంకేతికత తోడుగా సామాన్య భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణంలో అమ్మవారి దర్శ నం లభించేలా ఏర్పాట్లు చేశామని, టెక్ తోడుగా ఎలాంటి అసౌకర్యం లేకుండా చూ స్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, హోల్డింగ్ ప్రాంతాలు, 1.8 కి.మీ మేర ఉన్న క్యూలైన్, ఇలా వివిధ ప్రాం తాల్లో క్యూ ఆర్ కోడ్ ఫీడ్ బ్యాక్ పోస్టర్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి 100 మీటర్లకు ఈ పోస్టర్లను ఉంచుతున్నట్టు పేర్కొన్నారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఉత్సవాల ఏర్పాట్లపై అభిప్రాయాలు లేదా సమస్యలను తెలపవచ్చన్నారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన వెంటనే ఏర్పాట్లలో ఏదైనా అసౌకర్యాలు ఉన్నాయా? అనే ప్రశ్న కనిపిస్తుందని, ఆ ప్రశ్నకు సమాధానమిచ్చి, అభిప్రాయాన్ని తెలియజేసి సబ్‌మిట్ బటన్ ప్రెస్ చేయాలని సూచించారు. 8885 592974 నెంబరుకు కాల్ చేసి సమస్యను తెలియజేయవచ్చన్నా రు. ఎక్కడైనా సమస్య ఉందని తెలియజేస్తే యుద్ధప్రాతిపదికన పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.



ప్రపంచంలోనే అతిపెద్ద కార్నివాల్‌గా విజయవాడ ఉత్సవ్

- విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్

విద్యాధరపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఉత్సవ్ ప్రపంచంలోనే అతి పెద్ద కార్నివాల్‌గా ఉండబోతోందని ఉత్సవ్ కమిటీ సభ్యుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. భవానీపురం ఎన్‌డీఏ కార్యాలయంలో ఆదివారం కూటమి నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విజయవాడ ఖ్యాతికి పునర్వైభవం తెచ్చేలా ప్రపంచంలోనే అతి పెద్ద కార్నివాల్‌గా ఉత్సవ్ నిలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సారథ్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మైసూర్ దసరా ఉత్సవాల తరహాలో ఈ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించామని, దేశం నలుమూలల ఉన్న అతిరథ, మహారథులను ఆహ్వానించామన్నారు. ఆసక్తి గల కళాకారులు పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి పత్తిపాటి శ్రీధర్‌ను కలవాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, ఆర్యవైశ్య మహాసభ ఏపీ గౌరవాధ్యక్షుడు పెనుగొండ సుబ్బారాయుడు, ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యుడు ముత్తవరపు మురళీకృష్ణ, బొప్పన భవకుమార్, ఫతావుల్లా. సోలంకి రాజు, రామారావు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు నేతలు పాల్గొన్నారు.

విజయవాడ ఉత్సవ్‌ను జయప్రదం చేద్దాం

విజయవాడ ఉత్సవ్‌ను జయప్రదం చేయాలని ఉత్సవ్ కమిటీ సభ్యుడు, నిర్మాత సుంకర అనిల్ అన్నారు. భవానీపురంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం పలువురు నేతలతో సమావేశమయ్యారు. దేశం గర్వపడేలా, ప్రపంచం ఆకర్షించేలా ఈ ఉత్సవ్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, కార్పొరేటర్ బుల్లా విజయకుమార్, పీవీ చినసుబ్బయ్య, డాక్టర్ రమ్య, రౌతు రమ్యప్రియ, తిరుపతి అనూష, ఇన్నర్‌వీల్ సన్‌షైన్ అధ్యక్షురాలు భబితజైన్, సెక్రటరీ టీ సుజాత పాల్గొన్నారు.

గ్లోబల్ కల్చరల్ హబ్‌గా నగరమే లక్ష్యం

నగరాన్ని గ్లోబల్ కల్చరల్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎంపీ శివనాథ్ (చిన్ని) అన్నారు. ఆదివారం ఆయన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి పున్నమిఘాట్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడ ఉత్సవ్ సందర్భంగా నగరం మరింత శోభాయమానంగా రూపుదిద్దుకుంటుందన్నారు.



కూరగాయల లారీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్పీ

టీటీడీకి కూరగాయలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల బ్రహ్మోత్సవాల సందర్భంగా నిత్యాన్నదాన పథకానికి విజయవాడ సురక్షా కమిటీ కన్వీనర్ కే నరసయ్య ఆధ్వర్యంలో 10 టన్నుల కూరగాయలను పంపారు. ఈ లారీని విజయవాడ పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ ఎస్వీ రాజశేఖరబాబు దంపతులు జెండా ఊపి ఆదివారం ప్రారంభించారు. సురక్ష కమిటీ, వేంకటేశ్వర భక్త సమాజం ఈ కూరగాయలను సమకూర్చాయి. డీసీపీ సరిత, సురక్ష కమిటీ ప్రతినిధులు బొప్పన మహీనాథ్, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనం చేసి గాంధీ శిల్పబజార్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్

హస్తకళలను ప్రోత్సహించాలి

- రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి

బెంజ్‌సర్కిల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయాలను పరిరక్షించుకునేలా ప్రతి ఒక్కరూ హస్తకళలను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. ఆదివారం మేరిస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో కేంద్ర ప్రభుత్వ హస్తకళల సంస్థ ఆధ్వర్యంలో ఏపిట్కో నిర్వహణలో ఏర్పాటు చేసిన గాంధీ శిల్పబజార్‌ను చైర్మన్ జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ ఏ శేఖర్, హస్తకళల అభివృద్ధి సంస్థ ఏడీ ఎన్ అపర్ణలక్ష్మి, ఏపిట్కో సంస్థ ప్రతినిధులు ఎస్ గోపాలరావు, డీ సుధీర కుమార్ పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా కమర్షియల్ ట్యాక్స్ ఎన్జీవోస్ అసోసియేషన్ ఎన్నికలు

గాంధీనగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ది కమర్షియల్ టాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియషన్స్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా భవనారి వెంకటేష్‌బాబు, కొప్పోలు సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో ఆదివారం 15 పోస్టులకు జరిగిన నామినేషన్లలో 15 నామినేషన్లు మాత్రమే రావడంతో ఎన్నికలు ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్జీవో అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఏ విద్యాసాగర్, డీ రమణ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.నూతన అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాట్లాడుతూ విద్యాసాగర్ సారథ్యంలో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తామమన్నారు. సంఘం రాష్ట్ర కోశాధికారిగా జీఎన్వీ రత్నకుమార్, రాష్ట్ర సహాధ్యక్షుడిగా స్వామినాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సందీప్ తదితరులు ప్రమాణస్వీకారం చేశారు.

డిగ్రీ కాలేజీల బంద్‌కు మద్దతు: ఎస్ఎఫ్ఐ

అమరావతి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రైవేటు డిగ్రీ కాలేజీలు సోమవారం నుంచి చేయనున్న బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామ్మోహన్‌రావు, కె.ప్రసన్నకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పెండింగ్‌లోని రూ.6400 కోట్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థి లోకమంతా బంద్‌లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కాపుల సమస్యలపై డిసెంబరు 26 నుంచి నిరవధిక నిరహార దీక్షలు

గాంధీనగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల ప్రజలు దశాబ్దాలుగా అన్యాయానికి గురవుతున్నారని కాపు రిజర్వేషన్ పోరాట సమితి (కేఆర్‌పీఎస్) రాష్ట్ర చైర్మన్ చలమల్ల ప్రసాదరావు ఆవేదన వ్యక్తం చేశారు. సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. సమితి రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ మాసబత్తుల శ్రీనివాస్, కో ఆర్డినేటర్లు అమ్మ శ్రీనివాస్ నాయుడు, జానపాముల నాగబాబు, సమతం రాము, జేటీ రామారావు తదితరులు పాల్గొన్నారు.



దసరా ఏర్పాట్లపై తనిఖీలు

ఇంద్రకీలాద్రి: దుర్గగుడిలో దసరా ఏర్పాట్లపై ఉత్సవ ముఖ్యఅధికారిణి దర్భముళ్ళ భ్రమరాంబ ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భక్తులకు లడ్డు ప్రసాదం అందించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఇంకా ఏమైనా లోటు పాట్లు ఉంటే వాటిని వెంటనే సరిచేయడం జరుగుతోందన్నారు. మరోవైపు అన్న ప్రసాదం తయారీకి, భక్తులకు బఫే విధానంలో అన్నప్రసాదం అందించేందుకు సర్వం సిద్దం చేశామన్నారు.అన్ని ఏర్పాట్లు బాగానే ఉన్నాయని తెలిపారు, ఉత్సవాలలో భక్తుల సంతృప్తి మేరకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు ఆమె వెంట ఏఈవో శ్రీనివాస్(వాసు), సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



బందోబస్తు విధులు చేపట్టిన పోలీసులు

దసరా మహోత్సవాలను పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో వచ్చే భక్తుల నియంత్రణకు, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం నియామకమైన పోలీసులు ఆదివారం ఎ యంత్రం నుంచే విధుల్లోకి చేరారు. మొత్తం 4వేలమంది పోలీసులు 3 షిఫ్టుల్లో పనిచేయనున్నారు. ప్రధానంగా ఐదు వారాల క్రితం ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది. దీంతో ఈసారి ఉత్సవాలకు మహిళా భక్తుల సంఖ్య అధికంగా ఉంటుందని భావిస్తున్నారు. వారికి ఎక్కడా ఇబ్బంది లేకుండా ఉండేందుకు పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. సీసీ కెమెరాల నిఘాతో పాటు పోలీసులను అప్రమత్తం చేస్తున్నారు. ఏ చిన్న అవాంఛనీయ సంఘటన కూడా జరగకుండా చూడాలని ఇప్పటికే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అమ్మవారి దర్శనం కోసం కొండపైకి వెళ్ళేందుకు కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి క్యూలు ప్రారంభమవుతున్నాయి. కాళేశ్వరరావు మార్కెట్ నుంచి కెనాల్ రోడ్డు, కొండపైన, కొండదిగువన, స్నానఘాట్లు, ప్రసాదాల కౌంటర్లు, అన్నప్రసాద పంపిణీ, మెయిన్ టెంపుల్, కొండపైన క్యూలు, గట్టు వెనుకప్రాంతం, పార్కింగ్ ప్రదేశాలు, కేశఖండనశాల ఇలా ప్రతి చోటా కూడా పోలీసులు బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు.

కనకదుర్గమ్మకు సాంస్కృతికోత్సవం

- నేటి నుంచి 11 రోజుల పాటు దుర్గమ్మకు కళార్చన
- అమ్మవారి నగరోత్సవంలోనూ కళార్చన
- నిరంతరాయంగా సాంస్కృతిక ప్రదర్శనలు
- ఆంధ్ర, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కళాకారులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ కల్చరల్/ఇబ్రహీంపట్నం: కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ హోయలు పోతూ తిరిగే ఒంపుల ప్రవాహం ఓ నాట్యం. వేగంగా పరుగులెత్తుతూ ఆ ప్రవాహంలో అలలు చేసే చప్పుళ్లు కమ్మని సంగీతం. మరోవైపు ఇంద్రకీలాద్రిపై ఏర్పాటు చేసిన మహా మండపంలో సాంస్కృతిక ప్రదర్శనల సమ్మేళనం వెరసి దుర్గగుడి పరిసర ప్రాంతాలను భక్తి సాగరంగా మారుస్తోంది. ఈ ఉత్సవాల్లో, అమ్మవారి సమక్షంలో హరికథలు, బుర్రకథలు, పౌరాణిక నాటకాలు నుంచి కర్ణాటక సంగితం, లలిత సంగితం వరకు ఆంధ్ర, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటకలా రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు తమ కళావైభవాన్ని అర్పించి, భక్తుల మనసులను ఆకర్షిస్తున్నారు. మైసూరు దసరా లాంటి గ్రాండ్ 'విజయవాడ ఉత్సవం'గా మారిన ఈ ప్రదర్శనలు, స్థానిక ప్రతిభలకు ప్రాధాన్యత ఇచ్చి ఆకట్టుకోనున్నాయి.

నగరోత్సవంలోనూ కళార్చనలు

శరన్నవరాత్రుల్లో భాగంగా నగరోత్సవానికి బయలుదేరే ముందు, అమ్మవారికి కళా, వాద్య నీరాజనాలు సమర్పించే ఈ ఉత్సవం, భక్తి-కళల సమ్మేళనంగా మారింది. మన రాష్ట్రం, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు తమ గాన, నృత్య, వాద్యాలతో కూడిన ప్రదర్శనలు చేస్తూ, అమ్మవారి పాదాల వద్ద తమ భక్తిని చాటుకుంటున్నారు. భజనలు, కోలాటం, హరికథ, బుర్రకథ, కర్ణాటక గాత్ర, వాద్య సంగీతం, లలిత సంగితం, వివిధ రకాల సంప్రదాయ, జానపద, గిరిజన నృత్యాలు పురాణ సంబంధ అంశాలతో కూడిన ప్రదర్శనలు భక్తులను మురిపిస్తున్నాయి. మంగళవాద్యాలతో పాటు శాక్సాఫోన్, సిండ, గరగాట్టం, బళ్లారి డ్రమ్స్ వాయిద్యాలు ఇంద్రకీలాద్రిని ఒక సాంస్కృతిక పర్వతంగా మార్చాయి.

కళా.. 'సంగమం'!

పవిత్ర సంగమం వేదికగా కొండపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమవారం నుంచి అక్టోబరు 1 వరకు 10 రోజుల పాటు "విజయనర్తనం" పేరిట దసరా సాంస్కృతిక మహోత్సవాలు నిర్వహించనున్నారు. ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రదర్శనలు జరగనున్నాయి. కూచిపూడి, భరతనాట్యం, జానపదం, భక్తి విభావరి, మ్యాజిక్, కోలాటం, మిమిక్రి, వెంట్రిలాక్విజం, యక్షగానం వంటి కళా ప్రదర్శనలను ప్రత్యేక గాంచిన కళారత్న చింతా రవి బాలకృష్ణ, కళారత్న సిల్వెస్టర్, కళా రత్న ఉమామహేశ్వర పాత్రుడు, అజయకుమార్ వంటి ప్రఖ్యాతిగాంచిన నృత్య కళాబృందాలు పాడుతా తీయగా ఫేమ్ రసూల్ వంటి గాయకులు విచ్చేస్తున్నారు.



300 మందితో మహాబృంద నాట్యం

రాష్ట్రంలోని పలుప్రాంతాల నుంచి వస్తున్న కూచిపూడి కళాకారులు 300 మంది మహాబృందంగా దుర్గమ్మను స్తుతిస్తూ నాట్యం చేయనున్నారు. 'అయిగిరినందిని' అంటూ దుర్గమ్మకు జయధ్వానాలు పలికే ఈ కీర్తనకు 300 మంది కూచిపూడి విద్యార్థులు లయబద్ధంగా నర్తించనున్నారు. కొండపల్లి కార్పొరేషన్‌తో పాటు ఇటలీ తెలుగు అసోసియేషన్ సంస్థ విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేయనుంది.

మహిళలకు ప్రత్యేక ప్రదర్శనలు

ప్రతిరోజు అమ్మవారి అవతారాలతో ప్రత్యేక పూజలు, మహిళలకు ప్రత్యేకంగా కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, కమిషనర్ రమ్యకీర్తన పర్యవేక్షిస్తున్నారు.

వరద ఉధృతి

(5వ పేజీ తరువాయి)

నమోదైంది. మండలంలోని వెదుళ్లవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో చౌటపల్లి, జీకొత్తూరు, చిక్కుళ్లగూడెం, పల్లెర్లమూడి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

వాగులో వ్యక్తి గల్లంతు

బైక్‌తో వాగు దాటుతున్న వ్యక్తి నీటి ఉధృతికి కొట్టుకుపోయి ఘటన కంచికచర్లలో జరిగింది. కంచికచర్ల నుంచి చెవిటికల్లు గ్రామం వెళ్లే రోడ్డులో శుద్ద వాగు ఉంది. శనివారం రాత్రి భారీ వర్షం కురవడంతో వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. బత్తినపాడుకు చెందిన కామ శ్రీనివాసరావు (35) ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు బైక్‌పై వాగు దాటడానికి ప్రయత్నించాడు. అదుపుతప్పి వాగులో పడిపోయాడు. అతని కోసం గాలించగా సుమారు 200 మీటర్ల దూరంలో బైక్ దొరికింది. శ్రీనివాసరావు ఆచూకీ లభ్యం కాలేదు. నందిగామ రూరల్ సీఐ చవాన్, తహసీల్దార్ నరసింహారావు అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రప్పించి గాలిస్తున్నట్టు ఎస్సై విశ్వనాథ్ తెలిపారు.

సంబరం నేడే

(5వ పేజీ తరువాయి)

ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎంతమంది భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు, ఎంతమంది అన్నదానంలో ప్రసాదంలో స్వీకరించారన్న లెక్కలు తేల్చడానికి హెడ్‌కౌంట్ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇంద్రకీలాద్రి పై నుంచి దిగువ వరకు మొత్తం పరిసరాలను 500 సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తారు. మోడల్ గెస్ట్‌హౌస్ అధునాతన కమాండ్ కంట్రోల్ సెంటర్, మహామండపంలో దేవస్థాన కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. మోడల్ గెస్ట్‌హౌస్‌లో మూడు ఎల్ఈడీ వీడియో వాల్స్‌ను సిద్ధం చేశారు.

ఫ్రేమ్ మోడల్ క్యూ లైన్లు

ఈ ఏడాది అధికారులు క్యూలైన్ల డిజైన్లలో మార్పులు చేశారు. ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన క్యూల డిజైన్లకు భిన్నంగా ఈ ఏడాది ఏర్పాట్లు చేశారు. ఇనుప గడ్డర్లను భూమిలో పాతి వాటికి ఇనుప కంచెను అల్లుతూ వెళ్లేవారు. వాటి వల్ల భక్తులకు స్వల్ప గాయాలయ్యేవి. ఈసారి వాటిని తొలగించి ఫ్రేమ్ మోడల్ క్యూలను ఏర్పాటు చేశారు. ఇనుప కంచె స్థానంలో బారికేడ్లుగా ఉండే ఫ్రేమ్‌లను ఏర్పాటు చేశారు. ఇంత వరకు ఏర్పాటు చేసిన క్యూల్లోకి వెళ్లిన భక్తులు అత్యవసరం సమయంలో బయటకు వచ్చే మార్గం ఉండేది కాదు. క్యూలో కటింగ్ వచ్చే వరకు వేచి ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు క్యూలైన్లలో ప్రతి 50 మీటర్లకు ఒక అత్యవసర ద్వారాన్ని ఏర్పాటు చేశారు. ఆ విషయం భక్తులకు తెలిసేలా ఆ గేటుకు ఎరుపు రంగు వేశారు. అదేవిధంగా అత్యవసర ద్వారం ఉందని ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేశారు. రూ.300, రూ.100, ఉచిత క్యూలు మాత్రమే ఈసారి అమలు చేస్తున్నారు. రూ.500 టికెట్‌ను శరన్నవరాత్రుల్లో రద్దు చేశారు. వినాయకుడి ఆలయం నుంచి క్యూలోకి ప్రవేశించిన భక్తులు ప్రశాంతంగా ముందుకు కదిలేందుకు అధికారులు లలితా సహస్ర నామాలను మైకుల ద్వారా వినిపించాలని నిర్ణయించారు. వినాయకుడి ఆలయం వద్ద, క్యూల మధ్యలో భారీ ఎల్ఈడీ స్ర్కీన్లను ఏర్పాటు చేశారు. మహామండపం ఆరో అంతస్తులో జరిగే పూజలు, యాగశాలలో జరిగే హోమాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. వాటిని ఈ స్ర్కీన్లపై భక్తులకు వీక్షించేలా చేస్తారు. దర్శనానికి ఎంత సమయం పడుతుంది, ఏ కారణంగా క్యూలైన్లు ఆగాయన్న సమాచారాన్ని వాటిపై ప్రదర్శిస్తారు. ప్రసాదాల విక్రయాలకు కనకదుర్గ నగర్‌లో అధికారులు 12 లడ్డూ కౌంటర్లు ఏర్పాటు చేశారు. వాటిలో ఒక కౌంటర్‌ను వృద్ధులకు, మరో కౌంటర్‌ను వికలాంగులకు కేటాయించారు.

దుర్గమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు దసరా మహోత్సవాల సందర్భంగా ఆదివారం ఎన్‌టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. దసరా మహోత్సవాలు ప్రారంభానికి ముందురోజు కనకదుర్గమ్మకు పోలీసులు తొలి సారెగా పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. తొలుత పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు దంపతులు పోలీస్ స్టేషన్‌లో అమ్మవారికి పూజలు చేసి, పట్టు వస్త్రాలు తీసుకుని కాలినడకన ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. వీరికి ఈవో శీనానాయక్, స్థానాచార్యుడు శివప్రసాద శర్మ స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఏసీపీ దుర్గారావు, సీఐ గురుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ ఉత్సవ్‌కు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

అమ్మవారి దర్శనానికి వస్తారని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే విజయవాడ ఉత్సవ్ నేపథ్యంలో నగరానికి 50 లక్షల మంది భక్తులు, పర్యాటకులు, కళాభిమానులు వస్తారని ప్రభుత్వం, నిర్వహణ సంస్థ అంచనా వేసింది. అన్ని వయసుల వారిని అలరించేందుకు 300లకు పైగా కార్యక్రమాలను రూపకల్పన చేశారు. చిన్నారులను అలరించే అమ్యూజ్‌మెంట్ పార్క్‌లు, యువతను ఉర్రూతలూగించే మ్యూజికల్ షోలు, దాండియా, నృత్య ప్రదర్శనలు, కృష్ణానదిలో పడవల పోటీలు, పెద్ద వయసు వారికి ఆధ్యాత్మిక వినోదాన్ని అందించే కార్యక్రమాలు సెప్టెంబరు రెండో తేదీ వరకు జరుగుతాయి.

విజయవాడ ఉత్సవ్-2025లో భాగంగా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని దేవస్థానం భూమిలో నిర్వహించనున్న విజయవాడ ఎక్స్‌పో (ఎగ్జిబిషన్) ఏర్పాట్లు పూర్తయ్యాయి. పుష్కర కాలం తర్వాత సోమవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ఈ ఎగ్జిబిషన్‌ను కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	133,142, 153
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

నేడు ఆటోనగర్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆటోనగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): లైనర్స్ ఇండియా ఫీడర్ పరిధిలో పాత విద్యుత్ లైన్స్ స్థానంలో కొత్తవాటని ఏర్పాటు చేస్తున్న కారణంగా సోమవారం ఉదయం 6నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకువిద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల విద్యుత్ శాఖ ఈఈ పి.హరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆటోనగర్ ఒకటి, రెండు క్రాస్ రోడ్ల మధ్య 3, 5 రోడ్లు, ఒకటో క్రాస్ రోడ్డులో పంటకాల్వ రోడ్డు, మైత్రేయ ఎలక్ట్రికల్ రోడ్డులో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కొండ దిగువన సర్వంసిద్ధం



కృష్ణవేణి ఘాట్, మహిళలు దుస్తులు మార్చుకోవడానికి ఏర్పాటుచేసిన తాత్కాలిక గదులు

- వినాయకస్వామి గుడి, కుమ్మరిపాలెం వద్ద క్యూలు మొదలు
- కృష్ణవేణి, సీతమ్మపాదాల ఘాట్, పున్నమిఘాట్లలో స్నానాల ఏర్పాట్లు
- తెప్పోత్సవం ఏర్పాట్లు సందర్భంగా దుర్గాఘాట్ క్లోజ్
- వాహనాల పార్కింగ్‌లకు స్థలాల కేటాయింపు, సూచిక బోర్డులు
- కృష్ణానగర్ వద్ద 11 భారీ కౌంటర్లలో ప్రసాదం
- సీతమ్మపాదాలఘాట్ ఎదురుగా కేశ ఖండనశాల

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు ఎటువంటి గందరగోళానికి గురవ్వకుండా ఇతర ప్రాంతాలనుంచి వచ్చే భక్తులకు అర్థమైయ్యేలా సూచిక బోర్డులు ఏర్పాటుచేశారు. గుడికి రెండు వైపుల నుంచి వచ్చే భక్తులకు క్యూలను సిద్ధం చేశారు. తలనీలాలు సమర్పించే భక్తులందిరికీ ఒకేచోట కేశఖండన జరిగేలా సుమారు 150 కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆడవాళ్లు దుస్తులు మార్చుకోవడానికి వీలుగా తాత్కాలిక గదులు ఏర్పాటు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వాహనాల్లో వచ్చే భక్తుల కోసం ఐదు పార్కింగ్ స్థలాలను కేటాయించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అమ్మవారి గుడి కింద(కనకదుర్గనగర్)లో 11 పెద్ద ప్రసాద కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ తాత్కాలిక టాయిలెట్ గదులు, డస్ట్‌బిన్‌లను పెట్టించారు.

మూడు ఘాట్లలో స్నానాలకు అనుమతి

భక్తుల భద్రతా దృష్టా అధికారులు కేవలం మూడు ఘాట్లలోనే స్నానాలకు ఏర్పాట్లుచేశారు. బస్టాండ్ సమీపంలోని కృష్ణవేణి ఘాట్‌లో భక్తుల స్నానాలు చేసుకునేలా సిద్ధంచేశారు. మహిళలు దుస్తులు మార్చుకోవడానికి వీలుగా తాత్కాలిక గదులను నిర్మించారు. సీతమ్మపాదాల ఘాట్‌లో ఎక్కువగా మాలాధారణ ధరించిన భక్తులు వస్తారు. వారు ఇక్కడే దుస్తులు, మాలాధారణ వస్తువులు విడిచిపెట్టేస్తారు. వీటిని ఎప్పటికప్పుడు శుభ్రంచేసే విధంగా అధికారులు ఘాట్‌లో ఒక కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేశారు. హైదరాబాద్, నందిగామ, ఇబ్రహీంపట్నం వైపు నుంచి వచ్చే భక్తులు పున్నమీఘాట్‌లో స్నానాలు చేసుకుని అమ్మవారి దర్శనానికి వెళ్లేలాకుమ్మరిపాలెం వద్ద క్యూ ఏర్పాటు చేశారు. తెప్పోత్సవం పనులు జరుగుతున్నందున దుర్గమ్మ ఘాట్‌ను మూసేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజయదశమి రోజు కేవలం తెప్పోత్సవం చూడడానికి వీలుగా దుర్గాఘాట్‌లోకి భక్తులకు అనుమతినివ్వడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వినాయకస్వామి గుడి, కుమ్మరిపాలెం వద్ద క్యూ ప్రారంభం



అమ్మవారిని దర్శించుకోవడానికి ఉత్తరాంధ్ర, కోస్తా, గుంటూరు వైపు నుంచి వచ్చే భక్తుల కోసం వినాయకస్వామి గుడి వద్ద నుంచి మూడు క్యూలను అధికారులు ఏర్పాటు చేశారు. తెలంగాణ వైపు నుంచి వచ్చే భక్తులు కుమ్మరిపాలెం వద్ద క్యూలోకి వచ్చి కొండ ప్రారంభంలో వినాయకస్వామి గుడివైపు నుంచి వచ్చే భక్తులను కలిసే విధంగా అక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇంతుముందు దసరా ఏర్పాట్లలో లైన్లకు ఇనుపకంచెను ఉపయోగించేవారు. దీనివల్ల భక్తులకు గాయాలవడం, బట్టలు చిరిగిపోవడం వంటివి జరిగేవి. ఈ సారి భక్తులకు అటువంటి ఇబ్బందులు కలగకుండా ఇనుపపైపులను ఉపయోగించి బారికేడ్లు ఏర్పాటుచేశారు.

ఐదు చోట్ల పార్కింగ్



ఇతర రాష్ట్రాలు, ఇతర ప్రాంతాల నుంచి వాహనాల్లో వచ్చే భక్తుల కోసం నిర్వాహకులు నాలుగు చోట్ల పార్కింగ్‌లు ఏర్పాటుచేశారు. బస్సులు, కార్లు పార్కింగ్ చేసుకోవడానికి పున్నమీఘాట్, భవానీఘాట్ వద్ద ప్రత్యేక స్థలాలను కేటాయించారు. కేవలం ఫోర్ వీలర్స్ కోసం వీఎంసీ మినీ స్టేడియంతో పాటు టీటీడీ పార్కింగ్ స్థలాన్ని కేటాయించారు. టూ వీలర్స్ కోసం ప్రత్యేకంగా లోటస్ అపార్ట్‌మెంట్ పక్కన ఖాళీ స్థలాన్ని ఏర్పాటుచేశారు. భక్తులు ఇబ్బంది పడకుండా పార్కింగ్ స్థలాలను సూచించే విధంగా ఎక్కడికక్కడ బోర్డులు ఏర్పాటు చేశారు.

పున్నమిఘాట్ ఎదురుగా కేశఖండన శాలలు



రాష్ట్రం నలుమూలలు, ఇతర రాష్ట్రాల నుంచి దర్శనానికి వచ్చే భక్తుల్లో తలనీలాలు సమర్పించుకోవాలనుకునే భక్తుల కోసం సీతమ్మపాదాల ఘాట్‌కు ఎదురుగా 10 టికెట్ కౌంటర్లతో పాటు సుమారు 150 తలనీలాలు తీసే స్టాల్స్‌ను పెట్టారు.ఇబ్బందులకు గురవకుండా క్యూ పద్ధతి పెట్టారు. తలనీలాలు సమర్పించుకునే వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.



ప్రజారోగ్యానికి కూటమి ప్రాధాన్యం : ఎమ్మెల్యే గద్దె

భారతీనగర్, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. మూడో డివిజన్‌లోని కనకదుర్గానగర్ కాలనీలోని జీవీఆర్ బిల్డింగ్‌లో ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఆస్టర్ రమేష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో టీడీపీ యువనేత గద్దె క్రాంతికుమార్ సహకారంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొని వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసిన వారిని అభినందించారు. శిబిరంలో డాక్టర్లు జి.వి.నాగేశ్వరరావు, ఫణీంద్ర రెడ్డి, బొబ్బా రాకేష్, సాహితి, బాలకృష్ణ, భరత్ చంద్ర, సౌమ్యాదేవి పాల్గొని 250 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు తూమాటి ప్రేమ్‌నాథ్, యలమంచిలి పండు, కనకదుర్గానగర్ కాలనీ పెద్దలు జి.నారాయణరావు, గద్దె రమేష్, దాడి సుబ్బారావు, వి. కృష్ణప్రసాద్, డి.యలమందరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



ఆటోనగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయం

అభయాంజనేయస్వామి ఆలయంలో
నేటి నుంచి దసరా ఉత్సవాలు

ఆటోనగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో సోమవారం నుంచి దసరా ఉత్సవాలు జరగనున్నాయి. ఆలయంలోని రాజయోగ మందిరంలో అమ్మవారికి ప్రతిరోజు ఉదయం 9గంటలకు పూజ కార్యక్రమం, సాయంత్రం ఆరు గంటలకు దీపాలంకరణ సేవ, రాత్రి 7 గంటలకు పూజతో పాటు పంచ హారతులు కార్యక్రమం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. సోమవారం అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.



ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా నవరాత్రుల వేడుక



ప్రసాదంపాడు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నవరాత్రుల సందర్భంగా మొట్టమొదటిసారిగా దాండియా వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. తొలుత జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు దాండియా నృత్యం చేశారు. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజ్ మాట్లాడుతూ పాఠశాలలో ముందుగానే నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయన్నారు. సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు ధరించి ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో పాఠశాల ప్రో వైస్ ఛైర్మన్ పరిమి నరేంద్రబాబు, డైరెక్టర్ కడియాల ప్రవీణ్ కుమార్, ప్రిన్సిపాల్ ఎం.ఎస్.భువనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్ భాటియా పాల్గొన్నారు.





కార్యక్రమంలో పాల్గొన్న సర్దార్ సర్వేశ్వరరావు

ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఏఎన్నార్

- సర్దార్ సర్వేశ్వరరావు

గాంధీనగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అక్కినేని జయంతి వేడుకలు ఆల్ ఇండియా అక్కినేని నాగార్జున యువసేన అధ్యక్షుడు సర్దార్ ఎన్. సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో నగరంలో అనేకచోట్ల జరిగాయి. తొలుత గాంధీనగర్‌లోని కామాక్షి కార్యాలయం సెంటర్‌లో కేక్ కట్ చేశారు. నిర్మల్ హృదయభవన్ అనాథ ఆశ్రమంలోని వృద్ధులు, పేదలకు పాలు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్వేశ్వరరావు మాట్లాడుతూ తన నటనతో అనేక చిత్రాల్లో నటించి మెప్పించిన నాగేశ్వరరావు నేటికి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలచిపోయారన్నారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. తెలుగు చిత్రపరిశ్రమ ఉన్నంతకాలం ఆయన పేరు చిరస్థాయిగా నిలచిపోతుందన్నారు. నాగార్జున, నాగచైతన్య, అఖిల్ వంటి నటులను చిత్రపరిశ్రమకు అందించారని కొనియాడారు. టి.శేఖర్, ఆర్.కృష్ణ, కె.ప్రభాకర్, ఎస్‌కే బాషా, లక్ష్మణ్, ఎం.విజయకృష్ణ, రమ్మీరెడ్డి, ఈడీ రాజు, హనుమంతరావు, అశోక్, రాఘవులు, రియాజ్, సాయి, గోపి ,బీలు, ఆటో బాషా తదితరులు పాల్గొన్నారు.

'తూర్పు'లో కాపు కల్యాణ మండపాన్ని నెలకొల్పాలి

- యర్రంశెట్టి అంజిబాబు, ప్రజా కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు

కృష్ణలంక, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గంలో కాపు కల్యాణమండపాన్ని నెలకొల్పాలని, కాపులంతా ఐక్యంగా వుండాలని ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు కోరారు. ప్రజా కాపునాడు కార్యాలయంలో ఆదివారం 15వ డివిజన్‌కు నూతన కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా మల్లా నారాయణరావు, ప్రధాన కార్యదర్శి గోపు ఆదిశేషు, ఉపాధ్యక్షులుగా మల్లవరపు సూర్యనారాయణ, యన్నం జయకృష్ణ, కార్యదర్శిగా అమృతం సీతారామ కృష్ణ, ముంగర సుభాష్ బాబులకు నియామక పత్రాలు అందించారు. సభ్యులందరూ కాపుల అభ్యున్నతికి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అంజిబాబు కోరారు.

కరుణామయి....జొన్నవాడ కామాక్షితాయి

నెల్లూరు జిల్లా, బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడ(రజితగిరి) క్షేత్రంలో పెన్నానదీ తీరాన 2వ శతాబ్దానికి పూర్వం సాక్షాత్తు పార్వతీ,పరమేశ్వరులే, కామాక్షితాయి, మల్లికార్జునస్వామిగా వెలసి అశేష భక్తజనం పూజలందుకుంటూ కొలిచే భక్తుల కొంగు బంగారంగా అలరారుతున్నారు. ఈ క్షేత్రంలో **నేటి నుంచి అక్టోబర్ 2 వరకు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగునున్నాయి.**

జాలర్లకు వలలో కామాక్షితాయి శిలావిగ్రహం లభ్యం

2వ శతాబ్దానికి పూర్వం ఆటవిక ప్రాంతమైన జొన్నవాడలో ప్రస్తుత ఆలయ సమీపంలో వున్న పెన్నానదిలో జాలర్లకు ఓ రోజు చేపలవేటలో వలలో చేపలకు బదులు ఓ శిలా విగ్రహం లభ్యమైంది. అ శిలా విగ్రహాన్ని జాలర్లు ప్రస్తుత ఆలయ పరిసర ప్రాంతంలోని ఓ చోట ప్రతిష్ఠించి నిత్యం వారికి వేటలో లభ్యమయ్యే మాంసాహారం, శాఖాహారాలే నివేదిస్తూ దాన్నే వారు పూజించేవారు. ఈక్రమంలో అ శిలావిగ్రహంలో నుంచి ఓ ఆదిశక్తి రూపం అర్ధరాత్రుల్లో గ్రామంలో సంచరిస్తూ ఏది ఎదురైతే (మనుషులు, మూగ జీవాలు) దాన్ని బలితీసుకునేదని నాటి పూర్వీకులనుంచి నేటికి అమ్మవారి చరిత్రగా స్థానికులు చెప్తుంటారు.

- నదిలో జాలర్లకు వలలో దొరికిన కామాక్షితాయి శిలా విగ్రహం
- 2వ శతాబ్దంలో పునఃప్రతిష్టించిన ఆదిశంకరాచార్యులు
- స్వయంభుగా వెలసిన మల్లికార్జునస్వామి



పునః ప్రతిష్టించిన ఆదిశంకరాచార్యులు

దేశ పర్యటనలో భాగంగా కంచి కామ కోటి (మొదటి)పీఠాధిపతి జగద్గురు శ్రీ ఆది శంకరాచార్యుల వారు ఒకరోజు జొన్నవాడ పెన్నానదీ తీరాన బస చేశారు. ఆ రాత్రి స్వామివారి దివ్యదృష్టితో ఆప్రాంతంలో సంచరిస్తున్న ఆదిశక్తిని పసి గట్టి అడ్డుకుని ఆ శిలా విగ్రహంలోని ఆది శక్తిని పారద్రోలి లక్ష్మి, సరస్వతి, రాజరాజేశ్వరి అంశాలు నెలకొల్పి "కామాక్షితాయి" అని నామకరణం తో పునఃప్రతిష్టించారు. నాటి నుంచి నేటికీ కంచి పీఠం ఆచార సాంప్రదాయాలే కొనసాగుతున్నాయి. ఇందుకు సాక్ష్యం జొన్నవాడ ఆలయంలోని అంతరాలయంలో జాలరుకు వలలో కామాక్షితాయి శిలావిగ్రహం దొరికినట్టు వున్న చిత్రమే నిలువెత్తు నిదర్శనం.

మల్లికార్జునస్వామి స్వయంభువు కశ్యప్రజాపతి యజ్ఞంలో ఆవిర్భవించిన మల్లికార్జునస్వామి

త్రేతాయుగంలో కశ్యప్రజాపతి జొన్నవాడ పెన్నానది తీరాన కశ్యపతీర్థం రేవు సమీపంలో ప్రస్తుతం స్వామివారి గర్భాలయ స్థానంలో త్రేతాగ్నులను నెలకొల్పి యజ్ఞం చేయగా. ఆ యజ్ఞంలో ఓ కుండలం నుంచి సాక్షాత్తు పరమశివుడు లింగాకారంతో ఆవిర్భవించారు. అలా సాక్షాత్తు పార్వతీ, పరమేశ్వరులే జాలర్లకు వలలో శిలా విగ్రహంగా కామాక్షితాయి, కశ్యప్రజాపతి యజ్ఞంలో గార్హపత్యాగ్ని కుండలంనుంచి మల్లికార్జున స్వామి పవిత్ర పెన్నానదీ తీరాన స్వయంభు గా వెలసి భక్తుల కొంగుబంగారుగా జిల్లా, రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాలనుంచి వచ్చే అశేష భక్తజనుల నిత్య పూజలందుకుంటూ పెన్నానదీ తీరాన పండుగ వాతావరణంతో జొన్నవాడ (రజితగిరి) పుణ్యక్షేత్రం అలరారుతోంది.

కశ్యపతీర్ధంరేవులో స్నానంతో అశ్వత్థామునికి కుష్టువ్యాధి విముక్తి

శాపగ్రస్తుడైన అశ్వత్థమహాముని కుష్టు వ్యాధితో బాధపడుతూ వ్యాధి నయంకాక ఆఖరికి కామాక్షితాయి శరణుకోరి జొన్నవాడలో పెన్నా నదిలోని కశ్యపతీర్థం రేవులో స్నానం చేసి కామాక్షితాయిని దర్శించి కుష్టు వ్యాధి నుంచి విముక్తిపొందినట్లు స్కందపురాణంలో పేర్కొనబడివుందని పండితులు చెబుతున్నారు. మహా మునులకే వ్యాధి విముక్తి చేసిన కశ్యపతీర్థంరేవు, మల్లికార్జునస్వామి, కామాక్షితాయివారి మహత్యం ఎంతని చెప్పడం ఎవరి తరమూ కాదని భక్తుల అనుభవం, నమ్మకం.

మహిళలకు స్వప్న దర్శనంలో సంతాన వరాలు

ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు, బ్రహ్మోత్సవాలలో 10రోజులపాటు, దీక్షావస్థలో వున్న కామాక్షితాయి, మల్లికార్జున స్వామి వారి శరణు కోరి మహిళలు సంతానలేమితో వారి ముందు తడిబట్టలు, ఉపవాసదీక్షలతో నిద్రించి స్వప్నదర్శనంలో సంతాన వరాలు పొందుతుండడం తర తరాలుగా యదార్థం, భక్తుల అపార నమ్మకం. అదే విధంగా సమస్యలు, బాధలు, కోర్కెలతో రాత్రుల్లో ఆలయంలో నిద్రించే భక్తులకూ స్వామి, అమ్మవారు స్వప్న దర్శనంలో కోరికలు తీరుస్తున్నారనేందుకు భక్తులే నిదర్శనం. దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పట్టణ పురపాలకశాఖామంత్రి పొంగూరు నారాయణ సహకారాలతోపాటు తమ వంతుగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అపారమైన భక్తి, దాతృత్వంతో పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అవినీతికి తావు లేకుండా జొన్నవాడ కామాక్షితాయి ఆలయ అభివృద్ధికి తోడ్పాటునిస్తున్నారు. ఎంపీ, కోవూరు ఎమ్మెల్యే సూచనలు, సహాయ సహకారాల మేరకు ఆలయ ఏసీ&ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ఎక్స్ సేవా కమిటీ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి పర్యవేక్షణలో నవరాత్రి వుత్సవాలకు వచ్చే భక్తులకు ప్రత్యేక వసతి ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఆలయంలో దాతల సహకారం మేరకు కోట్లాది రూపాయలతో నిత్యాదానం కొనసాగుతుంది.

advt



విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

శరన్నవరాత్రులు ముగిసే వరకు అమలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల కారణంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

- హైదరాబాద్-విజయవాడ-హైదరాబాద్-విశాఖపట్నం మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగి హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి వాహనాలు చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి నల్లకుంట వద్ద దిగి హైదరాబాద్ మార్గంలోకి వెళ్లాలి.
- హైదరాబాద్ - మచిలీపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగాలి. కేసరపల్లి మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. ఇటు నుంచి వెళ్లే వాహనాలు కేసరపల్లి వద్ద నుంచి చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కాలి.
- హైదరాబాద్-చెన్నై-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా గుంటూరు చేరుకుని అక్కడి నుంచి చెన్నై వెళ్లాలి. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.
- చెన్నై-విశాఖపట్నం-చెన్నై మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒంగోలు, త్రోవగుంట, చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ బైపాస్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.

ఇంద్రకీలాద్రికి దసరా శోభ

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- ఈఏడాది 20 లక్షలమంది భక్తులు వస్తారని అంచనా
- 29న దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి స్నపనాది క్రతువు నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల కోసం స్లాట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల వరకు కల్పిస్తారు. ఈ ఏడాది భక్తుల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా వెలుగుతోంది. 29వ తేదీ మూలానక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు.

ఉత్తరాంధ్రకు వాయు'గండం'

- పిడుగులతో భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక
- బెజవాడలో 13 సెంటీమీటర్ల వర్షం.. నేడు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్రకు వాయుగుండం పొంచి ఉంది. ఈ నెల 26న వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం 27న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు ఎక్కువగా ఉంటుందని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 25న తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. మూడు రోజుల వ్యవధిలో ఏర్పడనున్న రెండు అల్పపీడనాల ప్రభావంతో ఈనెల 24 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు, కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. విజయవాడ సింగ్‌నగర్‌లో 13, చిత్తూరు జిల్లాలోని కాగితలో 8.3, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 8, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 6.9, చిత్తూరులోని యాదమర్రిలో 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని నిపుణుడొకరు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్ర నాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణ చేసిన అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను జ్ఞాపికగా అందజేశారు.

నేటి నుంచి విశాఖలో 28వ జాతీయ ఈ గవర్నెన్స్ కాన్ఫరెన్స్

- ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుంది
- కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌ను ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి వి.శ్రీనివాస్ వెల్లడించారు. విశాఖలో ఆదివారం మాట్లాడుతూ.. వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సదస్సును నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తారన్నారు. ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుందని, ప్రస్తుతం 738 రకాలు సేవలు అందిస్తున్నారని, దీనిని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా అభివర్ణించారు. విశాఖ డిక్లరేషన్‌లో దీనిని భాగం చేసి దేశమంతా అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారన్నారు. అత్యుత్తమ కార్యక్రమాలు నిర్వహించిన వారికి ఈ గవర్నెన్స్- 2025 అవార్డులు అందిస్తామన్నారు.

కూటమి నేతలపై అనుచిత పోస్టులు

- వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు



వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో అంజాద్ ఖాన్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్,మంత్రి నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెందిన కొలేపల్లి అంజాద్‌ఖాన్ అలియాస్ మెగా అంజాద్ వైసీపీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుండేవాడు. రెండ్రోజుల క్రితం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు.

27లోపు డిమాండ్లు పరిష్కరించాలి

- లేదంటే పెన్షన్ పంపిణీని నిలిపేస్తాం
- ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ

పెనమలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27లోపు తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్చలకు పిలవని పక్షంలో అక్టోబరు 1 నుంచి పెన్షన్ పంపిణీని నిలుపుదల చేసేందుకు వెనుకాడబోమని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ హెచ్చరించింది. పోరంకిలో ఆదివారం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కలెక్టర్లకు, ఇతర అధికారులకు జేఏసీ తరఫున నోటీసులు అందజేస్తామన్నా రు. 26, 27 తేదీల్లో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న అఫిషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా వైదొలుగుతారన్నారు. 28న రాయలసీమ వేదికగా కర్నూలు జిల్లాలో ప్రాంతీయ సమావేశం ఏర్పాటుచేసి తదుపరి కార్యాచరణను విడుదల చేస్తామని తెలిపారు.

తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు

రేపు అంకురార్పణ

- ఎల్లుండి ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభం

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని అలంకరించి విశేష సమర్పణ గావిస్తారు. అనంతరం తిరుచ్చిపై ఆశీనులు చేస్తారు. రాత్రి ఏడు గంటలకు ఆలయం నుంచి బయల్దేరి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయానికి చేరుకున్న అనంతరం రంగనాయకమండపంలో ఆస్థానం జరుగుతుంది. యాగశాలలో అర్చకస్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయి.

తప్పుడు వార్తలను నమ్మకండి

- కపిలతీర్థంలో ఎలాంటి తొక్కిసలాట జరగలేదు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట జరిగిందని, కపిలతీర్థంలో ఏర్పాట్లు చేయలేదని సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు వార్తలను భక్తులు నమ్మవద్దంటూ టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. 'మహాలయ అమావాస్య సందర్భంగా తిరుపతి కపిలతీర్థం ఆలయం బయట ప్రైవేట్ వ్యక్తులు పితృతర్పణాల కార్యక్రమం చేసుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌ను టీటీడీ ఏర్పాట్లు చేసింది. రద్దీ నేపథ్యంలో భద్రతాపరంగా పటిష్ఠ చర్యలు తీసుకున్నాం. ఎస్పీ వాహనం, పోలీస్ వాహనం రావడంతో తొక్కిసలాట జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తిరుమలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా ఇక్కడ తొక్కిసలాట అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొంతమంది టీటీడీని లక్ష్యం చేసుకుని దుష్ప్రచారం చేయడం సరికాదు. టీటీడీ ప్రతిష్ఠను పలుచన చేయడాలని చూడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ఇలాంటి వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అంటూ టీటీడీ తన సోషల్ మీడియా ద్వారా పేర్కొంది.

విజ్ఞాన్ వర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు విద్య, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ మాట్లాడుతూ ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వనాథన్ ఆనంద్, హరికృష్ణ, హంపి, హరిదాసన్, ప్రగ్నానంద లాంటి ప్రతిభావంతులు దేశానికి ఎనలేని కీర్తి తెచ్చారని అశోక్ కొనియాడారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మొదటగా ఒక ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ లాలీత మునా, చీఫ్ ఆర్బిటర్ అనంత రామన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.సురేష్, చీఫ్ అడ్వయిజర్ కేవీవీ శర్మ, సెక్రటరీ కే.జగదీష్, గుంటూరు చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రవీంద్ర రాజు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి దర్శనభాగ్యం

గత రెండు దసరాల్లో భక్తులకు అందుబాటులో లేని పరిస్థితి

- దాతల సహకారంతో అందంగా రూపుదిద్దుకున్న ఆలయం

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్న భక్తులు ఈసారి మల్లేశ్వరస్వామిని దర్శించుకునే అవకాశం లభిస్తోంది. కనకదుర్గమ్మకు కుడివైపుగా కొంచెం దూరంలో స్వయంభువుగా ఉన్న మల్లేశ్వరుడు కొలువై ఉన్నారు. ఎక్కడా లేని విధంగా ఇక్కడ స్వామివారు అమ్మవారికి కుడివైపున ఉండడం విశేషం. దసరా మహోత్సవాల్లో దుర్గగుడికి లక్షలాది మంది భక్తులు దర్శనానికి వస్తారు. ఆలయ ఆవరణ చిన్నగా ఉండటం, రానురానూ భక్తుల సంఖ్య కూడా భారీగా ఉండటంతో నియంత్రణ చేయడం కష్టంగా ఉండటంతో పోలీసులు భద్రత దృష్ట్యా మల్లేశ్వరస్వామి దర్శనాన్ని నిలిపివేశారు. మరో వైపు ఏనాడో నిర్మించిన ఆలయం కావడంతో ఆలయ గోపురం నుంచి సున్నం రాలి పోతుండటంతో మరమ్మతులు చేపట్టారు. దాత సంగా నరసింహరావు, రామకృష్ణ హౌసింగ్ ఎస్టేట్ సంస్థలు ఇచ్చిన రూ.7 కోట్ల నిధుల సహకారంతో పాటు దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం మరో రూ.5 కోట్లను వ్యయం చేసి ఆలయ ప్రాంగణాన్ని విస్తరణ చేయడం, కొత్త ధ్వజస్తంభం ఏర్పాటు చేయడం, ఆలయ ముఖద్వారాన్ని విస్తరించడం, గ్రానైట్ల రాళ్ల అమరిక ఇలా పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఇటీవలే భక్తులు స్వామిని దర్శించుకోవడానికి అనుమతించారు. దసరా ఉత్సవాల్లో రద్దీని పురస్కరించుకుని పోలీసుల ఆంక్షల కారణంగా కూడా మూడు నాలుగేళ్లుగా భక్తులు స్వామివారిని దర్శించుకోలేకపోయారు. కాగా, ఈ దసరా మహోత్సవాల్లో భక్తులు స్వామివారిని దర్శించుకోవచ్చని ఈవో శీనానాయక్ తెలిపారు.

దసరా సేవలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 13 కాలేజీల నుంచి 550 మంది ఎన్ఎస్ఎస్ క్యాడిడేట్లను దసరా ఉత్సవాల్లో వలంటీర్లుగా సేవ చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని జిల్లా ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ అన్నారు. విజయవాడలోని కేవీఎస్ఆర్ ఫార్మాసూటికల్ సైన్స్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం ఆయనతో సందర్శించారు. ముఖ్య అతిథిగా ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ఓఎస్డీ డాక్టర్ వెలగజోషి హాజరయ్యారు.



ఇంద్రకీలాద్రిపై బంగారు కాంతులు

రాష్ట్ర ప్రభుత్వ వైఖరితో

ఉద్యోగ, పెన్షనర్లలో అసంతృప్తి

- ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

గాంధీనగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరితో ఉద్యోగ, పెన్షనర్లు తీ వ్ర అసంతృప్తితో ఉన్నారని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వ ర్లు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర రావు పేర్కొన్నారు. తక్షణమే ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జేఏసీ రాష్ట్ర కార్యవర్గ, ముఖ్యమైన శాఖాపరమైన సంఘాల సమన్వయ సమావేశం స్థానిక రెవెన్యూ భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల సాధనకు అన్ని సంఘాలు సంస్థాగతంగా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, పెన్షనర్లకు సుమారు రూ.30 వేల కోట్ల బకాయిలు చెల్లించాలన్నారు. రిటైరైన ఉద్యోగులకు బకాయిలు చెల్లించలేదని, అనేకమంది చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దసరా పండుగ కానుకగా కనీసం డీఏలు, పెన్షనర్ల బకాయిలు, పీఆర్సీ కమిషనర్ నియామకం జరపాలని కోరారు. ముఖ్యమంత్రి అంగీకరించినప్పటికీ ఇంకా పెండింగ్‌లో ఉంచిన ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల జీవో తక్షణం విడుదల చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాల పెంపు, ప్రభుత్వ పథకాల వర్తింపు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని తీర్మానించారు. భవిష్యత్తులో జేఏసీ తలపెట్టే ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని బొప్పరాజు వెంకటేశ్వర్లు, దామోదరరావు పిలుపునిచ్చారు. అసోసియేట్ చైర్మన్ టీవీ ఫణి పేర్రాజు, కోశాధికారి కె.సంగీతరావు, వివిధ సంఘాల రాష్ట్ర నేతలు పాల్గొన్నారు.

దసరా వైభవం

మెరిసిపోతున్న ఇంద్రగిరి

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగులతో మెరిసిపోతోంది. అమ్మ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని భావించిన అధికారులు అందుకు తగ్గట్టుగానే ఏర్పాట్లు చేశారు. కెనాల్‌రోడ్డులోని వినాయకుడి ఆలయం నుంచి క్యూలైన్ల పొడవునా విద్యుత్ వెలుగులను నింపారు. కనకదుర్గమ్మ ఫ్లై ఓవర్ కూడా కాంతులతో అందంగా ముస్తాబైంది. ఇక నగరమంతటా ఉత్సవ వైభవాన్ని చాటేలా స్వాగత తోరణాలు తీర్చిదిద్దారు.



ఏలూరు రోడ్డులో ఉత్సవ శోభ



కాళేశ్వరరావు మార్కెట్‌కు విద్యుత్ వెలుగులు

దిక్సూచి

ఏపీపీఎస్సీలో 21 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 21 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- డ్రాఫ్ట్స్‌మన్ గ్రేడ్-2(టెక్నికల్ అసిస్టెంట్): 13
- అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్: 3
- జూనియర్ లెక్చరర్(లైబ్రరీ సైన్స్): 2
- హార్టికల్చర్ ఆఫీసర్: 2
- హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్: 1
- మొత్తం ఖాళీలు 21

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిగ్రీ, బీటెక్(సివిల్), బీఈడీ పాసై ఉండాలి.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 8

పూర్తి వివరాల కోసం ఏపీపీఎస్సీ వెబ్‌సైట్ చూడవచ్చు.

ఏపీఎస్ఆర్టీసీలో 281 అప్రెంటిస్‌షిప్స్

ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణ సంస్థలో 281 అప్రెంటిస్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉన్న అప్రెంటిస్‌షిప్ ఖాళీలను దీని ద్వారా భర్తీ చేయనున్నారు. ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్ నమూనా రెజ్యూమెను డౌన్‌లోడ్ చేసుకుని సర్టిఫికెట్లను జత చేసి పంపాలి.

జిల్లాల వారీగా ఖాళీలు ఇలా ఉన్నాయి.
చిత్తూరు: 48, తిరుపతి: 88, నెల్లూరు: 91, ప్రకాశం: 54

ట్రేడులు: డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, మెషినిస్ట్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్(సివిల్)

అర్హత: సంబంధిత ట్రేడుల్లో ఐటీఐ పాసై ఉండాలి.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 4

చిరునామా: ప్రిన్స్‌పల్, జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ, కక్కుటూరు, వెంకటాచలం మండలం, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా, 524320

వెబ్‌సైట్: apsrtc.ap.gov.in/

ఈసీఐఎల్‌లో 160 టెక్నికల్ ఆఫీసర్లు

హైదరాబాద్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో (ఈసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన 160 టెక్నికల్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నారు. కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత విభాగాల్లో బీఈ/బీటెక్ పాసై ఉండాలి. కనీసం ఏడాది అనుభవం అవసరం.

వయస్సు: 30 సంవత్సరాలకు మించి ఉండరాదు.

చివరి తేదీ: 22 సెప్టెంబర్ 2025

వెబ్‌సైట్: www.ecil.co.in

ఆర్ఆర్‌బీలో 368 సెక్షన్ కంట్రోలర్ పోస్టులు

దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వే జోన్లలో కలిపి మొత్తం 368 సెక్షన్ కంట్రోలర్ ఉద్యోగాల కోసం రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. సింగిల్ స్టేజ్ కంప్యూటర్ ఆధారిత పరీక్ష ద్వారా ఉద్యోగాల ఎంపిక ఉంటుంది. మొత్తం పోస్టుల్లో సికింద్రాబాద్ డివిజన్ కింద 25 పోస్టులు ఉన్నాయి.

వయస్సు: 20 నుంచి 30 సంవత్సరాల లోపు ఉండాలి.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 14

వెబ్‌సైట్: www.rrbapply.gov.in/



ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో 7267 ఖాళీలు

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్(ఈఎంఆర్ఎస్)లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 7267 టీచింగ్, నాన్-టీచింగ్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నారు. భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కింద స్వయం ప్రతిపత్తితో నడుస్తున్న 'నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్' ఈ ఏకలవ్య మోడల్ స్కూల్స్‌ను నిర్వహిస్తోంది. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ పోస్టుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక వేళ అర్హత ఉన్నట్లయితే అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే అలాంటి అభ్యర్థులు ఆయా పోస్టులకు సంబంధించిన ఫీజులను అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

పోస్టు పేరు	ఖాళీలు
ప్రిన్సిపాల్	225
పీజీటీ	1460
హాస్టల్ వార్డెన్(పురుషులు)	346
జూనియర్ సెక్రటేరియల్ అసిస్టెంట్(క్లర్క్)	228
అకౌంటెంట్	61
స్టాఫ్ నర్స్(ఫీమేల్)	550
టీజీటీ	3962
హాస్టల్ వార్డెన్ (మహిళలు)	289
ల్యాబ్ అటెండెంట్	146
మొత్తం ఖాళీలు	7267



అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, బీఈడీ, డిగ్రీ, బీఎస్సీ నర్సింగ్, ఇంటర్, టెన్త్, డిప్లొమా పాసై ఉండాలి.

వయస్సు: ప్రిన్సిపాల్ పోస్టులకు 50 ఏళ్లు, హాస్టల్ వార్డెన్, మహిళా స్టాఫ్ నర్సు పోస్టుకు 35 ఏళ్లు, జూనియర్ సెక్రటేరియల్ అటెండెంట్‌కు 30 ఏళ్ల లోపు ఉండాలి.

ఫీజు: జనరల్/ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ప్రిన్సిపల్ పోస్టుకు రూ. 2500/-, టీజీటీ, పీజీటీ పోస్టులకు రూ.2000/-, నాన్ టీచింగ్ పోస్టులకు రూ.1500/-, ఎస్సీ/ఎస్టీ, పీహెచ్, మహిళా అభ్యర్థులకు రూ.500/-

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక జరుగుతుంది. మల్టీపుల్ ఆన్సర్ తరహాలో పెన్, పేపర్ పద్ధతిలో వంద ప్రశ్నలతో వంద మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ప్రిన్సిపాల్ పోస్టులకు రీజనింగ్, న్యూమరిక్ ఎబిలిటీ, జనరల్ అవేర్‌నెస్, అకడమిక్-రెసిడెన్షియల్ యాస్పెక్ట్, అడ్మినిస్ట్రేషన్, ఫైనాన్స్, జనరల్ ఇంగ్లిష్, హిందీ లాంగ్వేజ్ కాంపిటెన్సీ టెస్ట్ ఉంటుంది. పీజీటీ పోస్టులకు జనరల్ అవేర్‌నెస్, రీజనింగ్ ఎబిలిటీ, కంప్యూటర్ నాలెడ్జ్, టీచింగ్ ఆప్టిట్యూడ్, డొమైన్ నాలెడ్జ్ ఉంటుంది. టీజీటీ, ఇతర పోస్టులకు సిలబస్ కూడా దాదాపుగా అంతే ఉంటుంది. ఎన్ఈఎస్‌టీఎస్ వెబ్‌సైట్‌లో పూర్తి సిలబస్ అందుబాటులో ఉంది.

పరీక్ష కేంద్రాలు: ప్రిన్సిపాల్ పోస్టులకు మాత్రం పరీక్ష ఢిల్లీలోనే నిర్వహిస్తారు. మిగిలిన పోస్టులకు సంబంధించి మాత్రం వచ్చిన దరఖాస్తులను అనుసరించి సెంటర్ల అలాట్‌మెంట్ ఉంటుంది.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 23 **వెబ్‌సైట్:** nests.tribal.gov.in/

ఎస్‌బీఐ ప్లాటినమ్ జూబ్లీ

చదువులో ప్రతిభ కనపరిచే విద్యార్థుల కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) 'ప్లాటినమ్ జూబ్లీ ఆశా స్కాలర్‌షిప్ 2025'ని ప్రకటించింది. ఈ సంవత్సరం ఎస్‌బీఐ ప్లాటినమ్ జుబ్లీని జరుపుకుంటున్నందుకు గుర్తుగా దీనిని ప్రారంభించారు. 90 కోట్లతో దేశ వ్యాప్తంగా 23,200 మంది విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్‌ను అందిస్తారు. తొమ్మిదో తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు చదువుకునే పేద విద్యార్థులు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. దీని కింద కోర్సులను బట్టి 15 వేల నుంచి 20 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తారు.

- పాఠశాల విద్యార్థులు, అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, వైద్య విద్యార్థులు, ఐఐటీ, ఐఐఎం విద్యార్థులతోపాటు ఓవర్సీస్ విద్యార్థులు కూడా దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు

అర్హత: ఈ స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధించాలంటే విద్యార్థులు గత విద్యా సంవత్సరంలో 75 శాతం మార్కులు లేదా 7 సీజీపీఏ సాధించి ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం పాఠశాల కేటగిరీకి అయితే మూడు లక్షలు, ఇతర కేటగిరీలకైతే ఆరు లక్షలు. ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు పది శాతం సడలింపు ఉంటుంది. మార్కుల్లో అయితే 67.5 శాతం/ 6.30 సీజీపీఏ సాధించాలి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు. **చివరి తేదీ:** 2025 నవంబర్ 15

వెబ్‌సైట్: https://www.sbiashascholarship.co.in/

Muskaan Scholarship Program 2.0

SCHOLARSHIP ALERT

Description: An initiative by Valvoline Cummins Private Ltd. (VCPL) to offer financial assistance and mentorship support to children of commercial drivers (LMV/HMV), mechanics and children belonging to the Economically Weaker Sections (EWS) category, ensuring continuity in their education.

Eligibility: Students in Classes 9 to 12 from the southern, eastern, and northeastern states of India are eligible to apply for the scholarship. The scholarship is available to children of commercial drivers (LMV/HMV), children of mechanics, and students belonging to the Economically Weaker Sections (EWS) category. To be eligible, applicants must have scored above 60% in their previous class. Additionally, the total family income from all sources should not exceed INR 8 lakh per annum. However, children of employees of Valvoline Cummins Private Ltd. (VCPL) and its implementation partner organisations are not eligible for this scholarship.

Prizes & Rewards: Scholarship of up to INR 12,000 and mentorship support

Last Date to Apply: 30-09-2025


Application mode: Online only

Short Url: www.b4s.in/aj/MKSP2

buddy4study.com

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



నాన్నగారికి నివాళిగా శివ రీ రిలీజ్

నాగార్జున

అక్కినేని నాగార్జున హీరోగా రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన 'శివ' అప్పట్లో సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ చిత్రాన్ని 4కే డాల్బీ అట్మాస్‌లో నవంబరు 14న రీ రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు నాగార్జున. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రీ రిలీజ్ కోసం 'శివ' సినిమాను సాంకేతికంగా అప్‌గ్రేడ్ చేశాం. ఇది మీకు సరికొత్త అనుభూతిని అందించబోతోంది. సినిమాకు తరాలకు మించి జీవించే శక్తి ఉంది అని నాన్నగారు నమ్మేవారు. 'శివ' అలాంటిదే. ఈ చిత్రాన్ని మళ్లీ మీ ముందుకు తీసుకురావడం కథలను సజీవంగా ఉంచాలనే నాన్నగారికి ఘనమైన నివాళి' అని అన్నారు. రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ 'శివ' రీరిలీజ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని చెప్పారు. 1989లో విడుదలైన ఈ సినిమాను అక్కినేని వెంకట్, సురేంద్ర యార్లగడ్డ నిర్మించారు.



నాకు ఏదీ ఊరకే రాలేదు


పవన్ కల్యాణ్

'సంజయ్ సాహూకు ఏదీ ఊరక రాలేదు' అని 'జల్సా' చిత్రంలో ఒక డైలాగ్ ఉంది. అలాగే పవన్ కల్యాణ్‌కు కూడా ఏదీ ఊరకే రాలేదు. నేను సినిమాలు వదలి రాజకీయాల్లోకి వెళ్లినా మీరు (అభిమానులు) మాత్రం నన్ను వదల్లేదు. మీరు కదా నాకు భవిష్యత్ ఇచ్చింది. ఈ రోజు రాజకీయాల్లో ప్రజల కోసం కొట్లాడుతున్నానంటే మీరిచ్చిన బలంతోనే' అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఓజీ'. సుజీత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ శాస్త్రి స్టేడియంలో ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "వర్షం మనల్ని ఆపుతుందా? మనల్ని ఏది ఆపింది గనుక ఇప్పటిదాకా, ఒక ఓటమి ఆపిందా?, పరాజయాలు ఆపాయా?. ఈ రోజున నేనొక డిప్యూటీ సీఎం అని మర్చిపోయాను. ఈ స్థాయి వ్యక్తి ఎవరైనా ఇలా కత్తి పట్టుకొని వేదికపైకి రావడం ఊహించగలమా? నేను సినిమా ప్రేమికుణ్ణి. నాకు సినిమా చేసేటప్పుడు సినిమా తప్ప మరో ఆలోచన ఉండదు. నా లైఫ్‌లో ఆడియో ఫంక్షన్లకు ఇలా ఎప్పుడూ రాలేదు. దర్శకుడు సుజీత్ వల్లే 'ఓజీ' సినిమాలోని కాస్ట్యూమ్స్‌తో రావాల్సి వచ్చింది. నా అభిమానులైన మీ కోసమే ఇదంతా. 'ఖుషీ' సినిమా అప్పుడు మీలో ఉన్న జోష్‌ను మళ్లీ ఈ రోజు చూస్తున్నాను" అని అన్నారు. వాషి యో వాషి అనేది ఒక జపనీస్ హైకూ. సుజీత్ తన స్క్రిప్ట్‌లో విలన్ పాత్రను ఉద్దేశించి 'నువ్వు ఆకాశంలో విహరిస్తున్నావు, నిన్ను కిందకు తీసుకొచ్చి నేలమీద కూర్చుబెడతాను' అని రాశారు. ఇది నేను పాడాలనుకోలేదు. తమన్ కోరిక మేరకు పాడాను. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ గారితో కలసి పనిచేయడం సంతోషం కలిగించింది. ఆయనో అద్భుతమైన నటుడు. సుజిత్‌ను త్రివిక్రమ్ పరిచయం చేశారు. అతను చెప్పేది తక్కువ కానీ తీసేటప్పుడు అతని సత్తా తెలుస్తుంది. ఈ సినిమాకు నేను కాదు సుజిత్, తమన్ స్టార్స్. ప్రియాంక అరుల్ మోహన్ గారి పాత్ర హృద్యంగా ఉంటుంది. మంచి ప్రేమకథ మా మధ్యన ఉంటుంది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వాటన్నింటినీ అధిగమించి ఈ నెల 25న 'ఓజీ'తో మీ ముందుకు వస్తున్నాం' అని చెప్పారు. నిర్మాత అల్లు అరవింద్, దిల్ రాజు, వై రవిశంకర్, నటులు ఇమ్రాన్‌హష్మీ, అర్జున్‌దాస్, శ్రియారెడ్డి, ప్రియాంక అరుల్ మోహన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అభిమానుల్లో ఒకడిగా ఓజీ

తెరపైన తనదైన శైలి నటనతో విజృంభించి అభిమానులను అలరించిన పవన్ కల్యాణ్ ఓజీ వేడుకలో తన ఫ్యాన్స్‌ను ఆశ్చర్యంలో ముంచెత్తారు. పబ్లిక్ ఫంక్షన్లలో ప్రసంగానికి మాత్రమే పరిమితమయ్యే ఆయన తన సహజ శైలికి భిన్నంగా అభిమానుల్లో ఒకరైపోయారు. డిప్యూటీ సీఎం హోదాను పక్కనపెట్టి వారితో కలసిపోయారు. తన అభిమానులను ఫుల్ ఖుషీ చేశారు. 'ఓజీ' చిత్రంలోని ఓజాస్ గంభీర పాత్రను అభిమానుల ముందు అభినయించి ఆకట్టుకున్నారు. అంతేకాకుండా తను స్వయంగా అభిమానులతో గొంతు కలిపి ఓజీ సినిమాలోని డైలాగ్స్ చెబుతూ వారిని ఉత్సాహపరిచారు. సినిమాలోని గెటప్పుతో హాజరవడమే కాదు 'వాషి యో వాషి' అనే పాటను లైవ్ లో పాడి అలరించారు. పవన్ కల్యాణ్ నుంచి అలాంటి స్పందన ఊహించని అభిమానులు ఓ వైపు జోరు వర్షం కురుస్తున్నా కదలకుండా ఉండిపోయారు. వారి నినాదాలు, తమన్ సంగీత ప్రదర్శనతో స్టేడియం మార్మోగింది.

మీ ప్రతిభకు తగ్గ గుర్తింపు



చిరంజీవి

మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్‌లాల్‌ను కేంద్ర ప్రభుత్వం దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుకు ఎంపిక చేయడం పట్ల చిత్రపరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. తాజాగా మెగాస్టార్ చిరంజీవి మోహన్‌లాల్‌ను సోషల్ మీడియా ద్వారా అభినందించారు. 'డియర్ లాలెట్టన్. ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు లభించినందుకు హృదయపూర్వక అభినందనలు. మీ అద్భుతమైన ప్రయాణం, ఐకానిక్ పెర్ఫార్మెన్స్, భారతీయ సినిమాను సుసంపన్నం చేశాయి. నిజంగా ఇది మీ ప్రతిభకు తగిన గుర్తింపు' అని చిరంజీవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మోహన్‌లాల్‌తో దిగిన ఫొటోని షేర్ చేశారు.

నటి రాధికకు మాతృవియోగం



దివంగత సీనియర్ నటుడు ఎం.ఆర్.రాధా సతీమణి, సీనియర్ సినీ నటీమణులు రాధిక, నిరోషల తల్లి గీతా రాధ (86) అనారోగ్యం కారణంగా ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. తన తల్లి వృద్ధాప్యం కారణంగా కన్నుమూసినట్లు రాధిక ఒక ప్రకటనలో వెల్లడించారు. గీతా రాధ భౌతికకాయాన్ని సినీ ప్రముఖులు, అభిమానుల సందర్శనార్థం ఆళ్వార్‌పేటలోని బీన్నీ రోడ్డు, పోయెస్ గార్డెన్, మానసర్ అపార్టుమెంట్‌లో ఉంచారు. అంత్యక్రియలను సోమవారం సాయంత్రం బీసెంట్ నగర్‌లోని విద్యుత్ దహనవాటికలో జరుగుతాయని రాధిక వెల్లడించారు. కాగా, గీతా రాధకు ఇద్దరు కుమార్తెలతో పాటు రాజు, మోహన్ అనే ఇద్దరు కుమారులు న్నారు. గీతా రాధ మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు తమ సంతాపాన్ని సానుభూతిని వ్యక్తం చేశారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఆకట్టుకునే 'ఇడ్లీ కొట్టు'



'కుబేర'తో ఘన విజయం అందుకున్న ధనుశ్ తాను కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'ఇడ్లీ కొట్టు'. నిత్యా మీనన్ కథానాయిక. డాన్ పిక్చర్స్, వండర్ బార్ ఫిల్మ్స్ బేనర్లపై ఆకాశ్ భాస్కరన్ నిర్మించారు. అక్టోబరు 1న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తెలుగులో ఈ చిత్రాన్ని శ్రీ వేదాక్షర మూవీస్ బేనర్‌పై రామారావు చింతపల్లి రిలీజ్ చేస్తున్నారు. తాజాగా మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. 'ఇడ్లీ గ్రైండర్ కొంటే పని తేలిక అవుతుంది. సమయం కూడా ఆదా అవుతుంది..' అంటూ కథానాయకుడు తన తండ్రిని ఒప్పించే సన్నివేశంతో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. మురళి పాత్రలో ధనుశ్ అద్భుతంగా నటించారు. ఈ చిత్రంలో అరుణ్ విజయ్, శాలినీ పాండే, సత్యరాజ్ కీలక పాత్రలు పోషించారు.

గ్రామీణ నేపథ్యంలో



అభినవ శౌర్య, నరసింహా, అనుశ్రీ ప్రధాన పాత్రధారులుగా బెల్లం రామకృష్ణారెడ్డి దర్శకత్వం వహిస్తూ నిర్మిస్తోన్న చిత్రం 'దేవగుడి'. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి, మంత్రి మందిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆది నారాయణరెడ్డి మాట్లాడుతూ 'మా ఊరు పేరుతో ఈ చిత్రాన్ని తీసుకురావడం ఆనందంగా ఉంది' అని అన్నారు. బెల్లం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 'మా నాయకుల నిబద్ధతను ప్రేరణగా తీసుకొని ఎంతో జాగ్రత్తగా ఈ చిత్రాన్ని రూపొందించాను. ప్రేక్షకులు మా చిత్రాన్ని ఆదరించాలని కోరుతున్నా' అని అన్నారు.



నటీనటులను కించపరిస్తే కఠిన చర్యలు

● నడిగర్ సంఘం తీర్మానం

నటీనటులను కించపరిచేలా సోషల్ మీడియాలో ట్రోల్స్ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివారం జరిగిన నడిగర్ సంఘం (దక్షిణ భారత నటీనటులు సంఘం) సర్వసభ్య మండలి 69వ సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్, ప్రధాన కార్యదర్శి విశాల్, కోశాధికారి కార్తి, ఉపాధ్యక్షులు పూచ్చి మురుగన్, కరుణాస్‌తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. 'దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు'కు ఎంపికైన మలయాళ నటుడు మోహన్‌లాల్‌కు అభినందనలు తెలుపుతూ మరొక తీర్మానం చేశారు. నటీనటులను కించపరిస్తే ఇకపై క్షమించరాదనీ, పోలీసులకు ఫిర్యాదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

యువతరం మెచ్చేలా...



త్రినాథ్ కఠారి కథానాయకుడిగా నటిస్తూ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఇట్లు మీ వెధవ'. 'వెయ్యేళ్లు ధర్మంగా వర్ధిల్లు' అనేది ఉపశీర్షిక. సాహితీ అవాంచ హీరోయిన్. బళ్లారి శంకర్ ఈ యూత్‌ఫుల్ ఎంటర్టైనర్‌ను నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్‌ను దర్శకుడు బుచ్చిబాబు సానా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'టైటిల్ గ్లింప్స్ ఆసక్తికరంగా ఉంది. యువతరరం మెచ్చేలా ఉన్న ఈ చిత్రం ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నా' అని చెప్పారు.

బ్లాక్‌బస్టర్ 'బ్యూటీ'



'ఈ 'బ్యూటీ' సినిమాలోని సోల్ మా అందరినీ ప్రమోషన్స్‌లో ఎక్కువ మాట్లాడించేసింది. ఇప్పుడు ఆ సోల్ ప్రేక్షకులకు కనెక్ట్ అవుతోంది' అని సీనియర్ నటుడు వీకే నరేశ్ అన్నారు. అంకిత్ కొయ్య, నీలఖి, వీకే నరేశ్, వాసుకి ప్రధాన పాత్రధారులుగా జేఎస్ఎస్ వర్ధన్ తెరకెక్కించిన చిత్రం 'బ్యూటీ' ఇటీవలె విడుదలై థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం విజయోత్సవ సభ నిర్వహించింది. అంకిత్ కొయ్య మాట్లాడుతూ 'ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ అవుతుందని నాకు ముందే తెలుసు. అందరి మనసులకు హత్తుకునే సినిమా తీసిన వర్ధన్‌ను చూస్తుంటే గర్వంగా ఉంది' అని చెప్పారు.

స్పోర్ట్స్



సాత్విక్ జోడీకి రజతమే

చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్

షెన్‌జెన్: భారత టాప్ డబుల్స్ జంట సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టికి వరుసగా రెండో ఫైనల్లోనూ నిరాశే ఎదురైంది. గతవారం హాంకాంగ్ ఓపెన్ తుది పోరులో ఓడిన సాత్విక్ జోడీ.. ఆదివారం జరిగిన చైనా మాస్టర్స్‌లో వరల్డ్ నెం.1 జోడీ కిమ్ వోన్ హో-సియో సియుంగ్ సో చేతిలో పరాజయం పాలయ్యారు. సాత్విక్-చిరాగ్ ద్వయం 19-21, 15-21తో కొరియాకు చెందిన కిమ్-సియో చేతిలో వరుస గేముల్లో చిత్తయింది. తొలి గేమ్ ఆరంభంలో ఇద్దరూ నువ్వానేనా? అన్నట్టుగా తలపడినా 6-7 వద్ద వరుసగా 8 పాయింట్లు సాధించిన భారత షట్లర్లు 14-7తో భారీ ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. కానీ, వరుస తప్పిదాలతో ప్రత్యర్థికి పుంజుకొనే అవకాశం ఇవ్వడంతో గెలవాల్సిన గేమ్ చేజారింది. ఇక, రెండో గేమ్‌లో సాత్విక్ ద్వయం 9-7తో ముందంజలో నిలిచినా.. కొరియా జంట 10-10తో స్కోరు సమం చేసింది. ఈ దశలో తడబడిన సాత్విక్-చిరాగ్ 11-15తో వెనుకబడ్డారు. అయితే, ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వకుండా కిమ్ జోడీ మ్యాచ్‌ను సొంతం చేసుకొంది.

బీసీసీఐ అధ్యక్షుడిగా మిథున్ మన్హాస్!

- ముగిసిన నామినేషన్ల గడువు
- బరిలో ఢిల్లీ మాజీ క్రికెటర్ ఒక్కడే
- ఏజీఎంలో అధికారిక ప్రకటన



ముంబై: బీసీసీఐ తదుపరి అధ్యక్షుడెవరన్న ఉత్కంఠకు తెరపడింది. ఢిల్లీ జట్టు మాజీ కెప్టెన్ మిథున్ మన్హాస్ ప్రపంచ అత్యధిక ధనిక క్రికెట్ బోర్డు చీఫ్ కానున్నాడు. బీసీసీఐ అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలుకు ఆదివారం మధ్యాహ్నంతో గడువు ముగిసింది. అయితే మన్హాస్ ఒక్కడే నామినేషన్ వేయడంతో అతడి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. న్యూఢిల్లీలో శనివారం బీసీసీఐ పెద్దల సమావేశం జరిగింది. ఐసీసీ చీఫ్ జైషా, బీసీసీ కార్యదర్శి దేవ్‌జీత్ సైకియా, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, ఢిల్లీ క్రికెట్ సంఘం అధ్యక్షుడు రోహన్ జైట్లీ తదితరులు ఈ భేటీకి హాజరయ్యారు. ఈ సమావేశంలో మిథున్ పేరును ఖరారుచేసినట్టు సమాచారం. ఆ మేరకు అతడు నామినేషన్ దాఖలు చేశాడు.. ఇక.. వచ్చే ఆదివారం ముంబైలో జరిగే బీసీసీఐ వార్షిక సాధారణ సమావేశం సందర్భంగా బోర్డులో మిగిలిన మరికొన్ని కీలక పదవులను కూడా భర్తీ చేస్తారట. భారత మాజీ ఆటగాడు, కర్ణాటక క్రికెట్ సంఘం అధ్యక్షుడు రఘురామ్ భట్ బోర్డు చీఫ్ పదవికి చివరి నిమిషం వరకూ పోటీపడ్డాడు. కానీ బోర్డు పెద్దలు నచ్చజెప్పడంతో అతడు రేస్‌నుంచి వైదొలగినట్టు సమాచారం. దాంతో రఘురామ్ భట్ బీసీసీఐ కోశాధికారి పదవికి నామినేషన్ వేశాడు. దేవజీత్ సైకియా కార్యదర్శిగా కొనసాగనున్నాడు.

భారత కుర్రాళ్ల బోణీ

ఆసీస్ అండర్-19పై విజయం

బ్రిస్బేన్: భారత అండర్-19 జట్టు ఆస్ట్రేలియా పర్యటనను విజయంతో ఆరంభించింది. ఆదివారం ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగిన తొలి వన్డేలో భారత్ 7 వికెట్ల తేడాతో నెగ్గింది. ముందుగా ఆసీస్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 225 పరుగులు చేసింది. జేమ్స్ (77), టామ్ హోగన్ (41), స్టీవెన్ హోగన్ (39) రాణించారు. హెనిల్‌కు మూడు.. కనిష్క్, కిషన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో భారత కుర్రాళ్లు 30.3 ఓవర్లలో 227/3 స్కోరుతో గెలిచారు. అభిగ్యాన్ కుందు (87 నాటౌట్), వేదాంత్ (61 నాటౌట్), వైభవ్ సూర్యవంశీ (38) ఆకట్టుకున్నారు.

ఆనంద్‌కు రెండు స్వర్ణాలు

తొలి స్కేటర్‌గా రికార్డు

న్యూఢిల్లీ: ప్రపంచ స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో ఆనంద్‌కుమార్ వేల్‌కుమార్ (22) చరిత్ర సృష్టించాడు. ఆదివారం జరిగిన 42 కి.మీ మారథాన్‌లో విజేతగా నిలిచిన ఆనంద్ ఈ టోర్నీలో రెండు స్వర్ణాలు నెగ్గిన తొలి భారత అథ్లెట్ అయ్యాడు. అంతకుముందే 1000మీ. స్ప్రింట్‌లోనూ స్వర్ణం గెలిచిన ఈ తమిళనాడు స్కేటర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పోడియం సాధించిన మొదటి ప్లేయర్ అయ్యాడు. అంతేగాక 500మీ. స్ప్రింట్‌లోనూ కాంస్యం అందుకున్న ఆనంద్.. ఒకే వరల్డ్ స్పీడ్ స్కేటింగ్ ఈవెంట్‌లో 3 పతకాలు సాధించిన రికార్డును కూడా తన ఖాతాలో వేసుకున్నాడు.

ప్రాంజల జోడీకి డబుల్స్ టైటిల్



న్యూఢిల్లీ: ఐటీఎఫ్ మహిళల ప్రపంచ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీలో యడ్లపల్లి ప్రాంజల జోడీ విజేతగా నిలిచింది. గుర్‌గావ్‌లో ఆదివారం జరిగిన డబుల్స్ ఫైనల్లో ప్రాంజల-శ్రావ్య శివాని జోడీ 6-4, 6-0తో మహికా ఖన్నా-సోహిని మొహంతిపై వరుస సెట్లలో గెలిచింది. తొలి సెట్‌లో ప్రత్యర్థి నుంచి కొంత ప్రతిఘటన ఎదురైనా.. రెండో సెట్‌లో మాత్రం ప్రాంజల జంట పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది.

ఈసారీ దంచేశారు

భారత్ చేతిలో పాక్ చిత్తు

అభిషేక్ మెరుపు ఇన్నింగ్స్



అభిషేక్ శర్మ (39 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 74)

దుబాయ్: ఆసియాకప్ గ్రూప్ మ్యాచ్‌లోనే కాదు.. సూపర్-4 లోనూ భారత జట్టు పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. అయితే ఈ మ్యాచ్‌లో దాయాది కాస్త పోటీనివ్వగలిగింది. ఫీల్డింగ్‌లో రెండు క్యాచ్‌లు వదిలేసిన ఓపెనర్ అభిషేక్ శర్మ (39 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 74) బ్యాటింగ్‌లో మాత్రం ప్రత్యర్థి బౌలర్లను కసిదీరా బాదాడు. అతడికి ఓపెనర్ గిల్ (28 బంతుల్లో 8 ఫోర్లతో 47) సహకరించడంతో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 171 పరుగులు చేసింది. సాహిబ్‌జాదా ఫర్హాన్ (58) అర్ధ సెంచరీ సాధించాడు. దూబేకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 18.5 ఓవర్లలో 4 వికెట్లకు 174 పరుగులు చేసి గెలిచింది. తిలక్ (19 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 30 నాటౌట్) అజేయంగా నిలిచాడు. హరీస్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అభిషేక్ నిలిచాడు. **కాగా, ఆసియా కప్‌నకు నేడు (సోమవారం) విరామం.**

ఓపెనర్ల శతక భాగస్వామ్యం: ఛేదనను భారత్ అదిరే రీతిలో ఆరంభించింది. ఓపెనర్లు అభిషేక్, గిల్ పాక్ బౌలర్లపై విరుచుకుపడడంతో స్కోరుబోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. షహీన్ వేసిన ఇన్నింగ్స్ తొలి బంతినే అభిషేక్ సిక్సర్‌గా మలిచాడు. స్పిన్నర్ అబ్రార్ ఓవర్‌లోనూ 4,6తో జోరు చూపాడు. మరోవైపు సయీమ్, షహీన్ ఓవర్లలో గిల్ రెండేసి ఫోర్లతో సహకరించాడు. వీరి ధాటికి పవర్‌ప్లేలో 69 పరుగులతో జట్టు పటిష్ఠ స్థితిలో నిలిచింది. అలాగే పేసర్లు షహీన్, రౌఫ్ వీరితో మాటల యుద్ధానికి దిగడం కనిపించింది. ఏడో ఓవర్‌లో అభిషేక్ క్యాచ్‌ను ఫర్హాన్ వదిలేయగా, ఓ ఫోర్‌తో 24 బంతుల్లోనే అతను హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అయితే చక్కటి లెంగ్త్ బాల్‌తో గిల్‌ను పేసర్ అష్రాఫ్ బౌల్డ్ చేయడంతో తొలి వికెట్‌కు 105 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరో మూడు ఓవర్లలో సూర్య (0), జోరు మీదున్న అభిషేక్ కూడా అవుటవడంతో స్కోరు నెమ్మదించింది. ఈ దశలో తిలక్, శాంసన్ (13) రిస్కీ షాట్లకు వెళ్లకుండా సంయమనం కనబర్చారు. ఇక 12 బంతుల్లో 9 రన్స్ కావాల్సిన వేళ తిలక్ 19వ ఓవర్‌లో 6,4తో మ్యాచ్‌ను ముగించాడు.

దూకుడుగా ఆరంభించినా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పాక్ ఈసారి ఆత్మవిశ్వాసంతో ఇన్నింగ్స్‌ను ఆరంభించింది. పిచ్ కూడా బ్యాటింగ్‌కు అనుకూలించడంతో తొలి పది ఓవర్లలోనే 91 పరుగులు సాధించింది. అయితే భారత బౌలర్లు మధ్యఓవర్లలో కట్టడి చేయగలిగారు. ఓపెనర్ ఫర్హాన్ పేస్, స్పిన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోగా.. అతడికి ఆరంభంలో సయీమ్ అయూబ్ (21) తోడ్పాటునందించాడు. దీనికి తోడు భారత ఫీల్డింగ్ వైఫల్యం కూడా వీరికి కలిసి వచ్చింది. తొలి ఓవర్‌లోనే ఫర్హాన్ క్యాచ్‌ను అభిషేక్.. ఐదో ఓవర్‌లో సయీమ్ క్యాచ్‌ను కుల్దీప్ వదిలేయడం దెబ్బతీసింది. అటు ఓపెనర్ ఫఖర్ జమాన్ (15)ను మూడో ఓవర్‌లోనే హార్దిక్ అవుట్ చేసినా.. ఫర్హాన్ ఎదురుదాడిని ఆపలేదు. ముఖ్యంగా స్టార్ పేసర్ బుమ్రాను సునాయాసంగా ఆడేయడంతో పవర్‌ప్లేలో జట్టు 55/1తో నిలిచింది. ఇందులో బుమ్రానే 34 పరుగులివ్వడం గమనార్హం. ఎనిమిదో ఓవర్‌లో ఫర్హాన్ క్యాచ్‌ను బౌండరీ లైన్ దగ్గర అభిషేక్ మరోసారి వదిలేయగా అది సిక్స్‌గా మారింది. ఫర్హాన్ 34 బంతుల్లో హాఫ్ సెంచరీని పూర్తి చేశాడు. చివరకు 11వ ఓవర్‌లో సయీమ్ క్యాచ్‌ను అభిషేక్ అందుకోవడంతో రెండో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో దూబే, వరుణ్, కుల్దీప్ పాక్‌ను నియంత్రించడంతో 11-16 ఓవర్ల మధ్య ఒక్క బౌండరీ కూడా నమోదు కాలేదు. అలాగే హుస్సేన్ తలత్ (10)తో పాటు నిలకడగా ఆడుతున్న ఫర్హాన్ వికెట్‌ను కూడా కోల్పోయింది. కానీ చివరి మూడు ఓవర్లలో పాక్ 43 పరుగులతో 170 స్కోరును దాటించగలిగింది.

1

అంతర్జాతీయ టీ20ల్లో తక్కువ బంతుల్లో (331) 50 సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా అభిషేక్. అలాగే ఇన్నింగ్స్‌ను రెండుసార్లు సిక్సర్లతో ఆరంభించిన తొలి భారత ఓపెనర్‌గా అభిషేక్. రోహిత్, శాంసన్, జైస్వాల్ ఒక్కసారి ఈ ఫీట్ సాధించారు.

భారత్-పాక్ జట్ల మధ్య జరిగిన టీ20ల్లో ఎక్కువ వికెట్లు (15) తీసిన బౌలర్‌గా హార్దిక్

భారత్‌పై పవర్‌ప్లేలో తమ అత్యధిక పరుగులు (55) నమోదు చేసిన పాక్

స్కోరుబోర్డు

పాకిస్థాన్: ఫర్హాన్ (సి) సూర్య (బి) దూబే 58, ఫఖర్ జమాన్ (సి) సంజూ (బి) హార్దిక్ 15, సయీమ్ (సి) అభిషేక్ (బి) దూబే 21, తలత్ (సి) వరుణ్ (బి) కుల్దీప్ 10, నవాజ్ (రనౌట్) 21, సల్మాన్ ఆఘా (నాటౌట) 17, ఫహీమ్ (నాటౌట్) 20, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 171/5;** **వికెట్ల పతనం:** 1-21, 2-93, 3-110, 4-115, 5-149; **బౌలింగ్:** హార్దిక్ 3-0-29-1, బుమ్రా 4-0-45-0, వరుణ్ 4-0-25-0, కుల్దీప్ 4-0-31-1, అక్షర్ 1-0-8-0, దూబే 4-0-33-2.

భారత్: అభిషేక్ (సి) రౌఫ్ (బి) అబ్రార్ 74, గిల్ (బి) ఫహీమ్ 47, సూర్యకుమార్ (సి) అబ్రార్ (బి) రౌఫ్ 0, తిలక్ (నాటౌట్) 30, సంజూ శాంసన్ (బి) రౌఫ్ 13, హార్దిక్ (నాటౌట్) 7, **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 18.5 ఓవర్లలో 174/4; వికెట్ల పతనం:** 1-105, 2-106, 3-123, 4-148; **బౌలింగ్:** షహీన్ షా అఫ్రీది 3.5-0-40-0, సయీమ్ 3-0-35-0, అబ్రార్ 4-0-42-1, హరీస్ రౌఫ్ 4-0-26-2, ఫహీమ్ 4-0-31-1.



సోషల్‌మీడియాలో విమర్శల వెల్లువ

హాఫ్ సెంచరీ చేసిన ఆనందంలో పాకిస్థాన్ ఓపెనర్ ఫర్హాన్ ప్రవర్తించిన తీరు నెట్టింట తీవ్ర విమర్శల పాలైంది. స్పిన్నర్ అక్షర్ బౌలింగ్‌లో సిక్స్ కొట్టి అర్ధ శతకం పూరించిన ఫర్హాన్.. గన్ ఫైరింగ్ చేస్తున్నట్టుగా సంబరాలు చేసుకున్నాడు. అయితే కొద్ది నెలల కిందట పాకిస్థాన్ టెర్రరిస్టులు పహల్గామ్‌లో దాడి చేసి 26 మంది పర్యాటకులను పొట్టనపెట్టుకున్న నేపథ్యంలో.. ఫర్హాన్ అలా తుపాకీ పేలుస్తున్నట్టు చేసిన సెలెబ్రేషన్‌పై నెటిజన్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తంజేస్తున్నారు. తమ సోదరులు పహల్గామ్‌లో అలానే అమాయక ప్రజలను హతమార్చినట్టు ఫర్హాన్ చూపాడని నెటిజన్లు దుయ్యబడుతున్నారు.

గరిష్ఠ స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడి!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం స్వల్ప ఆటుపోట్లకు లోనయ్యే అవకాశం ఉంది. గరిష్ఠ స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడి పెరుగుతుండటమే ఇందుకు కారణం. అయితే జీఎస్‌టీ సంస్కరణల నేపథ్యంలో సానుకూల సెంటిమెంట్ నెలకొని సంబంధిత రంగాల షేర్లు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం మైనింగ్, ఆటోమొబైల్, నాన్ ఫెర్రస్ మెటల్స్, ఎలక్ట్రికల్స్, ఐరన్ అండ్ స్టీల్ రంగాలు బలంగా ఉన్నాయి.

స్టాక్ రికమండేషన్స్

భారతి ఎయిర్‌టెల్: జీవితకాల గరిష్ఠాన్ని చేరిన తర్వాత ఈ కౌంటర్‌లో స్వల్ప దిద్దుబాటు జరిగింది. ప్రస్తుతం మూమెంటమ్ గణనీయంగా పెరిగింది. పైగా షేరు కీలక నిరోధ స్థాయిని అధిగమించే అవకాశం కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.1,962 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,950 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,025/2,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.1,930 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

యూనియన్ బ్యాంక్: గరిష్ఠ స్థాయిని చేరుకున్న తర్వాత ఈ కౌంటర్‌లో దిద్దుబాటు జరిగింది. ప్రస్తుతం మూమెంటమ్, వాల్యూమ్, రిలేటివ్ స్ట్రెంత్ గణనీయంగా పెరిగాయి. పైగా పీఎస్‌యూ బ్యాంకింగ్ రంగం జోరందుకుంటోంది. గత శుక్రవారం రూ.140 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.130 శ్రేణిలో ప్రవేశించి రూ.155 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.131 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

గోద్రెజ్ ప్రాపర్టీస్: జీఎస్‌టీ సంస్కరణల నేపథ్యంలో రియల్టీపై ఫోకస్ పెరిగింది. ఈ నేపథ్యంలో ఈ షేరుపై మదుపరులు ఆసక్తి చూపిస్తున్నారు. స్వల్ప, మధ్యకాలిక మూమెంటమ్ పెరుగుతండటం గమనార్హం. గత శుక్రవారం రూ.2,145 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.2,080 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.2,145 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.2,050 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బీపీసీఎల్: ఈ ఏడాది జూలైలో రూ.355 వద్ద గరిష్ఠ స్థాయిని తాకిన ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్‌లో ఉంది. అన్ని రకాల కాల వ్యవధుల్లో మూమెంటమ్ మెరుగవుతోంది. గత శుక్రవారం రూ.329 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.320 ఎగువన పొజిషన్ తీసుకుని రూ.380 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.300 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అర్బన్ కంపెనీ లిమిటెడ్: గత వారమే లిస్టయిన ఈ కౌంటర్ ఆకర్షణీయంగా ఉంది. గత శుక్రవారం రూ.184 వద్ద ముగిసిన ఈ షేరును దీర్ఘకాలానికి రూ.160-180 శ్రేణిలో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

హెటెరో నుంచి క్యాన్సర్ ఔషధం

PERZEA

హైదరాబాద్: హెటెరో హెల్త్‌కేర్ లిమిటెడ్ మరో సరికొత్త ఔషధాన్ని మార్కెట్లోకి విడుదల చేసింది. 'పెర్జియా' పేరుతో విడుదల చేసిన ఈ ఔషధం రొమ్ము క్యాన్సర్ చికిత్సలో ఉపయోగపడుతుందని తెలిపింది. ఆల్కెమ్ లేబొరేటరీస్ అనుబంధ బయోటెక్నాలజీ సంస్థ ఎంజీన్ బయోసైన్సెస్ లిమిటెడ్ భాగస్వామ్యంతో ఈ ఔషధాన్ని అభివృద్ధి చేసినట్లు హెటెరో వెల్లడించింది. అంకాలజీ థెరపీల్లో నాణ్యమైన ఔషధాలను అందుబాటు ధరల్లో తీసుకురావాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ ఔషధాన్ని తీసుకువచ్చినట్లు హెటెరో తెలిపింది.

అండమాన్ సముద్రంలో చమురు నిక్షేపాలు!

అన్వేషణ కోసం రూ.3,200 కోట్ల కేటాయింపు

మరో మూడు ప్రాంతాల్లో కూడా ● ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియాలకు అనుమతి



న్యూఢిల్లీ: చమురు దిగుమతుల భారం తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం దేశంలోనే చమురు, గ్యాస్ ఉత్పత్తి పెంచేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా లిమిటెడ్ (ఓఐఎల్).. తొలి దశలో అండమాన్, నికోబార్ ద్వీపాల్లోని లోతట్టు సముద్ర జలాలు సహా మహానది, సౌరాష్ట్ర, బెంగాల్ బేసిన్స్‌లో చమురు, సహజ వాయువు నిక్షేపాల కోసం వచ్చే ఏడాది కొన్ని కొత్త బావులు తవ్వబోతున్నాయి. కాగా అండమాన్‌కు దగ్గరలో ఉన్న మయన్మార్, ఇండోనేషియా సముద్ర జలాల్లో ఇప్పటికే పెద్దమొత్తంలో చమురు, గ్యాస్ నిక్షేపాలు బయటపడ్డాయి. అండమాన్ సముద్ర జలాల్లోని భూప్రాంతం కూడా మయన్మార్, ఇండోనేషియా సముద్ర భూతలాన్ని పోలి ఉంటుంది. దీంతో మన ప్రాంతంలోనూ భారీగా చమురు, గ్యాస్ నిక్షేపాలు బయటపడే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు ఈ ప్రాంతాల్లో చమురు అన్వేషణ కోసం రూ.3,200 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చిందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

అండమాన్‌లో 37.1 కోట్ల టన్నుల నిక్షేపాలు: అండమాన్ ప్రాంతంలో భారత ఇంధన ముఖ చిత్రాన్నే మార్చివేసే భారీ చమురు, గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్టు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇటీవల ప్రకటించారు. ఈ నిక్షేపాలు 31.7 కోట్ల టన్నుల వరకు ఉంటాయని ఇప్పటికే అంచనాలు వినిపిస్తున్నాయి. ఇది గత ఏడాది మన దేశం దిగుమతి చేసుకున్న 24.24 కోట్ల టన్నుల కంటే ఇది 7.46 కోట్ల టన్నులు ఎక్కువ. చమురు, గ్యాస్ అన్వేషణకు వీలుగా 2022లో కేంద్ర ప్రభుత్వం అండమాన్ సముద్ర ప్రాంతంలోని దాదాపు 10 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని స్వేచ్ఛా మండలంగా ప్రకటించింది.

బీపీ భాగస్వామ్యం: అండమాన్ సముద్ర జలాల్లో ఎక్కడ బావులు తవ్వాలి? వాటి ఫలితాల అన్వేషణలో బ్రిటిష్ పెట్రోలియం (బీపీ).. ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియాలకు సహకరిస్తుంది. ఈ పరీక్షా ఫలితాల ఆధారంగా ఈ ప్రాంతంలో చమురు, గ్యాస్ ఉత్పత్తి హక్కులు ఏ కంపెనీకి ఇవ్వాలనే విషయాన్ని ప్రభుత్వం నిర్ణయిస్తుంది. పరీక్షా ఫలితాలు ఆశాజనకంగా ఉంటే, అందులో బీపీ కంపెనీ కూడా వాటాదారుగా చేరే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే పర్యావరణ అనుమతులు, భారీ ఖర్చులు ఇందుకు ప్రతిబంధకంగా మారే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఎయిర్‌సెల్ కేసులో మ్యాక్సిస్‌కు మళ్లీ సమన్లు

న్యూఢిల్లీ: ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ లంచాల కేసులో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం మరోసారి మలేషియా కేంద్రంగా పనిచేసే టెలికాం దిగ్గజం మ్యాక్సిస్‌కు నోటీసులు జారీ చేసింది. మ్యాక్సిస్‌తో పాటు దాని డైరెక్టర్ ఆగస్టస్ రాల్ఫ్ మార్షల్, మ్యాక్సిస్ కంపెనీ అనుబంధ సంస్థ ఆస్ట్రో ఆల్ ఏషియా నెట్‌వర్క్‌కు కూడా కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులను వీరికి అందజేసేందుకు మూడు నెలల సమయం కావాలని సీబీఐ కోరింది. యూపీఏ హయాంలో ఎయిర్‌సెల్ ఈక్విటీలో తన వాటాను 26 శాతం నుంచి 73.99 శాతానికి పెంచుకునేందుకు అప్పటి ఆర్థిక మంత్రి పీ చిదంబరం, ఆయన కుమారుడు కార్తి చిదంబరానికి మ్యాక్సిస్ పెద్దఎత్తున లంచాలు ముట్టచెప్పిందని ఆరోపణ. ఈ ఆరోపణలపై 2006లోనే సీబీఐ వీరిపై చార్జిషీట్ ఫైల్ చేసింది. దాని ఆధారంగా కోర్టు 2015లోనే నోటీసులు జారీ చేసినా వారు వాటిని స్వీకరించలేదు. దాంతో సీబీఐ అభ్యర్థనపై కోర్టు మరోసారి నోటీసులు జారీ చేసింది.

ప్రైవేట్ పెట్టుబడులు పెరగాలి

ముంబై: ప్రైవేట్ కంపెనీల చేతిలో చాలా మూలధనం ఉన్నదని, దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు అవి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి (ఈఏసీ-పీఎం) చైర్మన్ మహేంద్ర దేవ్ పిలుపు ఇచ్చారు. ఆదివారం ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పెట్టుబడులు, ఎగుమతులే దేశ ఆర్థిక వృద్ధికి చోదకమన్నారు.

బిజినెస్

కోల్ ఇండియా సారథిగా సాయిరామ్

తెలుగోడికి అత్యున్నత పదవి



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బొగ్గు ఉత్పత్తి దిగ్గజం కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బీ. సాయిరామ్ ఎంపికయ్యారు. ప్రభుత్వ రంగ సంస్థల అధిపతుల ఎంపిక బోర్డు (పీఈఎస్‌బీ) ఈ పదవికి ఆయన పేరును సిఫారసు చేసింది. మరో 10 మంది నుంచి గట్టి పోటీ ఎదుర్కొని మౌఖిక పరీక్షలో అందరి కన్నా ముందు వరుసలో సాయిరామ్ నిలిచారు. ప్రస్తుతం సీఐఎల్‌కు సారథ్యం వహిస్తున్న పీఎం ప్రసాద్ అక్టోబరు 31వ తేదీన పదవీ విరమణ చేయనున్నారు. లాంఛనాలు పూర్తయిన తర్వాత ఆయన స్థానంలో సాయిరామ్ బాధ్యతలు చేపట్టనున్నారు. విశాఖపట్నానికి చెందిన సాయిరామ్ తన 34 ఏళ్ల సుదీర్ఘ సర్వీసులో సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్‌లో టెక్నికల్ డైరెక్టర్ సహా ఎన్నో కీలక పదవులు నిర్వహించారు. ప్రస్తుతం నార్తర్న్ కోల్‌ఫీల్డ్స్ సీఎండీగా పని చేస్తున్నారు. ఆయనకు బొగ్గు రంగంలో అపారమైన అనుభవం ఉంది.

కీలక మద్దతు స్థాయి 25,000

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ ప్రారంభమై గరిష్ఠ స్థాయి 25,450 వరకు వెళ్లినా శుక్రవారం రియాక్షన్ సాధించింది. చివరికి 24,327 వద్ద ముగిసింది. మూడు వారాల ర్యాలీలో 1,000 పాయింట్ల మేరకు లాభపడిన అనంతరం అప్రమత్త ట్రెండ్ కనబరిచింది. అయితే మిడ్‌క్యాప్-100, స్మాల్‌క్యాప్-100 సూచీలు మాత్రం మంచి లాభాలతో ముగిశాయి. గత వారం నిఫ్టీ 25,000 వద్ద బ్రేకౌట్ సాధించినందు వల్ల టెక్నికల్ పుల్‌బ్యాక్ రియాక్షన్‌లో పడింది. శుక్రవారం నాడు నిఫ్టీ గత మూడు వారాల్లో గరిష్ఠ రియాక్షన్ సాధించినందు వల్ల ప్రస్తుతం మరింత రియాక్షన్ ఏర్పడవచ్చు. ట్రెండ్‌లో సానుకూలత కోసం ప్రధాన మద్దతు స్థాయి 25,000 వద్ద నిలదొక్కుకుని తీరాలి.

బుల్లిష్ స్థాయిలు: ఈ వారంలో కరెక్షన్ లేదా కన్సాలిడేషన్ ట్రెండ్ ఏర్పడవచ్చు. అప్‌ట్రెండ్‌ను మరింతగా కొనసాగించాలంటే ప్రధాన నిరోధం 25,500 కన్నా పైన నిలదొక్కుకుని తీరాలి. మరో ప్రధాన నిరోధం 26,000.

బేరిష్ స్థాయిలు: నిఫ్టీకి 25,200 వద్ద మైనర్ మద్దతు, 25,000 వద్ద ప్రధాన మద్దతు స్థాయిలున్నాయి. 25,000 వద్ద నిలదొక్కుకుంటే సానుకూల సంకేతం ఇస్తుంది. విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 650 పాయింట్ల మేరకు లాభపడి 55,800 వద్ద క్లోజయినా శుక్రవారం నాటి 270 పాయింట్ల బలమైన రియాక్షన్ కారణంగా మార్కెట్ అప్రమత్త ట్రెండ్‌లో పడింది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌ను మరింతగా కొనసాగించాలంటే నిరోధ స్థాయి 56,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. బలహీనపడినా భద్రత కోసం ప్రధాన మద్దతు స్థాయి 55,000 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి. విఫలమైతే మరింత బలహీనత తప్పదు.

పాటర్న్: ఆర్ఎస్ఐ సూచీల ప్రకారం స్వల్పకాలిక ఓవర్‌బాట్ స్థితి కనిపిస్తోంది. స్వల్పకాల బలహీనతకు ఆస్కారం ఉంది. సానుకూలత కోసం 25,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్ లైన్" వద్ద నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,410, 25,500
మద్దతు	25,200, 25,120

25,000 దిగువన బేరిష్

(సెప్టెంబరు 22-26 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 25,327-25,038 పాయింట్ల మధ్యన కదలాడి 213 పాయింట్ల లాభంతో 25,327 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,000 కన్నా దిగువన ముగిస్తే స్వల్పకాలానికి బేరిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,008, 24,902, 24,722, 24,366 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25,650 బ్రేక్‌డౌన్ స్థాయి: 25,000
నిరోధ స్థాయిలు: 25,550, 25,650, 25,750 (25,450 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,125, 24,025, 23,925 (24,225 దిగువన బేరిష్)

ట్రెండ్ లైన్

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

22వ తేదీ



హైదరాబాద్	540	విజయవాడ	560
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	578	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	130
వరంగల్	115	గుంటూరు	132
కరీంనగర్	115	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	120
కర్నూలు	115	నెల్లూరు	125
విశాఖపట్నం	134	అనంతపురం	125
గోదావరి	130		

నవ్య
కుటుంబ కదంబం
సోమవారం 22 సెప్టెంబరు 2025

దుర్గా నవరాత్రులు

ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి సందర్భంగా... నేటి నుంచి శరన్నవరాత్రులు ప్రారంభం అవుతున్నాయి. శక్తి స్వరూపిణి అయిన ఆ తల్లిని నవరాత్రుల సందర్భంగా వివిధ రూపాల్లో కొలుస్తారు. విజయవాడలో ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ వారి పూజ, ఆరాధన ఈ దసరా రోజుల్లో అత్యంత వైభవంగా సాగుతాయి. ఈ ఏడాది ఉత్సవాలు 11 రోజులపాటు జరుగుతాయి. ఈ సందర్భంగా దుర్గాదేవి అలంకార విశేషాలు, సమర్పించే నైవేద్యాల వివరాలు రోజూ 'నవ్య' పాఠకుల కోసం...



నేటి అలంకారం
శ్రీ బాలాత్రిపురసుందరీదేవి
ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి, సోమవారం

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో మొదటి రోజున శ్రీ బాలా త్రిపురసుందరీదేవి అవతారంలో విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తారు. బాలాదేవి ఎంతో మహిమాన్వితమైంది. శ్రీబాలామంత్రాన్ని సమస్త దేవీమంత్రాల్లో అత్యున్నతమైనదిగా ప్రధానమైనదిగా భావిస్తారు. శ్రీవిద్యోపాసకులకు ఉపదేశించే మొదటి మంత్రం ఇదే. మహాత్రిపురసుందరీ దేవి నిత్యం కొలువుండే పవిత్రమైన శ్రీచక్రంలోని తొలి ఆమ్నాయంలో ఉండే తొలి దేవత బాలాదేవి. అందుకే ముందుగా బాలాదేవి అనుగ్రహం పొందితేనే మహా త్రిపురసుందరీదేవి అనుగ్రహాన్ని పొందగలరని పెద్దలు చెబుతారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు పూర్ణ ఫలం అందించే అలంకారం బాలాత్రిపురసుందరీదేవి. ఈ అమ్మవారిని పూజిస్తే సర్వ సంపందలూ కలుగుతాయనీ, మనోవికారాలు తొలగిపోతాయనీ భక్తుల విశ్వాసం.

బాలాత్రిపుర సుందరీదేవి చతుర్భుజాలతో ఉంటారు. జపమాల, పుస్తకం ధరించి, అభయ, వరద హస్తాలతో కరుణిస్తారు. కలువ పువ్వులో ఆసీనురాలై, సమస్త శుభాలను ప్రసాదించే దివ్యమంగళ రూపంతో మూడేళ్ల బాలికలా ఆమె కనిపిస్తుందని పురాణాలు వర్ణించాయి. షోడశ విద్యలకు ఆమె అధిష్ఠాన దేవత. కాబట్టి ఉపాసకులు త్రిపురసుందరీదేవి అనుగ్రహం కోసం బాలార్చన చేస్తారు. ఈ రోజు రెండు నుంచి పదేళ్లలోపు బాలికలను అమ్మవారి స్వరూపంగా భావించి పూజిస్తారు. 'లలితా త్రిశతి' పారాయణ చేస్తారు.

నైవేద్యం : పాయసం, పులగం
అలంకరించే చీర రంగు : లేత గులాబీ రంగు
అర్చించే పూల రంగు : అన్ని రకాలూ!
పారాయణ : లలితా త్రిశతి

హెచ్-1బీ రుసుము ఒక్కసారే!

(మొదటి పేజీ తరువాయి)

విధించిన లక్ష డాలర్ల రుసుము వార్షిక రుసుము కాదని ఆమె స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకునే సమయంలో కట్టాల్సిన వన్‌టైమ్ ఫీజు మాత్రమేనని చెప్పారు. ప్రస్తుత వీసాదారులకు, రెన్యువల్‌కు లక్ష డాలర్ల రుసుము వర్తించదని పేర్కొన్నారు. రాబోయే హెచ్-1బీ వీసాల లాటరీకి మాత్రమే వర్తిస్తుందన్నారు. ఇప్పటికే హెచ్-1బీ వీసా కలిగి ఉండి అమెరికా బయట ఉన్న వారు భయపడాల్సిన అవసరం లేదని, వారిపై ఎలాంటి రుసుమూ విధించబోమని తెలిపారు. వారంతా ఎప్పటిలాగే అమెరికా నుంచి బయటకు వెళ్లొచ్చని, తిరిగి అమెరికా రావచ్చని.. కొత్త నిబంధన వారికి వర్తించదని వివరించారు. ఈ వన్‌టైమ్ రుసుము ఇకపై కొత్తగా హెచ్-1బీ వీసాకు దరఖాస్తు చేసుకునే వారికే మాత్రమే అమలు చేస్తామన్నారు. అంటే ఎఫ్-1 స్టూడెంట్ వీసా సహా ఎలాంటి అమెరికా వీసాలు కలిగిన వారు కూడా ఈ లక్ష డాలర్ల రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నిబంధన సెప్టెంబరు 21 కంటే ముందే దాఖలు చేసిన హెచ్-1బీ వీసా పిటిషన్‌లకు వర్తించదని అమెరికా పౌరసత్వం, వలస సేవల విభాగం(యూఎస్‌సీఐఎస్) కూడా వెల్లడించింది. ఇప్పటికే ఆమోదం లభించిన పిటిషన్లూ దీని పరిధిలోకి రావని తెలిపింది. ప్రస్తుతం హెచ్1బీ వీసా చెల్లుబాటులో ఉన్నవారు అమెరికాకు రాకపోకలు సాగించవచ్చని యూఎస్‌సీఐఎస్ డైరెక్టర్ జోసఫ్ వెల్లడించారు. ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

భారతీయులకు అత్యవసర హెల్ప్‌లైన్

అమెరికా ప్రభుత్వం హెచ్-1బీ వీసా రుసుమును భారీగా పెంచడంతో నెలకొన్న గందరగోళ, ఇబ్బందికర పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. భారతీయ ఐటీ నిపుణుల కోసం వాషింగ్టన్‌లోని భారత దౌత్య కార్యాలయం ప్రత్యేకంగా అత్యవసర హెల్ప్‌లైన్ నంబరును ఏర్పాటు చేసింది. ఇందు కోసం "అత్యవసర సహాయం కోసం భారతీయులు సెల్ నంబరు 1-202-550-9931కు ఫోన్ లేదా వాట్సాప్ చేయాలి. ఈ నంబరు కేవలం భారతీయులకు, అదీ అత్యవసర సహాయం కోసమే. సాధారణ కాన్సులర్ వివరాల కోసం కాదు" అని భారత దౌత్య కార్యాలయం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. హెచ్-1బీ వీసాల్లో అత్యధికంగా 72 శాతం వరకు భారతీయులకే కేటాయిస్తున్నారు.

ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై నేడు భారత్-అమెరికా చర్చలు

» వాషింగ్టన్‌కు వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై సోమవారం వాషింగ్టన్‌లో చర్చలు జరుగుతున్నాయి. భారత్ తరఫున వాణిజ్య మంత్రి గోయల్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం ప్రాతినిధ్యం వహించనుంది. భారత్-అమెరికాల మధ్య ఇప్పటికే ఉన్న పలు సమస్యలతోపాటు తాజాగా హెచ్-1బీ వీసాలపై ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఈ చర్చలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఇరుదేశాల మధ్య చర్చలు సజావుగా సాగుతున్నాయని గోయల్ అభిప్రాయపడ్డారు. సానుకూల ఫలితాలు రావాలని ఇరు దేశాలు ఆకాంక్షిస్తున్నాయని చెప్పారు. "సంప్రదింపులు కొనసాగుతున్నాయి. దీనిని ఓ సందర్భంగా భావిస్తున్నామే తప్ప, ఘర్షణగా పరిగణించడం లేదు" అని తెలిపారు. ఈ నెల 16న అమెరికా వాణిజ్య ప్రతినిధులు ఢిల్లీ వచ్చి చర్చలు జరిపారు. మరింత లోతుగా చర్చలు జరిపి విభేదాలు పరిష్కరించుకోవాలని ఆ సందర్భంగా నిర్ణయించడంతో తాజాగా భారత ప్రతినిధి బృందం అమెరికాలో చర్చలు జరపనుంది. గతంలో అమెరికా నుంచి వ్యవసాయ, పాల ఉత్పత్తులను దిగుమతి చేసుకోబోమంటూ భారత్ కఠిన వైఖరి ప్రదర్శించగా ప్రస్తుతం కాస్త మెత్తపడే అవకాశం ఉన్నట్టు కనిపిస్తోంది.





'శారీ'గమే... పైఠానీ సే...

జాంధానీ చీరల తయారీలో చేయితిరిగిన ఉప్పాడ నేతన్నలు కొత్త పద్ధతులను తెరపైకి తెస్తున్నారు. కాలానుగుణంగా వస్తోన్న మార్పులకు తగ్గట్టుగా మగ్గాలపై మెరుపులు మెరిపిస్తున్నారు. మహారాష్ట్రలో పేరుపొందిన పైథానీ పట్టు, ఖాదీ వస్త్రం కలగలిపిన కొత్త రకం చీరల్ని సృష్టిస్తున్నారు. ప్రసిద్ధ సంస్థల షోరూంలను సైతం అలంకరిస్తున్న ఈ చీరల విశిష్టత ఏమిటంటే...

అతివల అందాన్ని మరింత పెంచేవి చీరలు. వాటిలో ఉప్పాడ జాంధానీ చీరలకు ఉన్న ప్రత్యేకతే వేరు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ములాంటి ఎందరో ప్రముఖుల మనసుల్ని దోచుకున్న ఈ చీరలకు ఎంతో ఆదరణ ఉంది. టాటా గ్రూప్, రిలయన్స్, ఆదిత్య బిర్లా లాంటి బడా వ్యాపార సంస్థలు ఇక్కడ తయారు చేసే చేనేత వస్త్రాలపై ఆసక్తి చూపడానికి కారణం ఈ చీరలే. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ గ్రామం జాంధానీ చీరలకు ప్రసిద్ధి. ఉప్పాడలో కొన్ని వేల కుటుంబాలు ఎన్నో ఏళ్లుగా చేనేత రంగం పైనే ఆధారపడి జీవిస్తున్నాయి. గంటల తరబడి మగ్గాల మీద పని చేసే ఉప్పాడ చేనేత కళాకారులు... మగువలను మైమరపించే జాంధానీ చీరలను రూపొందించడంలో సిద్ధహస్తులు. టాటా గ్రూప్, ఆదిత్య బిర్లా, రిలయన్స్ లాంటి పెద్ద పెద్ద సంస్థలు ఉప్పాడ జాంధానీ నేతపై దృష్టిసారించాయి. ఉప్పాడలో చీరలు నేయిస్తున్నాయి. తమ షోరూమ్‌లలో వాటిని విక్రయిస్తున్నాయి. టాటా ప్రతినిధుల బృందం నేరుగా ఉప్పాడ వచ్చి, తమకు నచ్చిన డిజైన్లు ఇచ్చి, చీరలు నేయిస్తున్నారు. ఆదిత్య బిర్లా గ్రూప్ ఇక్కడి నేతన్నలకు గుర్తింపు కార్డులు ఇచ్చి, వారే తమ షోరూమ్‌కు వస్త్రాలు సరఫరా చేసేలా ఒప్పందం చేసుకుంది. రిలయన్స్‌తో పాటు, తమిళనాడులోని పోతీస్ వస్త్ర దుకాణాలకు కూడా ఉప్పాడ చీరలు సరఫరా అవుతున్నాయి.

ఎటు చూసినా ఒకేలా...

ఉప్పాడ చేనేత కళాకారులు కాలానుగుణంగా పద్ధతులవైపు వారు మళ్లుతున్నారు. ఆధునిక మహిళల అభిరుచులకు తగినట్టు మార్పులు తీసుకొస్తున్నారు. ఇప్పుడు వారు పైథానీ పట్టు, ఖాదీ వస్త్రాలతో కొత్త రకం చీరల తయారీ చేపట్టారు. ఇప్పటివరకు ఇలాంటి చీరలు ఈ ప్రాంతంలో ఎక్కడా తయారు చేయడం లేదు. మహారాష్ట్రలోని ఔరంగబాద్ నగరం ఈ చీరలకు ప్రసిద్ధి. షిరిడీ సమీపంలోని ఎవ్లా ప్రాంతం పైథానీ చీరల తయారీకి పేరుపొందింది. ఆ విధానాన్ని తాజాగా ఉప్పాడ తీసుకొచ్చారు. ఎటు చూసినా ఒకే తరహాలో కనిపించడం ఈ చీరల ప్రత్యేకత. ఈ విధానం ద్వారా ఖరీదైన పట్టు చీరలను తయారు చేస్తున్నట్టు ఉప్పాడ చేనేత కళాకారులు చెబుతున్నారు. ఒక చీరలో పల్లు వరకు పైథానీ, తర్వాత ఖాదీతో పేపర్ వర్క్ ఉంటుంది. ఒక చీర తయారీకి ఇద్దరు కార్మికులు పనిచేస్తారు. పూర్తి చేయడానికి సుమారు మూడు నెలల నుంచి ఏడాది వరకూ సమయం పడుతుంది. పట్టును బెంగళూరు నుంచి, జరీని సూరత్ నుంచి తీసుకువస్తారు. మార్కెట్లో ఈ చీర ధర రూ.50 వేల నుంచి రూ.లక్షన్నర వరకు ఉంటుంది. రాజస్థాన్, బెంగళూరు నుంచి ఎక్కువ ఆర్డర్లు వస్తున్నాయని, ఇప్పటి వరకు 30 నుంచి 40 వరకు చీరలు విక్రయించామని తయారీదారుడు శిలామంతుల నరేష్ చెప్పారు. ఇక్కడ ఈ తరహా చీరల తయారీదారులు 12 మంది మాత్రమే ఉన్నారని, దీంతో ఆర్డర్లు వస్తున్నా... తయారీకి నాలుగు నెలల సమయం పడుతోందని ఆయన వివరించారు.

• పీవీవీ వరప్రసాద్, కాకినాడ
• ఎం. సూర్యనారాయణమూర్తి, ఉప్పాడ

భారత్ చుట్టూ.. అమెరికా ఉచ్చు?

మన దేశాన్ని కావాలని టార్గెట్ చేసినట్టుగా వరుస పరిణామాలు

(సెంట్రల్ డెస్క్)

భారత్‌ను అమెరికా కావాలనే టార్గెట్ చేస్తోందా? ఆర్థికంగా, రాజకీయపరంగా, ప్రాంతీయంగా ఇబ్బందిపెట్టేందుకు ప్రయత్నిస్తోందా? ఆ దిశగానే దాయాది దేశం పాకిస్థాన్‌కు తోడుగా బంగ్లాదేశ్, నేపాల్‌లనూ మన పక్కలో బల్లెంలా మారుస్తోందా? తన మిత్రదేశం సౌదీ అరేబియాను పాక్‌కు రక్షణగా రంగంలోకి దింపిందా? మనకు మిత్రదేశంగా మారుతున్న అఫ్ఘానిస్థాన్‌ను తిరిగి నియంత్రణలోకి తీసుకోవాలని చూస్తోందా? వీటికితోడు అడ్డగోలు సుంకాలు, హెచ్1బీ వీసాల ఫీజులు భారీగా పెంపు, విద్యార్థి వీసాలపై ఉండే గడువు కుదింపు.. వంటివన్నీ భారత్ చుట్టూ పన్నుతున్న ఉచ్చులో భాగమేనా? ఇటీవల అమెరికా, దాని అధ్యక్షుడు ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే భారత్‌ను కావాలనే టార్గెట్ చేసినట్టుగా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



సుంకాలు, ఆంక్షలతో ఆర్థికంగా..

తాము వద్దన్నా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందని, తమతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి కొర్రీలు పెడుతోందని పేర్కొంటూ.. ఏ దేశంపై లేనంతగా భారత్‌పై అమెరికా 50% సుంకాలను విధించింది. కానీ, చైనా మనకన్నా ఎక్కువగా రష్యా చమురు కొంటోంది. తమ దేశంలో తయారయ్యే అరుదైన అయస్కాంతాలు, ఖనిజాలు అమెరికాకు ఎగుమతి చేయకుండా వాణిజ్య నియంత్రణలు పెట్టింది. అయినా చైనాపై అమెరికా చర్యలు లేవు.

చబహార్ పోర్టు.. పెద్ద ఎదురుదెబ్బ!

ఇరాన్‌లోని చబహార్ పోర్టును భారత్ అభివృద్ధి చేసి, నిర్వహిస్తోంది. భారత్‌కు ఇది వ్యూహాత్మకంగా కీలకం. పాకిస్థాన్ మీదుగా కాకుండా నేరుగా అఫ్ఘానిస్థాన్, ఇతర మధ్య ఆసియా దేశాలతో అనుసంధానం, ఎగుమతులు, దిగుమతులతోపాటు రక్షణపరంగా కూడా దీనికి ప్రాధాన్యత ఉంది. ఎందుకంటే భారత పశ్చిమ తీరానికి సమీపంలో పాకిస్థాన్‌లోని గ్వాదర్ పోర్టు చైనా ఆధీనంలో ఉంది. అయితే అణ్వస్త్రాల తయారీకి ప్రయత్నిస్తోందనే ఆరోపణలతో గతంలో ఇరాన్‌పై తీవ్రస్థాయిలో ఆంక్షలు విధించిన అమెరికా.. అక్కడ భారత్ నిర్వహిస్తున్న చబహార్ పోర్టుకు మాత్రం మినహాయింపు ఇచ్చింది. కానీ ఇన్నేళ్ల తర్వాత ఉన్నట్టుండి ఆ మినహాయింపులను ఎత్తివేసింది. పేరుకు ఇరాన్‌పై కఠిన చర్యలు అని అమెరికా చెబుతున్నా... దానితో భారత్‌కు వ్యూహాత్మకంగా, ఆర్థికంగా దెబ్బపడింది.

అఫ్ఘానిస్థాన్‌లో మళ్లీ పాగా వేసి..

రెండు దశాబ్దాల క్రితం తాలిబన్లను తరిమికొట్టి అఫ్ఘానిస్థాన్‌ను తమ చేతిలో పెట్టుకున్న అమెరికా.. అక్కడ సైన్యం, ఇతర వ్యయాల భారం పెరగడం, తాలిబన్ల దాడుల్లో తమ సైనికులు మరణిస్తుండటంతో అఫ్ఘానిస్థాన్‌ను వదిలేసింది. తిరిగి అధికారం చేపట్టిన తాలిబన్లు.. భారత్‌కు దగ్గరవడం, తన మిత్రదేశం పాకిస్థాన్‌కు పక్కలో బల్లెంలా మారడం అమెరికాకు ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో అఫ్ఘానిస్థాన్‌లో తిరిగి పాగా వేసేందుకు అమెరికా రంగంలోకి దిగుతోంది. అఫ్ఘానిస్థాన్‌లోని బగ్రాం సైనిక స్థావరాన్ని తిరిగి స్వాధీనం చేసుకుంటామని తాజాగా ట్రంప్ ప్రకటించడం గమనార్హం.

హెచ్1బీ వీసా ఫీజుల పెంపుతో..

అమెరికాలోని ఐటీ కంపెనీలు, ఇతర నైపుణ్య ఉద్యోగాల కోసం ఇచ్చే హెచ్1బీ వీసాల్లో 70శాతానికి పైగా భారతీయ ఉద్యోగులే ఉంటారు. ఇప్పుడీ వీసా ఫీజులను ఏకంగా లక్ష డాలర్ల (రూ.88 లక్షల)కు పెంచుతూ ట్రంప్ సర్కారు నిర్ణయించింది. ఇది భారతీయ ఉద్యోగులకు అశనిపాతమే. ఇటీవలి కాలంలో బంగ్లాదేశ్, నేపాల్‌లతో అమెరికా సంబంధాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా బంగ్లాదేశ్‌లో భారత అనుకూల ప్రభుత్వం కూలిపోయి.. భారత వ్యతిరేక, పాక్ అనుకూల ప్రభుత్వం గద్దెనెక్కాక పరిస్థితులు మారాయి. బంగ్లాదేశ్‌కు అమెరికా రక్షణ సహకారం పెరిగింది. బంగాళాఖాతంలో అమెరికా నౌకాదళం చురుకుగా మారింది. నేపాల్‌లోనూ కొంతకాలం నుంచి భారత వ్యతిరేకత పెరిగింది. ఇక్కడ జెన్-జడ్ ఆందోళనల వెనుక అమెరికా హస్తం ఉండవచ్చని సండే గార్డియన్ పత్రిక ఇటీవల కథనం ప్రచురించింది.

పాకిస్థాన్‌కు 'సౌదీ'తో రక్షణ!

తాజాగా సౌదీ అరేబియా-పాకిస్థాన్ మధ్య నాటో తరహాలో రక్షణ ఒప్పందం కుదిరింది. సౌదీ, పాక్‌లలో ఒకరిపై బయటి దేశం దాడి చేస్తే.. రెండో దేశం కూడా మద్దతుగా యుద్ధానికి దిగుతుంది. అంటే ఇటీవలి ఆపరేషన్ సిందూర్ తరహాలో భారత్‌గానీ పాక్‌పై దాడులు చేస్తే, పాక్‌కు మద్దతుగా సౌదీ రంగంలోకి దిగుతుంది. ఇది భారత్‌కు వ్యూహాత్మకంగా, రక్షణపరంగా ఇబ్బందికరమే. అమెరికా, సౌదీ మొదటి నుంచీ మిత్రదేశాలు. తాజాగా పాక్‌తో సౌదీ ఒప్పందం కుదుర్చుకోవడం వెనుక అమెరికా ఒత్తిడి ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ.. అమెరికా పాక్‌కు అనుకూలంగానే వ్యవహరించింది. దాడులు ఆపాలని భారత్‌పై ఒత్తిడి తెచ్చింది.

అమెరికా టిక్కెట్ల ధర పెరుగుదల వెనుక భారీ కుట్ర!

భారతీయులను అడ్డుకునేందుకు మాగా, 4చాన్ కలిసి పన్నాగం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: హెచ్-1బీ వీసా ఫీజు పెంపుపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన వెలువడిన కాసేపటికే భారత్ నుంచి అమెరికా వెళ్లే విమానాల్లో టిక్కెట్ ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. సాధారణ రోజుల్లో న్యూఢిల్లీ నుంచి న్యూయార్క్‌కు రూ.37వేలు వరకు ఉండే ఎకనమీ క్లాస్ టిక్కెట్ ధర శనివారం రూ.80వేలకు చేరింది. ఈ ధరలు ఇలా పెరగడం వెనుక ఆన్‌లైన్‌లో భారీ కుట్ర జరిగిందంటూ జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. హెచ్-1బీ వీసా కలిగిన భారతీయులు అమెరికాకు రాకుండా అడ్డుకునేందుకు డొనాల్డ్ ట్రంప్ మద్దతు బృందం మాగా(మేక్ అమెరికా గ్రేట్ అగైన్), 4చాన్ అనే ఆన్‌లైన్ ఫోరమ్ కలిసి ఓ భారీ ఆపరేషన్ చేపట్టాయి. హెచ్-1బీ నూతన నిబంధనలపై గందరగోళం నెలకొన్న వేళ 'క్లాగ్ ద టాయ్‌లెట్' పేరిట ఓ వ్యూహాన్ని అమలు చేసి కృత్రిమ డిమాండ్ సృష్టించిన ఆ గ్రూపులు టిక్కెట్ ధరలు భారీగా పెరిగిపోయేలా చేశాయి. "హెచ్-1బీ సంగతి భారతీయులకు ఇప్పుడే తెలిసింది. వాళ్లందరినీ భారత్‌లోనే ఉంచాలని అనుకుంటున్నారా ? ఫ్లైట్ రిజర్వేషన్ సిస్టమ్‌ను అడ్డుకోండి. టిక్కెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్‌ల్లో భారత్- అమెరికా మధ్య ప్రధానమైన రూట్లను తెలుసుకోండి. ఆ మార్గాల్లోని విమానాల్లో టిక్కెట్ కొనుగోలు ప్రక్రియను మొదలుపెట్టి సీట్లు ఎంపిక చేసుకోండి. కానీ టిక్కెట్లు కొనుగోలు చేయకండి. 15 నిమిషాల పాటు సీట్లను హోల్డ్‌లో పెట్టండి. ఇదే పనిని మళ్లీమళ్లీ చెయ్యండి" అని 4చాన్‌లో ఓ యూజర్ పిలుపునిచ్చాడు. ఈ మేరకు ఒకేసారి చాలామంది 4చాన్ యూజర్లు.. విమానాల్లో సీట్లను హోల్డ్‌లో పెట్టి కృత్రిమ డిమాండ్ సృష్టించి టిక్కెట్ల ధరలు పెరిగేలా చేశారు. వీరు సీట్లను హోల్డ్‌లో పెట్టడం వల్ల టిక్కెట్ బుకింగ్ సమయంలోనూ చాలామంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. "నేను 100 సీట్లు బ్లాక్ చేశా" అని 4చాన్‌లో ఓ యూజర్ పోస్టు పెట్టాడంటే ఈ కుట్ర ఏస్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు.

బంగారు బాతు.. ట్రంప్ ఆశపోతు

బంగారు గుడ్లు పెట్టే బాతును కోసి చంపిన ఆశపోతు రైతు కథ గుర్తుందా? అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అచ్చం ఆ ఆశపోతు రైతులాగానే ఆలోచిస్తున్నారని.. టెక్నాలజీపరంగా అమెరికా ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉండడానికి కారణమైన బంగారు బాతుల్లాంటి విదేశీ టెకీలపై లక్ష డాలర్ల ఫీజు బాదుడే ఇందుకు నిదర్శనమని పలువురు టెక్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే, లక్ష డాలర్ల హెచ్-1బీ వీసా ఫీజు కొత్తగా వచ్చేవారికే వర్తిస్తుందని, పైగా ఇది ఒక్కసారి చెల్లిస్తే సరిపోతుందని అమెరికా వివరణ ఇచ్చిన నేపథ్యంలో.. భారత ఐటీ కంపెనీలపై దాని ప్రభావం పెద్దగా పడదని కూడా వారు విశ్లేషిస్తున్నారు. ఉదాహరణకు.. దేశంలోని టాప్-5 టెక్ దిగ్గజ సంస్థల వార్షిక ఆదాయం 80 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.7 లక్షల కోట్లు). ఆ ఐదు కంపెనీలూ కలిసి 10 వేల కొత్త హెచ్-1బీ వీసాల కోసం దరఖాస్తు చేశాయనకుంటే వార్షికాదాయంపై రూ.8 వేల కోట్ల మేర నష్టం వాటిల్లుతుందని అంచనా. ఇది ఆయా సంస్థల మార్జిన్‌లో దాదాపు 7 శాతానికి సమానమని సొవిలో ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్‌కు చెందిన సందీప్ అగర్వాల్ పేర్కొన్నారు. కానీ.. వీసా ఫీజు ఏటా ఉండదని అమెరికా తేల్చిచెప్పడంతో మార్జిన్లు 1-2 శాతం మేర మాత్రమే తగ్గుతాయని అంచనా వేస్తున్నారు. మన సంగతి అలా ఉంచితే.. హెచ్-1బీ వీసా ఫీజు బాదుడు వల్ల అమెరికా కంపెనీలపైనే ఎక్కువ ప్రభావం పడుతుందని టెక్ నిపుణులు చెబుతున్నారు. ఉదాహరణకు.. అమెజాన్, మైక్రోసాఫ్ట్, మెటా తదితర దిగ్గజ సంస్థలు హెచ్-1బీ వీసాలపై భారీగా ఆధారపడుతున్నాయి. 2025లోనే అమెజాన్ సంస్థ 12 వేలకు పైగా హెచ్-1బీ వీసా అనుమతులు పొందింది. ఒక్కో వీసాకు లక్ష డాలర్ల చొప్పున.. వచ్చే మూడేళ్లలో అమెజాన్ సంస్థే ఏకంగా 3.6 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.31 వేల కోట్లు) అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇక.. మెటా, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా, ఒరాకిల్ తదితర దిగ్గజ సంస్థల సంగతి సరేసరి. ఈ విషయం తెలుసుగనకనే.. ఒకప్పుడు హెచ్-1బీ వీసాపై అమెరికాకు వచ్చి అతిపెద్ద వ్యాపారవేత్తగా ఎదిగిన మస్క్ వంటివారు ఈ విషయంలో ట్రంప్ నిర్ణయాలను వ్యతిరేకిస్తున్నారు.



మనోళ్ల దీర్ఘదృష్టి..

ఇలాంటి ప్రమాదాన్ని ముందుగా ఊహించే.. భారతీయ టెక్ సంస్థలు గత మూడేళ్లుగా హెచ్-1బీ వీసా కేటాయింపులను తగ్గించుకుంటూ వస్తున్నాయి. గణాంకాల ప్రకారం.. 2022 నుంచి 2025 దాకా విప్రో సంస్థ హెచ్-1బీ వీసా కేటాయింపులను 33% మేర తగ్గిస్తే.. టీసీఎస్ సంస్థ 45% మేర, ఇన్ఫోసిస్ ఏకంగా 71 శాతం మేర తగ్గించాయి. ప్రస్తుతం తాము 20 నుంచి 50 శాతంలోపు మాత్రమే హెచ్-1బీ వీసాలపై ఆధారపడుతున్నట్టు ఆయా కంపెనీలు చెబుతున్నాయి. అంటే.. ఒక ప్రాజెక్టుకు 100 మంది టెకీలు అవసరం అనుకుంటే.. వారిలో 20 నుంచి 50 మంది మాత్రమే హెచ్-1బీ వీసాలపై అమెరికాకు వెళ్లి పనిచేయాల్సి వస్తుంది. తాజా పరిణామాల నేపథ్యంలో కంపెనీలు హెచ్-1బీ డిపెండెన్సీని మరింత తగ్గించుకుని.. ఇక్కడి నుంచే తమ ఉద్యోగులతో పని చేయించుకునే ప్రయత్నం చేస్తాయి. లేదా మనవాళ్లు అక్కడిదాకా వెళ్లడం తప్పనిసరి అనుకుంటే.. 'నియర్‌షోర్/ఆఫ్‌షోర్' బృందాలను నియమించుకుంటాయి. అంటే.. అమెరికాకు సమీపంలోని దేశాల్లో చిన్నచిన్న టీములను నియమించడం. కెనడా, మెక్సికో, పశ్చిమయూరప్ దేశాల నుంచి ఆ టీములు పనిచేస్తుంటాయి. అదే సమయంలో.. తగినంత మంది విదేశీ నిపుణులు అందుబాటులో లేక అమెరికా కంపెనీలు అధిక వేతనాలు ఇచ్చి స్థానికులను నియమించుకోవాల్సి వస్తుంది. ఈ పరిణామాలన్నీ అమెరికా కంపెనీల లాభాలను తగ్గించేవే!

భయంతో బతకొద్దు.. భారత్‌కు వచ్చేయండి

దేశ విభజన జరిగినప్పుడు పాక్ నుంచి వలస వచ్చిన ఎంతో మంది సింధీ స్నేహితుల కథలను నేను విన్నాను. వారంతా తమ జీవితాలను పునర్నిర్మించుకుని ఇప్పుడు భారత్‌లో చక్కగా ఉన్నారు. అలాగే.. హెచ్-1బీ వీసాపై ప్రస్తుతం అమెరికాలో ఉన్నవారంతా తిరిగి భారత్‌కు వచ్చేయండి. మీ జీవితాలను పునర్నిర్మించుకోవడానికి మహా అయితే ఐదేళ్లు పడుతుంది. కానీ, ఈ పరిణామాలు మిమ్మల్ని మరింత శక్తిమంతులను చేస్తాయి. భయంలో బతకొద్దు. ధైర్యంతో ముందడుగు వేయండి. అంతా మంచే జరుగుతుంది.

- శ్రీధర్ వేంబు, జోహో వ్యవస్థాపకుడు

అందిపుచ్చుకుంటే అవకాశం..

అమెరికా జారీ చేస్తున్న హెచ్-1బీ వీసాల్లో 71 శాతం మనోళ్లకే వస్తుండడంతో.. పైకి చూడ్డానికి ఇది సంక్షోభంలా కనిపిస్తోందిగానీ, అందిపుచ్చుకుంటే ఇదో గొప్ప అవకాశం అని.. ట్రంప్ నిర్ణయాలతో మనకు కొత్త ద్వారాలు తెరుచుకుంటాయని క్వెస్ గ్రూప్ సీఈవో గురుప్రసాద్ శ్రీనివాసన్ వంటివారు అభిప్రాయపడుతున్నారు. "హెచ్-1బీ వీసాల్లో ఎక్కువ శాతం భారతీయులకే వస్తున్నాయి. అమెరికా మన ప్రతిభ మీద ఎంతగా ఆధారపడిందో చెప్పడానికి ఇదే నిదర్శనం. అయితే, అమెరికాలో ఆన్‌సైట్ ఉద్యోగాలు ట్రంప్ నిర్ణయంతో ఖరీదుగా మారుతాయి కాబట్టి.. చాలా కంపెనీలు ఆ పనిని భారత్‌కు తరలించడానికి ప్రయత్నిస్తాయి. ఆయా కంపెనీలకు అవసరమైన ఏర్పాట్లు ప్రభుత్వం చేయగలిగితే.. దశాబ్దాలుగా ఇక్కడి నుంచి అక్కడికి కొనసాగుతున్న వలసలు రివర్స్ అవుతాయి. అక్కణ్నుంచీ ప్రతిభావంతులైన మనోళ్లంతా ఇక్కడికి తిరిగివస్తారు" అని ఆయన వివరించారు. ప్రభుత్వం గనక వారికి సరైన ప్రోత్సాహకాలు అందించగలిగితే వారంతా అద్భుతాలు సృష్టిస్తారని చెబుతున్నారు. ఇప్పుడు నవకల్పనలు (ఇన్నోవేషన్) సిలికాన్ వ్యాలీకి మాత్రమే పరిమితం కాదు. మనదేశంలోనూ సిలికాన్‌వ్యాలీలో పనిచేసేవారితో పోటీపడగలిగే యువ ప్రతిభావంతులు లెక్కకు మిక్కిలిగా తయారవుతున్నారు. వారికి మరింత మెరుగైన అవకాశాలు కల్పిస్తే మనదేశంలోనూ యూనికార్న్(100 కోట్ల డాలర్లు అంతకంటే ఎక్కువ మార్కెట్ విలువ కలిగిన స్టార్టప్‌లు)ల సంఖ్య భారీగా పెరుగుతుంది. -సెంట్రల్ డెస్క్



గురజాడ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్



గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ కలిశెట్టి

రాష్ట్ర ఉత్సవంగా గురజాడ జయంతి!

- ఈ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉంది: మంత్రి కొండపల్లి
- అప్పారావు స్వగృహాన్ని అభివృద్ధి చేస్తా: ఎంపీ కలిశెట్టి

విజయనగరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): "ప్రఖ్యాత కవి, తన రచనల ద్వారా సమాజంలోని అనేక దురాచారాల మార్పునకు కృషిచేసిన గురజాడ అప్పారావు జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఈ విషయాన్ని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ దృష్టికి తీసుకువెళ్లాం. వీలైనంత త్వరగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్న నమ్మకం ఉంది" అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరంలో మహాకవి గురజాడ అప్పారావు జయంతిని ఆదివారం జిల్లా యంత్రాంగం, గురజాడ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గురజాడ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురజాడ రచనలు, సాహిత్యం 150ఏళ్లు దాటినా ఇంకా ప్రజాదరణ పొందుతున్నాయన్నారు. ఇదిలావుంటే.. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు.. గురజాడ స్వగృహాన్ని సందర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలుగుజాతి ఉన్నంత కాలం గురజాడ రచనలు సజీవంగా ఉంటాయన్నారు. గురజాడ స్వగృహం ఆధునికీకరణకు, గ్రంథాలయ నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

16 లక్షల మంది మహిళలకు వైద్య పరీక్షలు

- ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్

అమరావతి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): "స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుంచి ఇప్పటివరకూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16 లక్షల మంది మహిళలు, బాలికలు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించామని ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. ఈ నెల 17న ప్రారంభమైన ఈ కార్యక్రమానికి మంచి స్పందన వస్తోందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 8,050 వైద్య శిబిరాల ద్వారా మహిళలకు 8 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించామని చెప్పారు. రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో పాటు ఇతర స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నట్లు వెల్లడించారు. ముందస్తు పరీక్షల ద్వారా అనుమానిత లక్షణాలున్నట్లు గుర్తించిన వారికి తదుపరి చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా 34,460 మందికి ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన హెల్త్ కార్డులు జారీ చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఉప ఆరోగ్య కేంద్రాలు, బోధనాస్పత్రుల్లో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాలు వచ్చే నెల 2వ తేదీ వరకూ కొనసాగుతాయని తెలిపారు. ఈ శిబిరాల ద్వారా దాదాపు కోటి మందికిపైగా ఆరోగ్య పరీక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వీరపాండియన్ వివరించారు.

ఎల్లుండి విజయవాడకు ఉప రాష్ట్రపతి!

విజయవాడ సిటీ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఈ నెల 24న విజయవాడ రానున్నట్టు తెలిసింది. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న కనక దుర్గమ్మను ఆయన దర్శించుకుంటారు. అనంతరం, భవానీపురంలోని పున్నమి ఘాట్‌లో జరిగే 'విజయవాడ ఉత్సవ్'లో పాల్గొంటారు. ఈ నెల 20న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఢిల్లీలో ఉప రాష్ట్రపతిని కలిసి శరన్నవరాత్రులు సహా విజయవాడ ఉత్సవ్‌కు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆయనకు అందించారు. ఈ నేపథ్యంలో రాధాకృష్ణన్ బుధవారం విజయవాడ పర్యటనకు వస్తారని ఎంపీ కార్యాలయం తెలిపింది.

ఎన్నారై, రైతు కోటా సీట్ల దరఖాస్తు గడువు పెంపు

అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీఎస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ కోర్సుల్లో ఎన్నారై కోటా సీట్లతోపాటు బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో రైతుకోటా సీట్లకు దరఖాస్తు గడువును ఈనెల 30 వరకు పెంచినట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఎంపీ రమణ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఆ కోర్సుల్లో ఆయా కోటాల కింద దరఖాస్తు చేయదలచిన అభ్యర్థులు పూర్తి వివరాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని ఆయన ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు.

నెల్లూరు సెంట్రల్ జైలులో ఇద్దరి సస్పెన్షన్

- ఖైదీ నుంచి ఫోన్‌పేకు నగదు వేయించుకున్నందుకు వేటు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): నెల్లూరు కేంద్ర కారాగారంలో అధికారులు, సిబ్బంది పనితీరుపై రోజురోజుకూ విమర్శలు తీవ్రమవుతున్నాయి. ఇటీవల ఓ ఉన్నతాధికారి ఫోన్ సంభాషణలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం తెలిసిందే. అలాగే, సెంట్రల్ జైలును రౌడీషీటర్లు తమ అడ్డాగా మార్చుకున్నట్లుగా రౌడీషీటర్ శ్రీకాంత్ విషయంలో స్పష్టమైంది. ఈ క్రమంలోనే తాజాగా.. శిక్ష పడిన ఓ ఖైదీని బ్లాక్ మార్చేందుకు ఇద్దరు అధికారులు ఫోన్‌పే ద్వారా తమ ఖాతలకు నగదు వేయించుకున్నారని ఆ ఖైదీ జైలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. విచారణ లో ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ జరిగిన విషయం నిజమేనని తేలడంతో చీఫ్ హెడ్‌వార్డర్ ఐ.హనుమంతరెడ్డి, డిప్యూటీ జైలర్ ఎం.విజయకుమార్‌ను జైళ్లశాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'కు స్కోచ్ అవార్డు



మీడియాకు స్కోచ్ అవార్డును చూపిస్తున్న కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఎండీ అనిల్‌కుమార్‌రెడ్డి

విజయవాడ (భారతీనగర్), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దేశంలో మరే ఇతర రాష్ట్రంలో లేనివిధంగా మన రాష్ట్రంలో జరుగుతున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని, దానికి ప్రతిఫలంగా అత్యంత ప్రతిష్ఠాత్మక స్కోచ్ అవార్డు లభించిందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. విజయవాడలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఏ ఇతర రాష్ట్రంలో జరగని విధంగా ఒక రోజంతా ముఖ్యమంత్రి ప్రజల్లో ఉండే కార్యక్రమం మన రాష్ట్రంలోనే జరిగిందని, అందుకే ఈ కార్యక్రమానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. అలాగే, దేశంలోనే మొదటిసారిగా ఫస్ట్ సర్క్యులర్ ఎకానమీ పాలసీని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని, ఫస్ట్ రీసైక్లింగ్ పార్కు కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించే విధానాన్ని తీసుకొస్తామని చెప్పారు. రాష్ట్రస్థాయిలో అక్టోబరు 2న 16 కేటగిరీల్లో రాష్ట్రస్థాయిలో స్వచ్ఛాంధ్ర అవార్డులు ఇస్తామని తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా 6 వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టులు రాబోతున్నాయని, వాటిలో రాజమండ్రి, నెల్లూరు, కడప, కర్నూలులోని 4 ప్రాజెక్టులకు వర్క్ ఆర్డర్లు జారీ చేశామని తెలిపారు. అక్టోబరు 2 నాటికి అన్ని మున్సిపల్ కార్పొరేషన్లను సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహితంగా మారుస్తామని చెప్పారు.

స్వర్ణ నారావారిపల్లెకు అవార్డుపై సీఎం అభినందనలు

అమరావతి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ నారావారిపల్లె ప్రాజెక్టు తొలి సంవత్సరంలోనే స్కోచ్ గోల్డెన్ అవార్డుతో గుర్తింపు పొందడం ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ అద్భుతమైన విజయానికి కారణమైన బృందాన్ని, ప్రతి వ్యక్తిని, కుటుంబాన్ని అభినందిస్తున్నానని అన్నారు. కేవలం 45 రోజుల్లోనే 1600 ఇళ్లలో సౌర ఫలకలను ఉచితంగా ఏర్పాటు చేసి, కర్బన ఉద్గారాలను తగ్గించడానికి దోహదపడిన ప్రతి ఒక్కరికీ ఈ అవార్డును అంకితమిస్తున్నట్లు ప్రకటించారు.

భిక్షాటనతో భక్తి 'మార్గం'!

- వచ్చిన సొమ్ముతో ఆలయాలకు సేవ చేస్తున్న సాధువు
- ఏ గుడి వద్ద బిచ్చమెత్తితే అక్కడ వసతుల కల్పనకు కృషి
- ప్రకాశం జిల్లా త్రిపురాంతకం ఆలయంలో క్యూలైన్ ఏర్పాటు



క్యూలైన్ ఏర్పాటు దాత పేరుతో ఉన్న బోర్డు వద్ద ఉన్న సాధువు శివరాములు (రెడ్డియార్)

త్రిపురాంతకం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భిక్షాటన అనేది చాలా మందికి జీవనోపాధి. మరికొందరికి అవసరాలు తీర్చే మార్గం. కానీ శివరాములు అనే సాధువు మాత్రం దాన్ని ఒక ఆధ్యాత్మిక సాధనంగా, సేవా మార్గంగా ఎంచుకున్నారు. తాను ఎక్కడైతే భిక్షాటన చేస్తారో.. వచ్చిన సొమ్మును ఆ ఆలయానికి అవసరమైన వసతుల కల్పన కోసం ఖర్చు చేస్తారు. 'మనం భూమిపైకి వచ్చేటప్పుడు ఏమీ తీసుకురాలేదు. వెళ్లేటప్పుడు కూడా అలానే వెళ్లాలన్నదే నా కోరిక' అని చెబుతుంటారు. ఆయనే ప్రకాశం జిల్లా త్రిపురాంతకంలోని శ్రీ బాలాత్రిపురసుందరీదేవి ఆలయం వద్ద భిక్షాటన చేస్తున్న శివరాములు (రెడ్డియార్). తమిళనాడు నుంచి రెండేళ్ల క్రితం త్రిపురాంతకం వచ్చిన ఆయన స్థానిక బాలాత్రిపురసుందరీదేవి ఆలయం వద్ద భిక్షాటన చేస్తున్నారు. ఈ రెండేళ్లలో వచ్చిన సొమ్ములో తన అవసరాలు పోనూ రూ.1.20 లక్షలు పోగేసి ఆలయం వద్ద ఇనుప రాడ్‌లతో ఒక క్యూలైన్‌ను ఏర్పాటు చేయించారు. 'ఆలయం వద్ద భిక్షాటనతో వచ్చిన డబ్బుతో క్యూలైన్ నిర్మాణం చేయించిన దాత రెడ్డియార్' అని ఆలయ నిర్వాహకులు ఒక బోర్డును ఏర్పాటు చేశారు.



త్రిపురాంతకం ఆలయంలో శివరాములు భిక్షాటన డబ్బుతో ఏర్పాటు చేసిన క్యూలైన్

రెడ్డియార్‌ను 'ఆంధ్రజ్యోతి' పలుకరించగా.. 'నాకు ఎలాంటి ప్రచారం అక్కర్లేదు. నేను ఏ గుడి వద్ద భిక్షమెత్తినా వచ్చిన సొమ్మును ఆ గుడి అవసరాలకే వినియోగిస్తా' అని చెప్పారు. గతంలో తమిళనాడులోని పలు ఆలయాల వద్ద భిక్షాటన చేశానని, ప్రస్తుతం శ్రీ బాలాత్రిపురసుందరీదేవి ఆలయ సమీపంలో ఉన్న నాగులపుట్ట వద్ద ఆర్చి నిర్మాణం చేయాలనే తలంపుతో ఉన్నానని, అందుకోసం భిక్షాటన కొనసాగిస్తున్నానని పేర్కొన్నారు. ఇందుకు రూ.10 లక్షల వరకూ ఖర్చవుతుందని, ఆ మొత్తం పోగు కాగానే ఆర్చిని నిర్మించి.. మరో ఆలయానికి వెళ్తానని చెప్పారు.

రాష్ట్రంలో అమల్లోకి

కొత్త శ్లాబులు

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 11 జీవోలను రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ ఇంగ్లిష్‌తో పాటు తొలిసారి తెలుగులోనూ విడుదల చేసింది. ఈ జీవోల బుక్‌లెట్‌ను సీఎం చంద్రబాబు ఆదివారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు చేకూరే ప్రయోజనాలు, కొత్త పన్నుల విధానంపై అధికారులతో ఆయన సమీక్షించారు. పాలనాపరమైన వ్యవహారాలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతోనే వాణిజ్య పన్నుల శాఖ మొదటిసారిగా జీవోలను తెలుగులో విడుదల చేసిందని, ఈ నిర్ణయాన్ని వ్యాపారులు, అకౌంటెంట్లు, అధికారులు, ఉద్యోగులు, నిపుణులు అభినందిస్తున్నారని ఆ శాఖ ప్రధాన కమిషనర్ అహ్మద్‌బాబు తెలిపారు. జీఎస్టీ సంస్కరణల గురించి ఆయన వివరించారు.

ప్రజలే ముందు

'జీఎస్టీ 2.0 అనేది కేవలం పన్ను సంస్కరణ మాత్రమే కాదు.. ప్రజలే ముందు అనే విధానమిది. ఇది ఖర్చులను తగ్గిస్తుంది. అనుసరించే విధానాన్ని సులభతరం చేస్తుంది. ప్రతి ఇంటిని, రైతులను, విద్యార్థులను శక్తిమంతులుగా చేయడంతోపాటు వ్యవస్థను బలోపేతం చేస్తుంది. ట్రాక్టర్ల నుంచి పాఠ్య పుస్తకాలు, మందుల వరకు ఆదా చేసిన ప్రతి రూపాయి సుస్థిరాభివృద్ధికి దోహదపడుతుంది. కాబట్టి ఇది కేవలం పన్ను సంస్కరణ కాదు.. ఇదొక మార్పు.

ప్రజలకు రూ.8వేల కోట్ల లబ్ధి

జీఎస్టీ 2.0 ద్వారా రాష్ట్ర ప్రజలకు దాదాపు రూ.8 వేల కోట్ల మేర ప్రయోజనం చేకూరుతుంది. వెన్న, నెయ్యి, పనీర్, సబ్బులు, షాంపూ, హెయిర్ ఆయిల్, ప్రాసెస్డ్ ఫుడ్, బిస్కెట్లు, కాఫీ తదితర వస్తువులపై పన్ను తగ్గింది. అలాగే పాశ్చరైజ్డ్ పాలు, ప్యాకేజ్డ్ పనీర్, బ్రెడ్ వంటి వాటికి జీఎస్టీ నుంచి పూర్తిగా మినహాయింపు లభించింది. ద్విచక్ర వాహనాలు, చిన్నకార్లు, టీవీలు, ఏసీలు, సిమెంట్ తదితరాలపై జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడంతో మధ్యతరగతి వర్గాలకు భారీ ఊరట లభించనుంది. స్వీట్లు, చాక్లెట్లు, ఐస్‌క్రీమ్‌లపై పన్ను 5 శాతానికి తగ్గింది. వ్యవసాయ రంగానికి ఉపయోగపడే ఎరువులు, పురుగుమందులు, ట్రాక్టర్లపై జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. చేనేత, చేతి వృత్తులవారిని ప్రోత్సహించడానికి ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, చేనేత వస్త్రాలపై జీఎస్టీని 5 శాతానికి తగ్గించారు.

పర్యాటకం, సేవారంగాలకు ఊతం


సేవారంగం, హోటల్ వసతులపై జీఎస్టీ తగ్గింపు వల్ల హోటల్ చార్జీలు తగ్గుతాయి. తద్వారా పర్యాటక రంగానికి ప్రోత్సాహంగా ఉంటుంది. ధరలు తగ్గడం వల్ల ప్రజల కొనుగోలు శక్తి పెరిగి ఎంఎస్ఎంఈ రంగానికి, ఉపాధి కల్పనకు బలం చేకూరుతుంది. ప్రజల ఆరోగ్యంపై దృష్టిపెట్టి, కొన్ని ప్రాణ రక్షక మందులు, ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీని పూర్తిగా తొలగించారు. దీనివల్ల ఒక్కో వినియోగదారుడికి రూ.లక్ష వరకూ ఆదా అవుతుందని అంచనా.

సంస్కరణలతో రాష్ట్రానికి ప్రయోజనం

'ఆరోగ్యకరమైన, సుసంపన్నమైన, సంతోషకరమైన సమాజాన్ని సాధించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్య సాధనకు జీఎస్టీ 2.0 సంస్కరణలు దోహదం చేస్తాయి. ప్రభుత్వం నిర్దేశించిన 10 మార్గదర్శక సూత్రాలైన పేదరికం లేని సమాజం, జనాభా నిర్వహణ, మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యం, ఉపాధి, నీటి భద్రత, రైతు సంక్షేమం, ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్ అభివృద్ధి, ఇంధన వినియోగంలో ఖర్చు తగ్గింపు, చేతివృత్తుల అభివృద్ధి, స్వచ్ఛాంధ్ర, డీప్ టెక్ సాంకేతికత వినియోగం వంటి సూత్రాల సాధనకు ఈ సంస్కరణలు తోడ్పడతాయి' అని వాణిజ్య పన్నులశాఖ ప్రధాన కమిషనర్ అహ్మద్‌బాబు వివరించారు.

జీఎస్టీ సంస్కరణలతో సామాన్యులకు ప్రయోజనం

- ప్రధాని మోదీకి అభినందనలు: సీఎం చంద్రబాబు



అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణల ప్రారంభం, జీఎస్టీ బచత్ ఉత్సవ్ ప్రారంభం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. సామాన్య పౌరుడికి పాలనలో పెద్దపీట వేసే అసలైన వేడుక ఇదని సీఎం కొనియాడారు. పన్ను స్లాబుల సంఖ్యను కేవలం రెండుకు తగ్గించడం ద్వారా పౌరులకు ముఖ్యంగా పేద, మధ్యతరగతి, రైతులు, మహిళలు, యువతకు రోజువారీ జీవితాన్ని మరింత సరళతరం చేస్తుందని సీఎం అభిప్రాయపడ్డారు. వ్యాపారాలు వృద్ధి చెందడానికి సహాయపడుతుందని, మరిన్ని పెట్టుబడులను ఆకర్షిస్తుందని పేర్కొన్నారు. కాగా, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ కూడా ప్రధానికి అభినందనలు తెలిపారు. 'ప్రధాని మోదీ దార్శనిక నాయకత్వంలో జీఎస్టీ 2.0 తక్కువ రేట్లకు నిత్యావసరాలను ప్రజలకు అందుబాటులో ఉంచుతుంది. ఇప్పుడు ప్రతి ఇంటికీ నిజమైన జీఎస్టీ బచత్ ఉత్సవ్ వచ్చింది, ఈ సంస్కరణలు పెట్టుబడిని వేగవంతం చేస్తాయి. స్థానిక తయారీదారులకు శక్తినిస్తాయి. భారతదేశ వృద్ధి ప్రయాణానికి ఇంధనంగా ఉంటాయి' అని లోకేశ్ అభిప్రాయపడ్డారు.

మోహన్‌లాల్‌కు సీఎం అభినందనలు

దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారానికి ఎంపికైన సీనియర్ నటుడు మోహన్‌లాల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. మోహన్‌లాల్ ప్రతిభకు దక్కిన పురస్కారంగా దీన్ని చంద్రబాబు అభివర్ణించారు.

వాహనాల ఫిట్‌నెస్ గాలికి!

ఏటీఎస్‌లు వచ్చినా ఇదే తీరు.. సర్టిఫికెట్ ఫీజు విడుదలకు జనవరిలోనే సీఎం ఆదేశం

- మొన్నటివరకు అమలుకానివ్వని ఓ అధికారి
- ఇప్పుడు సీమకు చెందిన ఓ మంత్రి మోకాలడ్డు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రోడ్డు ప్రమాదాల తగ్గింపే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన ఆటోమేటెడ్ టెస్టింగ్ కేంద్రాలు(ఏటీఎస్) రివర్స్ గేర్‌లో నడుస్తున్నాయి. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ)ల కోసం వసూలు చేసే ఫీజులను రాష్ట్రప్రభుత్వం ఏటీఎస్ నిర్వాహకులకు విడుదల చేయడం లేదు. ముఖ్యమంత్రి చెప్పినా అతీగతీ లేదు. దీంతో వాహనదారుల నుంచే వారు వసూళ్లు చేసుకుంటూ డొక్కు బళ్లకు సైతం ఎఫ్‌సీలు జారీచేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. దేశంలో రోడ్డు ప్రమాదాలపై కేంద్రం చేపట్టిన ఓ సర్వేలో.. వాహనాలకు ఫిట్‌నెస్ సరిగా లేకపోవడమే ప్రమాదాలకు ఒక ప్రధాన కారణంగా తేలింది. రాష్ట్రాల్లోని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ)లు వాటి ఫిట్‌నెస్ సరిగా చూడకుండా మామూళ్లు తీసుకుని ఎఫ్‌సీ ఇస్తున్నట్లు వెల్లడైంది. దీంతో ఫిట్‌నెస్ నిర్ధారణకు అత్యంత అధునాతన పరికరాలతో కూడిన ఆటోమేటెడ్ టెస్టింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. అందులో భాగంగా మన రాష్ట్రంలో విశాఖపట్నంలో రూ.16.50 కోట్లతో ఒక కేంద్రం నిర్మాణం చేపట్టి.. ఇతర జిల్లాల్లో ప్రైవేటు వ్యక్తులకు అవకాశం ఇచ్చింది. వైసీపీ ప్రభుత్వంలో మొదలైన టెండర్ల ప్రక్రియ.. కూటమి ప్రభుత్వంలో పూర్తయింది. అరకు జిల్లా మినహా ఇతర 25 జిల్లాల్లోనూ టెండర్లు దాఖలయ్యాయి. ఐదారు జిల్లాలు తప్ప మిగతా జిల్లాల్లో ఆయా కేంద్రాలు అమల్లోకి వచ్చాయి. వాటి వద్దకు రాష్ట్రంలోని ప్రజా, సరకు రవాణా వాహనాలు తనిఖీల కోసం వెళ్లి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందుతున్నాయి. అయితే ప్రైవేటు వ్యక్తులు ఏటీఎస్‌లు ఏర్పాటు చేయడానికి ఒక్కోదానికి సుమారు రూ.4 కోట్ల వరకూ ఖర్చయింది. ఆ మొత్తాన్ని రికవరీ చేసుకోవడానికి మొదటి రెండేళ్లు ఫిట్‌నెస్ ఫీజు రూ.1,000తోపాటు సర్టిఫికెట్ ఫీజు రూ.200 కూడా వాళ్లే తీసుకునేలా ఒప్పందం ఉంది. ఆ తర్వాత జిల్లాలవారీగా రాష్ట్రప్రభుత్వంతో కలిసి ఆదాయాన్ని పంచుకోవలసి ఉంటుంది. అయితే ఎఫ్‌సీ కోసం వాహనదారులు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నప్పుడు చెల్లించే మొత్తం నేరుగా ప్రభుత్వ ఖాతాలోకి వెళ్తోంది. ఆ వెంటనే ప్రభుత్వం సీఎఫ్ఎంఎస్ నుంచి ఏటీఎస్ నిర్వాహకుల ఖాతాల్లోకి దానిని బదిలీ చేయాలి. అయితే ఇటీవలే బదిలీ అయిన రవాణా శాఖ ఉన్నతాధికారి ఒకరు.. తనతో నేరుగా మాట్లాడితేనే డబ్బు జమ చేస్తానని మెలిక పెట్టారు. దీనిని ఏటీఎస్‌ల నిర్వాహకులు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో.. ఒప్పందం ప్రకారం డబ్బులు విడుదల చేయాలని ఈ ఏడాది జనవరి చివరి వారంలోనే ఆయన ఆదేశాలిచ్చారు. అయినా ఆ అధికారి అమలు చేయకుండా ఆపేశారు. ఇటీవల ఆయన బదిలీ అయ్యారు. ఇప్పుడైనా తమ డబ్బులు వస్తాయని ఆశించిన ఏటీఎస్‌ల నిర్వాహకులకు ఓ మంత్రి పెద్ద షాకే ఇచ్చారు. మొదటిసారి మంత్రి అయిన ఆ రాయలసీమ నాయకుడు.. 'నాతో మాట్లాడితేనే కదా.. పనయ్యేది' అని అనడంతో వారంతా వెళ్లి కలిశారు. తీరా ఆయన అడిగిన మొత్తం వినగానే వారికి గుండె పట్టేసినట్లయింది. నోరెత్తకుండా బయటకు వచ్చేశారు. ప్రభుత్వం నుంచి తమ డబ్బులు రాకపోవడంతో ఫిట్‌నెస్ కోసం వచ్చే వాహనదారుల నుంచే అదనంగా వసూళ్లు చేయడం మొదలుపెట్టారు. ఎందుకివ్వాలని ఎవరైనా అడిగితే.. ఏడాదైనా మా డబ్బులు మాకు ఇవ్వకపోతే ప్రతి నెలా సిబ్బందికి జీతాలు, ఇతర నిర్వహణ ఖర్చులు ఎలా భరించాలని వారు ఎదురు ప్రశ్నిస్తున్నారు. 'మాకు ఎక్కువ అవసరం లేదు.. గతంలో ఎంవీఐకి ఇచ్చినట్లే ఇవ్వండి.. మీ బండికి ఎఫ్‌సీ ఇచ్చేస్తాం..' అని అంటున్నారు. ఇలాంటి అక్రమాలు అరికట్టేందుకే కేంద్రం ఆటోమేటిక్ టెస్టింగ్ కేంద్రాలు తీసుకొచ్చింది. కానీ రాష్ట్రప్రభుత్వం తమ డబ్బులు ఇవ్వడం లేదన్న సాకుతో ఏటీఎస్‌లు వాహనదారుల నుంచి మామూళ్లు తీసుకుని ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చి పాస్ చేసేస్తే.. ఆ వాహనాలు రోడ్లపైకి వచ్చి ప్రమాదాలు జరిగితే.. మొత్తం లక్ష్యం నీరుగారిపోయినట్లు కాదా..? దీనినే వారి వద్ద ప్రస్తావిస్తే.. ముఖ్యమంత్రి ఆదేశించినా.. మొన్నటిదాకా ఉన్నతాధికారి.. ఇప్పుడు మంత్రి నిధుల విడుదలకు సహకరించనప్పుడు ఏం చేయాలని వారు వాపోతున్నారు.

అన్ని విధాలా నష్టమే..

రాష్ట్రాల్లో ఏటీఎస్‌లు ఏర్పాటు చేసిన వారికి మొత్తం ఖర్చులో 50 శాతాన్ని కేంద్రం రాయితీగా ఇస్తోంది. ఒక్కో కేంద్రం ఏర్పాటుకు సుమారు 4 కోట్లవుతుంటే రెండు కోట్ల వరకూ చెల్లిస్తోంది. ఇప్పటికే మన రాష్ట్రానికి రూ.12 కోట్లు ఇచ్చిన కేంద్రం.. మిగతా రూ.105 కోట్లు ఇచ్చేందుకు ఇటీవలే సమ్మతించింది. మరోవైపు.. రాష్ట్ర ఖజానాకు చేరిన ఫీజుల డబ్బు ఏటీఎస్ నిర్వాహకులకే అందాలి. ఈ మొత్తం ఏడాదికి కనీసం రూ.40 కోట్ల వరకూ ఉంటుంది. రాష్ట్రంలో ఫిట్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు కేంద్రానికి రూ.117 కోట్లు ఖర్చయినా.. రాష్ట్రప్రభుత్వ స్థాయిలో ఒకరిద్దరి తీరు వల్ల అవినీతి పెరిగి.. మళ్లీ పాత, డొక్కు బండ్లే రోడ్లపైకి వస్తున్నాయి.

కేఏ పాల్‌పై లైంగిక వేధింపుల కేసు

- ఆయన కార్యాలయంలో పని చేసే యువతి ఫిర్యాదు
- పాల్ తనని వేధిస్తున్నారంటూ షీటీమ్స్‌ను ఆశ్రయించిన బాధితురాలు



పంజాగుట్ట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. పాల్ తనను లైంగిక వేధింపులకు గురి చేశారంటూ ఆయన కార్యాలయంలో పని చేసే ఓ యువతి పాల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి. ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కార్యాలయంలో ఓ యువతి ఆగస్టు 28న అమెరికన్ కో-ఆర్డినేటర్‌గా ఉద్యోగంలో చేరింది. తాను నైట్ షిఫ్ట్‌లో ఉండగా కేఏ పాల్ తనను తాకుతూ అసభ్యంగా ప్రవర్తించారని, వాట్సాప్‌లో అసభ్యకరమైన మెసేజ్‌లు పంపి వేధించారంటూ ఆమె షీటీమ్స్‌ను ఆశ్రయించింది. కేఏ పాల్ వద్ద ఉద్యోగం మానేసిన ఆమె తన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను కూడా షీటీమ్స్‌కు సమర్పించింది. షీటీమ్స్ అధికారుల సూచనల మేరకు ఆ యువతి శనివారం రాత్రి పంజాగుట్ట పోలీసుస్టేషన్‌లో కేఏ పాల్‌పై ఫిర్యాదు చేసింది. తన వద్ద ఉన్న ఆధారాలను పోలీసులకు అందజేసింది. ఆ ఫిర్యాదు మేరకు కేఏ పాల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు కేఏ పాల్ కార్యాలయానికి వెళ్లగా తాళం వేసి ఉంది. కేఏ పాల్ ఆచూకీ కోసం అక్కడున్న ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిని పోలీసులు ప్రశ్నించగా.. ఆయన అప్పుడప్పుడు కార్యాలయానికి వచ్చి వెళుతుంటారని చెప్పినట్టు సమాచారం. కేఏ పాల్‌ను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించామని, ఆయన అందుబాటులో లేరని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.



కోలలపూడి వద్ద ప్రమాదానికి గురైన కారు

నలుగురిని బలిగొన్న శునకాలు!

- 'మార్టూరు'లో కారుకు అడ్డుగా రావడంతో ప్రమాదం
- వృద్ధ దంపతులతోపాటు మనవడి మృతి
- కుమారుడు, కోడలికి తీవ్ర గాయాలు
- కనిగిరి వద్ద మరో ఘటన.. కుక్క అడ్డొచ్చి బైకిస్టు దుర్మరణం
- మృతుడు ఆస్ట్రేలియాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు
- రెండ్రోజుల్లో ఆస్ట్రేలియా బయలుదేరనుండగా మృత్యువాత



దామర్ల లక్ష్మయ్య, వెంకట సుబ్బమ్మ



హేమంత్

మార్టూరు, కనిగిరి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా మార్టూరు మండలం కోలలపూడి వద్ద, అలాగే ప్రకాశం జిల్లా కనిగిరి సమీపంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. రెండు ఘటనల్లోనూ శునకాలు అడ్డురావడంతో వాహనాలు అదుపతప్పి నలుగురు ప్రాణాలు కోల్పోయారు. వివరాలివీ.. తిరుపతిలోని పోస్టల్ కాలనీ నివాసి అయిన దామర్ల లక్ష్మయ్య రేడియేటర్ మెకానిక్‌గా పని చేస్తున్నారు. మహాలయ అమావాస్యకు కాకినాడ జిల్లా పిఠాపురంలోని కోటిలింగాల క్షేత్రంలో శాంతి కార్యక్రమం కోసం ఐదుగురు కుటుంబ సభ్యులతో కలిసి కారులో శనివారం రాత్రి బయల్దేరారు. ఆదివారం వేకువజామున బాపట్ల జిల్లా మార్టూరు మండలం బొల్లాపల్లి టోల్ ప్లాజా సమీపానికి రాగానే కుక్క రోడ్డు దాటుతూ అకస్మాత్తుగా కారుకు అడ్డం వచ్చింది. దీన్ని తప్పించే క్రమంలో కారు జాతీయ రహదారి అంచులో ఉన్న సిమెంట్ దిమ్మెను ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న వృద్ధ దంపతులు దామర్ల లక్ష్మయ్య (75), వెంకటసుబ్బమ్మ (65)తోపాటు డ్రైవింగ్ చేస్తున్న వారి మనుమడు హేమంత్ (25) అక్కడికక్కడే మృతి చెందారు. కారులో వెనుక సీటులో కూర్చొన్న లక్ష్మయ్య కుమారుడు గణేష్‌బాబు, కోడలు పద్మజ తీవ్ర గాయాలతో కారులో ఇరుక్కుపోయారు. విషయం తెలియడంతో పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని వారిని అతికష్టమ్మీద బయటికి తీసి మార్టూరులోని ప్రభుత్వ వైద్యశాలకు, అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆదివారం సాయంత్రం పోస్టుమార్టం అనంతరం ముగ్గురి మృతదేహాలను బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేషగిరిరావు తెలిపారు.

సోదరుడి వివాహం కోసం వచ్చి..



సుధీర్‌రెడ్డి

అలాగే ప్రకాశం జిల్లా కనిగిరి పట్టణంలోని కొత్తపేటకు చెందిన ముక్కు సుధీర్‌రెడ్డి (35), సోదరుడు సుమంత్‌రెడ్డితో కలిసి ఆస్ట్రేలియాలో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నారు. రెండు నెలల క్రితం సోదరుడి వివాహం నిమిత్తం స్వగ్రామానికి వచ్చారు. సుధీర్‌రెడ్డి రోజూ ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్తుంటారు. ఆదివారం వాకింగ్ ముగించుకొని బైక్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో కుక్క అడ్డొచ్చింది. దాన్ని తప్పించబోయి కిందపడటంతో తలకు బలమైన గాయమైంది. 108లో ఆయన్ను కనిగిరిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. మరో రెండు రోజుల్లో తిరిగి ఆస్ట్రేలియా వెళ్లేందుకు సిద్ధమవుతున్న సుధీర్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

చిట్టి తల్లీ నిశ్చింతగా చదువుకో!

» నీ చదువుకు నేను భరోసా.. కేజీబీవీలో సీటు బాధ్యత నాది

» 'ఆంధ్రజ్యోతి' జెస్సీ కథనంపై మంత్రి లోకేశ్ స్పందన



అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కేజీబీవీలో సీటు రాకపోవడంతో పొలం పనులకు వెళుతున్న జెస్సీ కథనాన్ని 'ఆంధ్రజ్యోతి'లో చదివి తాను చలించిపోయానని విద్యాశాఖ మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. మంత్రాలయం మండలం బూదురుకు చెందిన జెస్సీ చదువుల కలను వెలుగులోకి తీసుకొచ్చిన 'ఆంధ్రజ్యోతి'కి అభినందనలు తెలిపారు. "అధికారులతో మాట్లాడాను. చిట్టి తల్లీ.. కేజీబీవీలో నీకు సీటు వస్తుంది. నిశ్చింతగా చదువుకో." అని జెస్సీకి భరోసా ఇచ్చారు. పరిస్థితులు ఏమైనా కానీ పుస్తకాలు, పెన్ను పట్టాల్సిన చేతులు పత్తి చేలో మగ్గిపోవడం బాధాకరమని, తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపితే 'తల్లికి వందనం' వస్తుందని తెలిపారు. చక్కటి యూనిఫాం, పుస్తకాలు, బ్యాగు, బూట్లు, సాక్సులు, బెల్టు ఇస్తున్నామని, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతున్నామని పేర్కొన్నారు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకులుగా తీర్చిదిద్దే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. పిల్లల భద్రత-భవితకు భరోసానిచ్చే బడికి మించిన సురక్షిత ప్రదేశం మరొకటి లేదన్నారు. విద్యకు పిల్లలను దూరం చేయొద్దని తల్లిదండ్రులకు లోకేశ్ విన్నవించారు.

ఆర్‌డీటీ సేవలు కొనసాగుతాయి

» కేంద్రంతో మాట్లాడుతున్నాం.. సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి

» ఆర్‌డీటీ నిర్వాహకుడికి లోకేశ్ హామీ

అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): "రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్‌డీటీ) అంటే స్వచ్ఛంద సంస్థ కాదు. లక్షలాది పేదల బతుకుల్లో వెలుగు నింపిన ఆశాకిరణం." అని విద్యాశాఖ మంత్రి లోకేశ్ అన్నారు. ఆర్‌డీటీ వంటి మానవతా సంస్థకు తాత్కాలికంగా ఇబ్బందులు వచ్చాయని, వాటిని శాశ్వతంగా పరిష్కరించి సేవలు నిరంతరాయంగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్‌డీటీ నిర్వాహకుడు మాంచో ఫెర్రర్ ఆదివారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి లోకేశ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సేవలకు కలిగిన అంతరాయం, తదనంతర పరిణామాలను మంత్రికి వివరించారు. లోకేశ్ స్పందిస్తూ.. సమస్య శాశ్వత పరిష్కారానికి మార్గాలు అన్వేషిస్తున్నామని, ఇది వరకే కేంద్రంతో మాట్లాడామని, సేవలు కొనసాగించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. తెలుగు ప్రజల పట్ల, తెలుగు భాష పట్ల ఎనలేని ప్రేమ చూపించే ఫెర్రర్ అంటే తనకు ఎంతో అభిమానమని లోకేశ్ తెలిపారు.

పరకామణి దొంగకు వైసీపీ గజదొంగల అండ

» శ్రీవారి సొత్తు దోచేసి.. ఆస్తులు ఇస్తే దొంగ దొర అయిపోతాడా?

» దొంగతనం చేసిన సొమ్ముతో స్థిరాస్తులు కొన్నారు

» వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డిపై సమగ్ర విచారణ చేయించాలి: నీలాయపాలెం



అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పవిత్రమైన శ్రీవారి ఆలయంలో వైసీపీ నాయకులు రూ.వందల కోట్లు స్వాహా చేశారని, పరకామణి దొంగకు వైసీపీ గజదొంగల బ్యాచ్ అండగా నిలుస్తోందని బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శించారు. ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతూ.. భక్తులు ఇచ్చే కానుకలు, డబ్బులు, డాలర్లు, బంగారం ఇతరత్రా వాటిని గత 15 ఏళ్లుగా దొంగతనం చేస్తున్నట్లు తేలిన దొంగకు శిక్ష వేయడం పోయి వైసీపీ నాయకులు వెనకేసుకొస్తున్నారని అన్నారు. రవికుమార్ అనే గుమస్తా.. శ్రీవారి వారి సొమ్ము దోచుకుని తిరుపతి, చెన్నై, విజయవాడల్లో విలువైన స్థలాలు, విల్లాలు కొనుగోలు చేశారని, అలాంటి వ్యక్తిని జైల్లో పెట్టి శిక్షించాల్సింది పోయి వైసీపీకి చెందిన ఇద్దరు మాజీ టీటీడీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నాటి ఈవో ధర్మారెడ్డి కలిసి అతనికి అండగా నిలిచారని విమర్శించారు. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు పెట్టిన 23 రోజుల తర్వాత లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుని నిందితుడిని వదిలేశారని అన్నారు. టీటీడీ బోర్డు కూడా రాజీకి అంగీకరించిందని అబద్ధాలు చెప్పారని అన్నారు. "స్వామి వారి ఆస్తులు దొంగతనం చేసి, ఆస్తులు రాసిస్తే దొంగ దొర అయిపోతాడా?." అని ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారంపై వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి, ధర్మారెడ్డిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. దొంగతనం చేసిన వ్యక్తి.. తన ఆస్తులను టీటీడీకి రాసిస్తే రూ.కోట్ల స్టాంపు డ్యూటీని భరించిన నాటి టీటీడీ బోర్డు సభ్యుడి పాత్రను కూడా నిగ్గుతేల్చాలని విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు.

జీఎస్టీ 2.0తో ప్రజారోగ్య సంరక్షణకు భరోసా!

» మందుల ధరలు తగ్గుతాయి

» వ్యాక్సిన్లు, హెచ్‌ఐవీ, హెపటైటిస్, టీబీ గుర్తింపు కిట్ల ధరలు కూడా

» ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్



అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సోమవారం నుంచి అమల్లోకి వస్తున్న వస్తు, సేవల పన్ను(జీఎస్టీ)-2.0తో ప్రజల ఆరోగ్య సంరక్షణకు మరింత భరోసా పెరిగిందని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. ఆరోగ్య బీమా ప్రీమియంపై ఇప్పటివరకు ఉన్న 18శాతం జీఎస్టీని తొలగించినందున మరిన్ని ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. అలాగే, జీఎస్టీ నూతన సంస్కరణల కారణంగా క్యాన్సర్, అరుదైన ఇతర వ్యాధుల మందులు, చికిత్సలకు సంబంధించిన పరికరాల ధరలు కూడా తగ్గుతాయని తెలిపారు. వ్యాక్సిన్లు, హెచ్‌ఐవీ, హెపటైటిస్, టీబీ గుర్తింపు కిట్ల ధరలు కూడా దిగివస్తాయన్నారు. జీఎస్టీ సంస్కరణలను స్వాగతిస్తూ శాసనసభలో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన ప్రసంగాలు, ఏకగ్రీవ తీర్మానానికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. జీఎస్టీ పన్నుల శ్లాబులను తగ్గించాలనే నిర్ణయం సాహసోపేతమైందిగా పేర్కొన్నారు. కేంద్రం నిర్ణయంతో సామాన్య, మధ్యతరగతి వర్గాలకు ఎంతో ఊరట కలుగుతుందని తెలిపారు.



శరన్నవరాత్రుల నేపథ్యంలో విజయవాడలోని దుర్గమ్మ ఆలయం, కనకదుర్గమ్మ వంతెనకు విద్యుద్దీపాలంకరణ



విజయవాడ ఉత్సవ్ కోసం పున్నమి ఘాట్ వద్ద చేస్తున్న ఏర్పాట్లు

60 రోజులు రాకుంటే అనర్హతే!

» ఈ నిబంధన రాజ్యాంగంలోనే ఉంది

» అసెంబ్లీ నియమాలూ చెబుతున్నాయ్

» ఈ విషయాలు జగన్‌కు తెలియనివా?

» కావాలంటే ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు

» డిప్యూటీ స్పీకర్ రఘురామ వ్యాఖ్యలు

» ప్రతిపక్ష హోదా చాక్లెట్టో.. బిస్కెట్టో కాదు మారాం చేస్తే ఇవ్వడానికి: మంత్రి అనిత

» సభను బహిష్కరిస్తే వేటే: యనమల

కాళ్ల/ఒంగోలు కార్పొరేషన్/కొండపి/తునిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): "గతంలో ఎంపీగా, విపక్ష నాయకుడిగా, సీఎంగా పని చేసిన జగన్‌కు శాసన సభ నిబంధనలు తెలియవా?." అని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రశ్నించారు. పశ్చిమగోదావరి జిల్లా పెద అమిరంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ చేసిన వ్యాఖ్యలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సభ్యుడు ఎవరైనా సభాపతి అనుమతి తీసుకోకుండా వరుసగా 60 రోజులపాటు సమావేశాలకు హాజరుకాకపోతే ఆ సభ్యుడు అనర్హులవుతారని తెలిపారు. ఈ విషయం రాజ్యాంగంలోని ఆర్టికల్ 190(4)లో చాలా స్పష్టంగా ఉందన్నారు. అదేవిధంగా అసెంబ్లీ నిబంధనావళిలోని క్లాజ్ 187(2)లో కూడా స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. అసెంబ్లీ రూల్స్ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని, కావాలంటే చూసుకోవచ్చని సూచించారు. వైసీపీ అధ్యక్షుడు, సలహాదారులు, ఎమ్మెల్యేలు ఆ నిబంధనలను పరిశీలిస్తే.. ఎవరు ఎవరిని తప్పుదోవ పట్టిస్తున్నారనేది అర్థం అవుతుందన్నారు. "సభలో ప్రతిపక్ష సభ్యులకు ఎంత సమయం ఇవ్వాలి.. అనేది ఆయా



పార్టీల బలాబలాలను బట్టి ఉంటుంది. సభ జరిగినన్నాళ్లు ప్రతి రోజు ప్రశ్నోత్తరాల సమయంలో రెండు ప్రశ్నలు వైసీపీ సభ్యులకు వస్తున్నాయి. కానీ, వాళ్లు ఎవరూ సభలో ఉండటం లేదు. సభ్యత, సంస్కారంతో మాట్లాడితే.. సభలో కాస్త ఎక్కువ సమయం ఇచ్చే అవకాశాలు ఉంటాయి." అని తెలిపారు.

వైసీపీ ఎమ్మెల్యేలకు ఆ భాగ్యం పోయింది: అనిత



"వైసీపీ అధినేత జగన్ అడుగుతున్న ప్రతిపక్ష హోదా అనేది చాక్లెట్టో.. బిస్కెట్టో కాదు. చిన్నపిల్లాడిలా మారాం చేయగానే ఇవ్వడానికి. అది ప్రజలు ఇవ్వాలి." అని హోం మంత్రి వంగలపూడి అనిత ఎద్దేవా చేశారు. ఆదివారం ఒంగోలుకు వచ్చిన ఆమె మీడియాతో మాట్లాడారు. "రాజకీయాల్లో ఎమ్మెల్యే హోదా గొప్ప వరం. అసెంబ్లీలో ఒక్కసారి అయినా అధ్యక్షా అని మాట్లాడాలని ఉంటుంది. జగన్ పుణ్యమా అని వైసీపీ ఎమ్మెల్యేలకు ఆ భాగ్యం లేకుండా పోయింది. అసెంబ్లీకి రాకుండా బయట ఉండి విమర్శలు చేస్తే ఎలా." అని ఆమె ప్రశ్నించారు. నాడు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు ఒక్కరే అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారని, టీడీపీ ఎమ్మెల్యేలంతా సభలో నిలబడి పోరాడారని అనిత గుర్తు చేశారు. జగన్ ప్రస్తుతం పులివెందులకు ఎమ్మెల్యే మాత్రమేనన్నారు. ఆ హోదాలోనే ఆయన అసెంబ్లీలో మాట్లాడాలన్నారు.

ఎమ్మెల్యేగా ప్రమాణం చేసి..!



ఎమ్మెల్యేగా ప్రమాణం చేసిన జగన్ అసెంబ్లీని బహిష్కరిస్తాననడం ముమ్మాటికీ అనర్హత పరిధిలోకే వస్తుందని టీడీపీ సీనియర్ నేత, పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. కాకినాడ జిల్లా తునిలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. అనర్హత వేటు నిబంధన ఏమిటంటూ జగన్ అడగటం హాస్యాస్పదమన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 188, 190(4) చదివితే అర్థం అవుతుందని తెలిపారు. ఎమ్మెల్యేలు వరుసగా 60 రోజులపాటు సభకు రాకపోతే వారిపై అనర్హత వేటు వేయవచ్చని యనమల తెలిపారు.

విధ్వంస పాలకులు మళ్లీ రాకూడదు

విధ్వంస పాలకులు 30 ఏళ్లపాటు అధికారంలోకి రాకూడదని అనిత అన్నారు. అలాంటి వారు మళ్లీ వస్తే అభివృద్ధిలో రాష్ట్రం వెనుకబడిపోతుందన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా మర్లపాడులో మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామితో కలిసి టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్, దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు, దివంగత నేత పరిటాల రవి విగ్రహాలను ఆదివారం ఆమె ఆవిష్కరించారు. వైసీపీ ప్రభుత్వంలో కేసు నమోదు కాని టీడీపీ నాయకుడు, కార్యకర్త లేరని ఆమె తెలిపారు. అలాంటి చీకటి రోజులు మళ్లీ వద్దని, విధ్వంస పాలకులు అధికారంలోకి రాకూడదని అన్నారు.

'విజయవాడ ఉత్సవ్' జోష్!

» మైసూరు దసరా ఉత్సవాలను తలపించేలా తెలుగు సంస్కృతి ప్రతిబింబించేలా ఏర్పాట్లు

» నేడు పున్నమి ఘాట్ వద్ద అట్టహాసంగా ప్రారంభం

విజయవాడ సిటీ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా... మైసూరు దసరా ఉత్సవాలను తలపించేలా నిర్వహించనున్న 'విజయవాడ ఉత్సవ్'కు సర్వం సిద్ధమైంది. దసరా సందర్భంగా విజయవాడలో సోమవారం సాయంత్రం ప్రారంభమయ్యే ఈ ఉత్సవ్‌లో భాగంగా నగరవ్యాప్తంగా 11 రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగనున్నాయి. 50 లక్షల మందికిపైగా భక్తులు, పర్యాటకులు ఈ ఉత్సవ్‌కు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రం, ఘంటసాల సంగీత కళాశాలలో 200కు పైగా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ప్రతి కార్యక్రమంలోనూ తెలుగుదనం ప్రతిబింబించేలా రూపకల్పన చేశారు. కూచిపూడి, భరతనాట్యం, భక్తి సంగీతం, సాంఘిక నాటకాలు, హరికథలు, బుర్రకథలు, తోలుబొమ్మలాట, పద్య, పౌరాణిక నాటకాల ప్రదర్శనతో పాటు పున్నమి ఘాట్‌లో దాండియా, దేవీ దర్శనం, లైవ్ బ్యాండ్స్, వాటర్ స్పోర్ట్స్, డ్రోన్ షో, ఫైర్ వర్క్స్ నిర్వహిస్తారు. గొల్లపూడిలో విజయవాడ ఎక్స్‌పో నిర్వహిస్తారు. దీనిలో ఎమ్యూజ్‌మెంట్ పార్క్, గ్లోబల్ విలేజ్, ఫుడ్ కోర్టులు, మార్కెట్లు, ఓపెన్ థియేటర్లు ఉంటాయి. సినీ సంగీత దర్శకులైన మణిశర్మ, ఆర్పీ పట్నాయక్, కార్తీక్‌ల మ్యూజిక్ లైవ్, తో పాటు గాయకులు సునీత, రామ్ మిరియాల, గీతామాధురితో లైవ్‌షోలు నిర్వహిస్తారు. ఎంజీ రోడ్డులో లక్షమందితో మెగా కార్నివాల్ నిర్వహిస్తారు. విజయవాడ ఉత్సవ్‌ను ఆకాశం నుంచి వీక్షించేందుకు వీలుగా హెలికాప్టర్ రైడ్‌లు సిద్ధం చేశారు. సిద్ధార్థ మెడికల్ కాలేజీ నుంచి రైడ్ ప్రారంభమవుతుంది. విజయవాడ ఉత్సవ్‌కు సంబంధించిన ప్రత్యేక గీతాన్ని ఆదివారం విడుదల చేశారు. మాజీ ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు చేతుల మీదుగా సోమవారం సాయంత్రం 6 గంటలకు పున్నమి ఘాట్ వద్ద 'విజయవాడ ఉత్సవ్'ను ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. కాగా, విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా గొల్లపూడిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్థలంలో వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన 15ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్నారు. స్టాల్స్, వినోదంతో పాటు మూవీ ఈవెంట్లు, సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారు.

బరిలోకి భారతి!

(మొదటి పేజీ తరువాయి)

ఆ నియమాలే పాటిస్తున్నట్లు కనిపిస్తోంది. జగన్ స్వయంగా చెప్పినట్లుగా ఆయనకు సెల్‌ఫోన్ లేదు. భారతి దగ్గర కూడా సెల్‌ఫోన్ ఉంటుందో లేదో తెలియదు కానీ.. మూడు రకాల పద్ధతుల్లో పార్టీ నేతలతో మంతనాలు సాగిస్తున్నట్లు అత్యంత విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. బాగా ప్రముఖులైన పార్టీ నాయకులతో ఆమె నేరుగా మాట్లాడుతున్నారు. ఫోన్‌లోనూ మాట్లాడుతున్నారు. కానీ తన ఫోన్‌నుంచి మాత్రం కాదు. జగన్ కుటుంబానికి నమ్మినబంటుగా ఉంటు మద్యం కేసులో చిక్కుకున్న ఓ రిటైర్డ్ మధ్య స్థాయి అధికారి ఫోన్ నుంచే ఆమె పెద్ద లీడర్లతో మాట్లాడుతున్నారు. అదే పార్టీలో మధ్య స్థాయి నేతలతో సంప్రదించాల్సి వచ్చినప్పుడు మరో పంథా అనుసరిస్తున్నారు. ఎవరో ఒక నాయకుడిని తన వద్దకు పిలిచి.. 'మేడం గారు ఇక్కడే ఉన్నారు. మీతో ఇలా చెప్పమన్నారు' అని మాట్లాడిస్తున్నారు. అవసరమైతే ఆమె కూడా మాట్లాడుతారు. మరీ కింది స్థాయి వారయితే, ఆ పార్టీ జిల్లా నేతలు వెళ్లి ఆమె తరఫున వారితో మాట్లాడుతున్నారు. కొందరు వైసీపీ నేతల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం.. ఆమె ప్రస్తుతానికి వైసీపీ అంతర్గత వ్యవహారాలు, ప్రభుత్వ పని తీరు, పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చిస్తున్నట్లు చెబుతున్నారు.

భారతి పాత్రపై చర్చ

మరోవైపు లిక్కర్ కేసులో జగన్ అరెస్ట్ తప్పదా? అంటూ రకరకాల ఊహాగానాలు, ప్రచారాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి కదలికా లేదు. కానీ జగన్, ఆయన శిబిరం మాత్రం ఒక వేళ అరెస్ట్ చేస్తే అప్పుడు ఏం చేయాలనే ఆలోచన కూడా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భారతి ఎంట్రీ చర్చనీయాంశంగా మారింది. ఆమె నేరుగా పార్టీ క్రియాశీల కార్యకలాపాల్లోకి దిగితే పరిణామాలు ఎలా ఉంటాయన్న చర్చ కూడా వైసీపీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. అయితే, ఇప్పటి వరకు ఆమె అతి కొద్దిమందితోనే మాట్లాడారని తెలుస్తోంది. సమాచారం బయటకు పొక్కకుండా ఉండేందుకు పలు జాగ్రత్తలు తీసుకుంటూ, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిసింది.

పార్టీలో గందరగోళం

అధికారం కోల్పోయిన తర్వాత పార్టీ పిలుపు మేరకు జగన్ నేరుగా ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నది లేదు. 'ఉద్యమించండి, ధర్నాలు చేయండి' అని అందరికీ చెప్పి ఆయన బెంగళూరుకు వెళ్లిపోతున్నారు. అసెంబ్లీకి వెళ్లి ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశాన్ని కూడా ఆయన దూరం పెట్టేశారు. దీంతో పార్టీ నేతలకు, ఆయనకు మధ్య అగాథం పెరుగుతోంది. కార్యకర్తలతో సరేసరి. నాయకుడు లేకుండా పోరాటాలు ఏమిటో కేడర్‌కు అర్థం కావడం లేదు. ఎవరెన్ని చెప్పినా జగన్ మాత్రం ప్యాలెస్ దాటి బయటకు రావడం లేదు. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో ఆయనకు చెప్పేవారు లేరు. ఒక వేళ ఆయనకు చెప్పినా పట్టించుకోలేరు. ఇటీవలి కాలంలో చేపట్టిన పలు ప్రభుత్వ వ్యతిరేక నిరసన కార్యక్రమాలు విఫలమయ్యాయి. మొన్నటికి మొన్న యూరియా, మెడికల్ కాలేజీల విషయంలో ఆర్భాటం చేసినా ఆ తర్వాత తుస్సుమనిపించారు.

జిల్లా, క్షేత్రస్థాయి నాయకులకు సరైన దిశానిర్దేశం లేకపోవడంతో గందరగోళం ఏర్పడింది. జగన్‌కు ఆత్మగా చెప్పుకొనే సజ్జల రామకృష్ణారెడ్డి ప్రెస్‌మీట్‌లు పెట్టి సమస్యలను మరింత జటిలం చేస్తున్నారు. పార్టీలో ఉన్న అసమ్మతిని, అసంతృప్తిని సద్దుమణచడానికి జగన్ నుంచి ఎలాంటి ప్రయత్నాలు జరగడం లేదన్నది జగమెరిగిన సత్యం. పరిస్థితి ఇలాగే కొనసాగితే కొద్దికాలానికే పార్టీ తెరమరుగవుతుందన్న కొందరి నేతల అభిప్రాయాలతో భారతి అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. జగన్ కార్యకాలాపాలు ఎలా ఉన్నప్పటికీ, పార్టీ నేతలను ప్రత్యక్షంగా సమన్వయపరిచే బాధ్యతలను ఆమె తీసుకుంటున్నట్లు చెబుతున్నారు.

ఈ-పంట.. వీఏఏలకు తంటా!

» ఓ వైపు ఎరువుల పంపిణీ, మరోవైపు ఇతర విధులు

» ఫొటో క్యాప్చర్ దూరం తగ్గించాలని విజ్ఞప్తి

అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకు(వీఏఏ-వీహెచ్ఏ)లకు ఈ-పంట నమోదు సంకటం మారింది. జియో ఫెన్సింగ్ ద్వారా 20మీటర్ల దూరం నుంచి పొలాల్లోని పంటను ఫొటో తీసి, ఈ-పంట యాప్‌లో రైతుల వివరాలు నమోదు చేయమనడంతో నానా తంటాలు పడుతున్నారు. మెట్ట ప్రాంతాల్లో కాలువ చివరి భూములు, ఎత్తైన మెరక భూములు, వరి మాగాణుల్లో ఈ విధానం అమలు చేయడం కష్టమవుతోందని వీఏఏలు గగ్గోలుపెడుతున్నారు. వర్షాలు వరదలతో ఈ-పంట నమోదు నత్తనడక నడుస్తోంది. ఇటీవల వీఏఏలు, వీహెచ్ఏలు బదిలీలు కావడంతో కొత్త ప్రాంతాల్లో రైతుల వివరాలు తెలుసుకుని, నానా అవస్థలు పడుతూ క్షేత్రస్థాయికి వెళ్లి, ఈ-పంట నమోదు చేస్తున్నారు. గతంలో జియోఫెన్సింగ్ విధానం 200మీటర్ల వరకు ఉండగా, కేంద్రం ఫొటో క్యాప్చర్‌ను కుదించింది. పంటకు 20మీటర్ల వరకు వెళ్తేనే పోర్టల్‌లో ఫొటో క్యాప్చర్ అవుతోంది. కనీసం 100మీటర్లయినా లేకపోవడంతో క్షేత్రస్థాయిలో మహిళా వీఏఏలు, వీహెచ్ఏలు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో ఈ-పంట నమోదు ప్రక్రియను ఈ నెల 30లోగా పూర్తి చేయాలని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2.61కోట్ల ల్యాండ్ పార్సిల్స్ ఉండగా, ఇప్పటి వరకు 40శాతం కూడా పూర్తి కాలేదని సమాచారం. మరోవైపు రైతుసేవా కేంద్రాల్లో ఎరువుల అమ్మకాల బాధ్యత కూడా వీఏఏలకు అప్పగించారు. ఎరువులు అమ్మడం, ఆన్‌లైన్‌లో మార్క్‌ఫెడ్ ఖాతాలో సొమ్ము జమ చేయడం వంటి పనులు చేయాల్సి ఉంది. ఇంకోవైపు వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో రైతులకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసి, పరికరాలు అందజేయాల్సి ఉంది. ఏకకాలంలో ఇన్ని పనులు అప్పగించడంతో వీఏఏలు, వీహెచ్ఏలు భారంగా భావిస్తున్నారు. రాష్ట్రంలో 5,712మంది వీఏఏలు, 2,356మంది వీహెచ్ఏలు ఉన్నారు. వీరితో పాటు ఎంపీఈవోలు 1,369మంది, ఏఈవోలు 410మంది పని చేస్తున్నారు. ఒకరికొకరు సహకరించుకున్నా.. లక్ష్య సాధన కష్టతరంగా మారుతోందని వాపోతున్నారు. పని ఒత్తిళ్ల కారణంగా పలువురు అనారోగ్యం పాలుకావడం, ఒకరిద్దరు ఆత్మహత్యలు చేసుకున్న ఉదంతాలు ఉన్నాయి. ఎరువుల పంపిణీని సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాలకు అప్పగిస్తే.. ఈ-పంట నమోదుతో పాటు రైతులకు సాంకేతిక సహకారాన్ని అందించడం సులవుగా ఉంటుందని వీఏఏలు, వీహెచ్ఏలు అంటున్నారు.

నాడు పోగొడితే.. నేడు రాబట్టారు!

» మద్యం ఆదాయంలో రాష్ట్రమే టాప్

» వైసీపీ హయాంలో పొరుగుకు మేలు

» పాపులర్ బ్రాండ్లు లేకపోవడంతో ఇతర రాష్ట్రాల వైపు మందుబాబుల చూపు

» సరిహద్దుల్లో తీవ్ర స్థాయిలో ఆదాయ నష్టం

» ప్రభుత్వం మారాక పెరిగిన అమ్మకాలు

» 10.29% మేరకు పుంజుకున్న విక్రయాలు

» ఈ ఏడాది రూ.30 వేల కోట్ల ఆదాయం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏప్రిల్- ఆగస్టు మధ్య అమ్మకాలు(రూ.కోట్లలో)

రాష్ట్రం	2024-25	2025-26	పెరిగిన %
ఆంధ్రప్రదేశ్	11,812	13,028	10.29
తెలంగాణ	15,691	16,511	3.45
తమిళనాడు	23,957	25,228	5.3
కర్నాటక	17,639	18,392	4.27
కేరళ	8,093	8,638	6.74

జగన్ హయాంలో 'జే' బ్రాండ్లతో దోచుకున్నారు. కమీషన్ల కోసం మద్యం కంపెనీలకు చుక్కలు చూపించారు. మరోవైపు ఖజానాకు రావాల్సిన ఆదాయాన్ని పోగొట్టారు. వైసీపీ ప్రభుత్వం అమలుచేసిన అడ్డగోలు మద్యం విధానంతో రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం పక్క రాష్ట్రాలకు తరలిపోయింది. ఐదేళ్లలో సుమారు రూ.18 వేల కోట్ల ఆదాయ నష్టం వాటిల్లిందని ప్రభుత్వం అంచనా వేసింది. తాజాగా మద్యం అమ్మకాలపై తీసిన లెక్కలు ఇదే విషయాన్ని రుజువు చేశాయి. గత ప్రభుత్వంలో ఏపీలో మంచి బ్రాండ్లు లేక పక్క రాష్ట్రాల బాట పట్టిన మందుబాబులు ఇప్పుడు రాష్ట్రంలోనే మద్యం కొనుక్కుని తాగుతున్నారు. ఫలితంగా మన ఆదాయం మనకే దక్కుతోంది. ముఖ్యంగా రాష్ట్ర సరిహద్దుల్లోని షాపుల్లో అమ్మకాలు భారీగా పెరిగి, పక్క రాష్ట్రాల షాపుల్లో విక్రయాలు పడిపోయాయి. దీంతో 11.05 శాతం ఆదాయం పెరిగింది. కర్ణాటక మినహా మిగిలిన ఏ రాష్ట్ర మద్యం ఆదాయంలోనూ రెండంకెల వృద్ధి కనిపించలేదు.

అమ్మకాలు పైపైకి!

ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 5 నెలల్లో అమ్మకాలపై ఎక్సైజ్ శాఖ అధ్యయనం చేసింది. ఈ వివరాలను ఇటీవలి కలెక్టర్ల సదస్సులో ఆ శాఖ అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ ఐదు నెలల కాలంలో 10.29శాతం అమ్మకాలు పెరిగాయి. 2024-25లో రూ.11,812 కోట్ల అమ్మకాలు నమోదయ్యాయి. ఈ ఏడాది అదే కాలంలో రూ.13,028 కోట్ల విక్రయాలు జరిగాయి. అదే తెలంగాణలో 3.45 శాతం, తమిళనాడులో 5.3 శాతం, కర్ణాటకలో 4.27 శాతం, కేరళలో 6.74 శాతం మాత్రమే అమ్మకాలు పెరిగాయి. గతేడాది అక్టోబరులో కొత్త మద్యం విధానం అమల్లోకి వచ్చిన తర్వాత పరిస్థితి మారింది. ఆదాయాన్ని పరిశీలిస్తే.. ఐదు నెలల కాలంలో ఏపీ 11.05 శాతం వృద్ధి సాధించింది. తెలంగాణ 0.65 శాతం, తమిళనాడు 2.53 శాతం, కర్ణాటక 13.64 శాతం, కేరళ 6.25 శాతం ఆదాయం పెరిగింది. మద్యం అమ్మకాలు భారీగా నమోదయ్యే ఒక్క కర్ణాటక మినహా మిగిలిన అన్ని రాష్ట్రాల్లో ఆదాయం చెప్పుకోదగ్గ స్థాయిలో పెరగలేదు. ఏపీ ప్రజలు పక్క రాష్ట్రాల్లో మద్యం కొనుగోలు మానేయడం వల్లే అమ్మకాలు, ఆదాయం ఇలా పెరిగాయని అధికారులు అంచనా వేశారు. సాధారణంగా మద్యం విక్రయాలలో ఎప్పుడూ 10శాతం వృద్ధి ఉంటుంది. గత ప్రభుత్వం నిర్వాకంతో అమ్మకాలు పెంచుకున్న సరిహద్దు రాష్ట్రాలకు ఇప్పుడు ఆ అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా విక్రయాలు తగ్గాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా రూ.29,442 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.30 వేల కోట్లు దాటనుంది.

జిల్లాల వారీగా ఇలా...

జిల్లాలవారీగా గడిచిన 5 నెలల అమ్మకాలు పరిశీలిస్తే కర్నూలు టాప్‌లో ఉంది. తెలంగాణతో సరిహద్దు ప్రాంతం ఎక్కువగా ఉండే ఆ జిల్లాలో 57శాతం అమ్మకాలు పెరిగాయి. శ్రీసత్యసాయి జిల్లాలో 53 శాతం, అల్లూరిలో 52 శాతం, చిత్తూరులో 44శాతం అమ్మకాలు పుంజుకున్నాయి. కానీ, విజయనగరం, కృష్ణా, కడప, శ్రీకాకుళం జిల్లాల్లో అమ్మకాలు పెరగకపోగా తగ్గాయి. గుంటూరు, నెల్లూరులో 3 శాతం మాత్రమే అమ్మకాలు పెరిగాయి. అయితే, కొన్ని జిల్లాల్లో ఎమ్మార్పీ ఉల్లంఘనల కారణంగా అమ్మకాలు తగ్గుతున్నాయి.



రూ.132 కోట్ల భారం తగ్గింది

వైసీపీ ప్రభుత్వంలో నాసిరకం బ్రాండ్లతో ఇక్కడి మద్యం తాగాలంటే వినియోగదారులు భయపడ్డారు. వాటికే ధరలు విపరీతంగా పెంచడంతో అమ్మకాలు ఇంకా తగ్గాయి. పోనీ ఈ కారణాల వల్ల ప్రజలు మందు మానేశారా అంటే అదీ లేదు. ఎక్కువ ఖర్చయినా కొందరు పక్క రాష్ట్రాల నుంచి మద్యం తెప్పించుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సరైన ప్రమాణాలు పాటించని 29 బ్రాండ్లను నిలిపేశారు. 46 బ్రాండ్లు స్వచ్ఛందంగా ధరలు తగ్గించుకున్నాయి. ఈ ప్రభుత్వంలో కమీషన్ల బెడద లేకపోవడంతో తక్కువ ధరకే మద్యం సరఫరా చేసేందుకు ముందుకొచ్చాయి. దీంతో ఒక్కో లిక్కర్ బాటిల్‌పై రూ.10నుంచి రూ.100 వరకు ధర తగ్గింది. ఫలితంగా నెలకు వినియోగదారులపై రూ.132 కోట్ల భారం తగ్గింది. ఇది ఖజానాకు నష్టం అయినప్పటికీ ఏపీలో 11.05 శాతం వృద్ధి నమోదైందని అధికారులు చెప్పారు.


దసరా వేడుకలు
VIJAYAWADA UTSAV
DASARA BLOCKBUSTER
SPOT GIFTS OFFERS
ఈ దసరా షాపింగ్‌తో స్పాట్ గిఫ్ట్స్‌లో ఆశ్చర్యపోయే బహుమతులు పొందండి
SPOT GIFTS
GST BACHAT UTSAV
PATTU SAREES
BUY SWARNA PATTU SAREE @4495 & GET 2ND SAREE @ ₹45
50% OFF ₹898 ₹449 SHILPAKALA MALLIKA SILK
50% ₹398 ₹199 OREA SILK
50% ₹550 ₹275 LINEN COTTON
50% ₹598 ₹299 SHALINI SILK
50% ₹650 ₹325 KUNDAN GEORGETTE
50% ₹1098 ₹549 TANCHOI SILK
50% ₹1150 ₹575 DIAMOND SILK
50% ₹1198 ₹599 KOTA DIGITAL
50% ₹1350 ₹675 AAROHI SILK
50% ₹1998 ₹999 PURE SATIN SILK
50% ₹3250 ₹1625 KANCHI KUPPADAM SILK
MENS WEAR
BUY 3 ₹1500 JEANS
BUY 3 ₹1500 COTTON JEANS
BUY 3 ₹1500 CASUAL SHIRTS
BUY 1 ₹295 BOYS T-SHIRTS -NECKER
BUY 1 ₹445 BOYS NIGHT WEAR
SUITING & SHIRTING
SPECIAL OFFERS ON LEADING MENS WEAR BRANDS
R.S. Brothers
బీసెంట్ రోడ్ క్రాస్, ఏలూరు రోడ్ విజయవాడ
బందర్ రోడ్ విజయవాడ
1800 570 1999
Email : info@rsbrothers.net Shop us @ www.rsbrothers.net Follow us on : RSBrothersIndia rsbrothersindia


VIJAYAWADA UTSAV
WEDDINGS & DASARA CELEBRATIONS
The Timeless Festive Collection
షాపింగ్ చేయండి... విలువైన బహుమతులు పొందండి
GST Great Saving Time
Super DOUBLE DHAMAKA
OFFERS & SPOT GIFTS
SPOT GIFTS
ప్రతి 2000/- అపై వస్త్రాల కొనుగోలుపై
కంచి, ధర్మవరం, ఆరణి, ఉప్పాడ లలో సరికొత్త వెడ్డింగ్ కలెక్షన్
SAREES
KAMAKSHI PATTU ₹4395 GET 2nd SAREE @ ₹45
50% KOYAL SILK ₹398 ₹199
50% CRYSTAL SILK ₹450 ₹225
50% LEPAKSHI SILK ₹598 ₹299
50% RICCO PATTU ₹650 ₹325
50% MITIKA SILK ₹750 ₹375
50% PURE SILK PRINT ₹850 ₹425
50% BRASSO SILK ₹1098 ₹549
50% MEENA KANCHI SILK ₹2650 ₹1325
SOUTH INDIA shopping mall
ఏలూరు రోడ్, బీసెంట్ రోడ్ క్రాస్, విజయవాడ - 2.
SPECIAL OFFERS ON LEADING MENS & KIDS WEAR BRANDS
1800 570 6999 CALL US
Shop Online 24x7 @ www.SISMD.in


1.5 CRORE
TVS
TVS XL100
కేవలం వంద కాదు, వంద కంటే ఎక్కువ.
₹47 554
₹43 700
నుండి ప్రారంభం#
8 ఏళ్ళ^ ఉచిత వారంటీ
స్కాన్ చేయండి
₹5 000** వరకు GST ఆదా
₹4 999* తక్కువ డౌన్ పేమెంట్
1800 3157 100
Ex-showroom price of TVS XL100 Heavy Duty Kick Start variant in Andhra Pradesh. Ex-showroom price effective from 22nd September 2025. ^ Free warranty applicable till 31st of September 2025. ** ₹5 000 GST savings on purchase of TVS XL100 Win Edition variant. * Finance at the sole discretion of the financier. T&C apply.
TVS CREDIT
SHRIRAM Finance
IndusInd Bank
IDFC FIRST Bank
FOR ALL INSTITUTIONAL/BULK REQUIREMENTS PLEASE MAIL corporate.customersupport@tvsmotor.com CENTRAL ANDHRA AUTHORISED MAIN DEALERS: